ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
తాడేపల్లిగూడెం : fb.com/vaartha Digital
Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam
14-5-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 102 పేజీలు: 10+4 వెల: 6.50

శ్రీనగర్ నుంచి ఇక హజ్ సర్వీసులు
అర్ధరాత్రి పారిపోయిన బంగ్లా మాజీ అధ్యక్షుడు
5లో

# తిరుగులేని సైనిక సత్తా


మంగళవారం ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సైనికులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోడీ

### శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిన భారత్ ఆర్మీ
### పాక్ మిసైల్, డ్రోన్‌లు మనముందు దిగదుడుపే..
### ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్
### ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో సైనికులతో ప్రధాని మోడీ
### ఎస్-400 ముందు నిలబడి సెల్యూట్ చేసిన ప్రధాని

**అమృత్‌సర్, మే 13:** భారత్ మాతా కీ జై అనేది కేవలం నినాదం కాదని, దేశం కోసం తమ ప్రాణాలను అంకితం చేస్తామని మన సైనికులు చేసే ప్రతిజ్ఞ అని ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యానించారు. భారత్ మాతా కీ జై అనే నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని అన్నారు. భారత సైనికుల ధైర్య సాహసాల కారణంగా ఆపరేషన్ సిందూర్ విజయం ప్రతిధ్వనులు ప్రపంచ వ్యాప్తంగా వినబడుతున్నాయని మోడీ చెప్పారు. భారత సైనికులు కొట్టిన దెబ్బకు శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయని మోడీ వ్యాఖ్యానించారు. భారత క్షిపణులు, డ్రోన్లు పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని, పాక్‌లో ఎక్కడకూడా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని మోడీ అన్నారు. పాక్ సైన్యానికి నిద్రలేని పరిస్థితి సృష్టించామన్నారు. భారత వైమానిక స్థావరాలపై దాడులు చేసేందుకు పాక్ నిరంతరం ప్రయత్నించిందని ఐతే సరిహద్దుల ఆవలే మన త్రివిధదళాలు ఆ దాడులను తిప్పికొట్టాయని తెలిపారు. పంజాబ్‌లోని జలంధర్ జిల్లాలో ఉన్న ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన ఆయన, సైనికులతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మవిశ్వాసానికి కొత్త ప్రమాణాలను లిఖించిందన్న మోడీ, కేవలం 25 నిమిషాల్లో సరిహద్దు ఆవల ఉగ్ర స్థావరాలను కచ్చితంగా గురిచూసి కొట్టామని తెలిపారు. మన క్షిపణి రక్షణ వ్యవస్థ ముందు పాక్ డ్రోన్లు, క్షిపణులు, విమానాలన్నీ తుడిచిపెట్టుకు పోయాయన్నారు. మన త్రివిధదళాలు చూపిన సామర్థ్యం ప్రపంచాన్ని నివ్వెరపరిచిందని తెలిపారు. మళ్లీ ఉగ్రదాడి జరిగితే భారత్ ఇచ్చే సమాధానం ఎలా ఉంటుందో పాక్‌కు అర్థమైందని మోడీ వెల్లడించారు. ఉగ్రదాడి జరిగితే నచ్చిన సమయంలో నచ్చినట్లు భారత్ ప్రతీకార దాడి చేస్తుందని మోడీ స్పష్టం చేశారు. ఉగ్రవాదులు, ఉగ్రవాదానికి మద్దతిచ్చే వారిని వేర్వేరుగా చూడమని అన్నారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిలింగ్‌కు భారత్ ఎట్టిపరిస్థితుల్లోనూ తలొగ్గదని అన్నారు. త్రివిధదళాలు ఎవరి బాధ్యత వారు అద్భుతంగా నిర్వహించారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మానవశక్తి, యంత్రశక్తి మధ్య అద్భుతమైన సమన్వయంతో పనిచేసినట్లు చెప్పారు. వీర సైని >>2


# సిబిఎస్ఇ టెన్త్‌లో బాలికల హవా

### మొత్తం 93.66% విద్యార్థుల ఉత్తీర్ణత
### విజయవాడ ప్రాంతంలో మెరుగైన ఫలితాలు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** సిబిఎస్ఇ పదో తరగతి ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. ఫలితాల్లో 93.66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, బాలికలే పైచేయి సాధించారు. గతేడాదితో పోలిస్తే 0.06 శాతం అధిక ఉత్తీర్ణత పొందారని అధికారులు వెల్లడించారు. 10, 12వ తరగతుల పరీక్షలను ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు సిబిఎస్ఇ విజయవంతంగా నిర్వహించింది. మార్చి 18న 10వ తరగతి పరీక్షలు ముగిశాయి. ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలకు 16 లక్షలకు పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 14 లక్షలకు పైగా విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. విజయవాడ ప్రాంతంలో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించారు. పరీక్షల కోసం సిబిఎస్ఇ భారత్‌తో పాటు విదేశాల్లోనూ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో భారత్‌లో 7,842 కేంద్రాలు, విదేశాల్లో 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరీక్షలను బోర్డు చాలా పకడ్బందీగా నిర్వహించింది.
రెగ్యులర్ విద్యార్థులు తప్పనిసరిగా స్కూల్ యూనిఫాం ధరించాలని, ప్రైవేట్ అభ్యర్థులు మరోక రంగు దుస్తులను ధరించాలని పలు మార్గదర్శకాలను విడుదల చేసింది. పరీక్షా రోజుల్లో విద్యార్థుల రాకపోకలు పెరిగినందున, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్, సిఐఎస్ఎఫ్ భాగస్వామ్యంతో ప్రత్యేక సౌకర్యాల చర్యలను తీసుకుంది. పదో తరగతి ఫలితాల్లోనూ విజయవాడ రీజియన్ అద్భుతాన్ని సృష్టించింది. 99.79 శాతంతో విజయవాడతో పాటు తిరువనంతపురం అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో బెంగళూరు 98.9, చెన్నై 98.71, పుణె 96.54 శాతం ఉన్నాయి. 12వ తరగతి ఫలితాలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్( సిబిఎస్ఇ) విడుదల చేసింది. ఈ ఫలితాల్లో 88.39 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సంవత్సరం 12వ తరగతిలో 91 శాతం మంది >>2

# లిక్కర్ కేసు: బాలాజీ గోవిందప్ప అరెస్టు

**విజయవాడ,మే13 ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న బాలాజీ గోవిందప్పను సిట్ అధికారులు అరెస్ట్‌చేశారు. పక్కా సమాచారంతో మైసూరులో ఆయన్ను అరెస్ట్ చేసి విజయవాడకు తీసుకు వస్తున్నారు. గోవిందప్ప భారతి సిమెంట్లు పూర్తి కాలపు డైరెక్టర్‌గా ఉన్నారు. మద్యం కుంభకోణం కేసులో విచారణకు హాజరుకావాలంటూ గోవిందప్పతో పాటు సిఎంఒ మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, మాజీ సిఎం జగన్ ఒఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డికి మూడు రోజుల క్రితం సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ ముగ్గురునీ విజయవాడ కమీషనరేట్‌లోని సిట్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకవాలని ఆదేశించారు. ఈ ముగ్గురూ నోటీసులను బేఖాతరు చేస్తూ విచారణకు గైర్హాజరయ్యారు. ఇప్పటికే వీరి ముందస్తు బెయిల్ పిటీషన్‌ను హైకోర్టు కొట్టేసింది. సుప్రీంకోర్టు సైతం అరెస్ట్ నుండి వీరికి మధ్యంతర రక్షణ ఇవ్వడానికి నిరాకరించింది. జగన్‌కు బాలాజీ గోవిందప్ప, ధనుంజయరెడ్డి, కృష్ణమోహనరెడ్డి అత్యంత సన్నిహితులు. మద్యం సరఫరా కంపెనీలు, డిస్టిలరీల నుంచి ముడుపులు వసూలు చేయడం, ఆ సొమ్మును డొల్ల కంపెనీలకు మళ్లించడంలో కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్పలతో పాటు ధనుంజయరెడ్డి పాత్రఉంది. ముడుపులుగా ఎంత మొత్తం చెల్లించాలనే దానిపై ఈ >>2



# 1.34 లక్షల కోట్ల ఆదాయం లక్ష్యం

### సాంకేతిక వినియోగంతో పన్ను ఎగవేతకు చెక్
### ఎర్రచందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు
### ఆదాయార్జన శాఖల సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే13,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైనఅధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభ్యున్నతి, సంక్షేమం, అమరావతి నిర్మాణం, ప్రాజెక్టుల నిర్మాణ వీటన్నింటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు కచ్చితంగా ఆదాయ లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సి ఉందన్నారు. ఏయే ప్రభుత్వరంగ శాఖలపరంగా ఆదాయాన్ని పెంచుకోవడానికి అవకాశాలున్నాయో నిరంతర అధ్యయనం, అవగాహన అవసరమన్నారు. అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు సిఎం సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్**

పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువుగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంభించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం**

రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన >>2

# టిటిడిలో రేపటినుంచి మళ్లీ సిఫార్సు లేఖలపై దర్శనాలు

**తిరుమల, మే 13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి విఐపి బ్రేక్ దర్శనాలతోబాటు ఆర్జితసేవల దర్శన టిక్కెట్ల జారీకి ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలు తిరిగి పునరుద్ధరిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ పునరుద్ధరణ రేపటినుండి (ఈనెల 15వతేదీ) అమలులోకి వస్తుండగా భక్తులకు దర్శనాలు 16వతేదీ శుక్రవారం నుండి పున:ప్రారంభమవుతాయని టిటిడి ప్రకటించింది. అయితే శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు అభిషేకసేవ నిర్వహించిన అనంతరం ఉదయం 8గంటలకు విఐపి బ్రేక్ దర్శనాలు అనుమతిస్తారు వారంలో గురువారం రోజుకూడా ఇదే సమయం అమలవుతుంది. మిగిలిన రోజుల్లో ఉదయం 5.30 గంటలనుండి 7.30గంటలలోపే విఐపి జనరల్ బ్రేక్ ముగించి ఆ తరువాత సామాన్యభక్తులను అనుమతిస్తారు. ఇక శ్రీవాణి బ్రేక్‌దర్శనాలు ఉదయం 10గంటలకు, దాతల దర్శనాలు ఉదయం 10.30గంటలకు, టిటిడి ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు, విశ్రాంత ఉద్యోగులుకు ఉదయం 11గంటలకు బ్రేక్ దర్శనాలు అమలవుతాయి. ఈ నూతన దర్శనాల వేళలు ఈనెల 1వతేదీ నుండి అమల్లోకి >>2



# ఈతకు వెళ్లి ఐదుగురు చిన్నారుల గల్లంతు

### కడపజిల్లా మల్లేపల్లిలో విషాదం

**రాజంపేట అర్బన్, మే13, ప్రభాతవార్త:** వేసవి సెలవులను ఎంజాయ్ చేసేందుకు వచ్చిన ఐదుగురు చిన్నారులు ఓ చెరువులో గల్లంతైన విషాదకర సంఘటన కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం మల్లేపల్లి గ్రామంలో జరిగింది. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. గల్లంతైన చిన్నారుల కోసం పెద్దఎత్తున గాలింపు జరుగుతోంది. గజఈతగాళ్లతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకొని గాలిస్తున్నారు. పోలీసులు ప్రత్యేక యంత్రాన్ని పిలిపించి గాలింపు కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వేసవి సెలవుల కోసం తమ అవ్వగారి ఊరైన మల్లేపల్లికి ఆళ్లగడ్డ మండలం బోధన గ్రామానికి చెందిన చరణ్, (15), పార్థు, (12), జమ్మలమడుగు మండలం ఉప్పలపాడు చెందిన హర్ష( 12), మల్లేపల్లికి చెందిన దీక్షిత్, (12) కాశి నాయన మండలం మల్లేరు కొట్టాల గ్రామానికి >>2


మంగళవారం కల్లి తండాలో మురళి నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జగన్

# జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి జగన్ 25 లక్షల సాయం

### యుద్ధవీరులకు రూ. 50 లక్షలు ఇవ్వడం వైసిపి ప్రారంభించినదే
### కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మాజీ సిఎం

**గోరంట్ల మే 13 ప్రభాతవార్త:** పాకిస్తాన్‌పై చేపట్టిన సింధూర్ ఆపరేషన్‌లో దేశం ఒక వీరుణ్ణి కోల్పోయిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వీర జవాన్ మురళీనాయక్ కుటుంబానికి మాజీ సిఎం జగన్ పరామర్శ సందర్భంగా ఆసక్తికర ఘటన జరిగింది. జవాన్ ఫ్యామిలీకి రూ,50 లక్షలు ప్రకటించిన కూటమి ప్రభుత్వానికి ఆయన థాంక్స్ చెప్పారు. అమర వీరుల కుటుంబాలకు రూ,50 లక్షలు ఇచ్చే కార్యక్రమం వైఎస్సార్సీ ప్రభుత్వం మొదలుపెట్టిందన్నారు. దాన్ని కొనసాగిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తరఫున రూ.25 లక్షలు ప్రకటించిన ఆయన జవాన్ తల్లిదండ్రులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన గోరంట్ల మండలంలోని కల్లి తండాకు చెందిన మురళి నాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన గోరంట్ల మండలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలములోని జాతీయ రహదారి పాలసముద్రం క్రాస్ వద్ద నుంచి కల్లి తాండ వరకు అడుగడుగునా జగన్మోహన్ రెడ్డికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ నేపథ్యంలో గట్టి బందోబస్తు మధ్య కల్లి తండాకు చేరుకున్న జగన్మోహన్ రెడ్డి మురళి నాయక్ నివాసం ముందుకు చేరుకొని తల్లిదండ్రులను పరామర్శిస్తూ వీరమరణం పొందిన మురళి నాయక్ భౌతికంగా మనకు దూరమైన మా గుండెల్లో గూడు కట్టుకుని నిలిచిపోయాడని మీ కుటుంబానికి మేమంతా ఎల్లవేళలా అండగా ఉంటామని వారిలో మనోధైర్యాన్ని నింపారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యుద్ధంలో మృతి చెందిన వీర సైనికులకు 50 లక్షల సాయం చేయాలనే ఆలోచన మా ప్రభుత్వ హయాం నుంచి పుట్టిందని ప్రస్తుత ప్రభుత్వం సైతం ఆ సంస్కృతిని >>2

# రాష్ట్రానికి 91 పెద్ద కంపెనీలు

### వేగవంతంగా యూనిట్ల స్థాపనకు యత్నాలు
### ఐటి, ఎలక్ట్రానిక్స్‌లో 5 లక్షల ఉద్యోగాలు లక్ష్యం
### నెలాఖరుకు 'మనమిత్ర' ద్వారా 400 రకాల సేవలు అందుబాటులోకి: మంత్రి లోకేష్


మంగళవారం ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల అధికారులతో సమీక్షలో మంత్రి నారా లోకేష్

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో కొత్తగా తమ సంస్థలను ఏర్పాటుచేయడానికి ముందుకు వచ్చిన పెద్ద కంపెనీలకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరుచేసేందుకు ప్రతికంపెనీకి ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల ఉన్నతాధికారులతో లోకేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విశాఖ నగరాన్ని అత్యాధునిక సాంకేతికతల కేంద్రంగా, ఐటి హబ్ గా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రాష్ట్రంలో యూనిట్ల స్థాపనకు ఆసక్తిచూపుతున్న కంపెనీల పెట్టుబడులు, ఉద్యోగాలపై మంత్రి సమీక్షిస్తూ ఇప్పటి >>2

# రాష్ట్రంలో స్థానికేతర కోటా మనకే

### వృత్తివిద్య, ఇంజినీరింగ్, డిగ్రీ కోర్సులకు వర్తింపు
### కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** వృత్తి విద్య, డిగ్రీ, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటి వరకు అమలవుతున్న 15% స్థానికేతర (నాన్‌లోకల్), జనరల్ కోటా సీట్లను ఇక నుండి పూర్తిగా ఎపి వారికే కేటాయించనున్నారు. ఫలితంగా 2025-26 విద్యా సంవత్సరంలో స్థానికేతర కోటా 15% సీట్లనూ రాష్ట్ర విద్యార్థులే పొందనున్నారు. ఇప్పటి వరకు ఈ సీట్లలో తెలంగాణకు చెందిన వాటికి అవకాశం కల్పిస్తుండగా, ఇక నుండి ఈ సీట్లకు పోటీ పడటానికి తెలంగాణ. ఇతర రాష్ట్రాల వారికి అవకాశం ఉండదు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఉన్నత విద్య వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలు, ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిబంధనల్లో స్థానిక, స్థానికేతరను స్పష్టం చేస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం వేర్వేరుగా మూడు ఉత్తర్వుల (జిఓ 20,21,22)ను జారీ చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం అక్కడి వర్సిటీల్లోని 15% కోటాలో ఏపీ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం సైతం ఇక్కడి వర్సిటీల్లో >>2

# 1.34 లక్షల కోట్ల ఆదాయం లక్ష్యం

>> రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి...వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం**

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 202526 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 202425లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ.17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం**

రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపిలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ.33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చుకోవాలి**

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని.. మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులుఅనేది ప్రాథమికశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.. మంచి పనితీరు ద్వారా ఆయాశాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని.. ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# వల్లభనేనికి బెయిలు మంజూరు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి వ్యవహారంలో కీలక సాక్షి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో మాజీ ఎమ్మెల్యే, వైకాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీని మంగళవారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యక కోర్టులో హాజరు పరిచారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా తనకు అనారోగ్యంగా ఉందని కోర్టుకు వల్లభనేని వంశీ తెలియజేశారు. తాను మాట్లాడేందుకు ఊపిరి తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని కోర్టుకు ఆయన వివరించారు.

ఈ నేపథ్యంలో వల్లభనేని వంశీని ఆసుపత్రికి తీసుకు వెళ్లి వైద్య చికిత్స అందించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. అలాగే వల్లభనేని వంశీ ఆరోగ్య పరిస్థితిపై మెమో దాఖలు చేయాలని అతడి తరపు న్యాయవాదిని ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక కోర్టు ఆదేశించింది.



మంగళవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను సత్కరిస్తున్న సిఎం చంద్రబాబు

# హైకోర్టు చీఫ్ జస్టిస్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను ఆయన నివాసంలో మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసారు. జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను చంద్రబాబు ప్రభుత్వం తరపున సత్కరించారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని, మిఠాయిని అందించారు. కొద్ది సేపు ఇరువురు మధ్య భేటీ జరిగింది. నూతన రాజధాని నిర్మాణంలో భాగం బహుళ అంతస్తుల హైకోర్టు భవనాలు, న్యాయమూర్తులు, న్యాయవాదులకు సంఘటిత ప్రాంగణ గృహాలు తదితరంశాలపై ప్రస్తావన వచ్చినట్లు సమాచారం. ఆపరేషన్ సింధూర నేపథ్యంలో రాష్ట్రంలో తీర, కీలక ప్రాంతాల్లో తీసుకున్న చర్యలను గురించి చంద్రబాబు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌కు వివరించారంటున్నారు. వివిధ ఇష్టాగోష్టి అంశాలు వీరి భేటీలో చోటు చేసుకుంటున్నాయంటున్నారు.



మంగళవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌తో భేటీ అయిన రక్షణ దళాధిపతి జనరల్ అనిల్ చౌహాన్

# ఎంపి మిధున్ రెడ్డికి సుప్రీంలో చుక్కెదురు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్ రెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టునే ఆశ్రయించాలని సుప్రీం కోర్టు ఆయనకు స్పష్టం చేసింది. గతంలో ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. అప్పటికే మద్యం కేసులో మిధున్ రెడ్డిని నిందితుడిగా చేర్చకపోవడం, అరెస్ట్ చేసే ఉద్దేశం లేదని ఏపీ ప్రభుత్వం చెప్పిన క్రమంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

ప్రస్తుతం మిధున్ రెడ్డిని నిందితుడిగా చేర్చిన నేపథ్యంలో మెరిట్స్ ఆధారంగా మళ్లీ తాజాగా వాదనలు విని ముందస్తుబెయిల్‌పై నిర్ణయాన్ని వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీం కోర్టు సూచించింది.

# బాలాజీ గోవిందప్ప అరెస్టు

>> ముగ్గురు తరచూ హైదరాబాద్ తాడేపల్లిలో మద్యం సరఫరా కంపెనీలు,డిస్టలరీల యజమానులతో సమావేశమయ్యేవారు అని సిట్ ఇప్పటికే తేల్చింది. మద్యం ముడుపుల సొమ్మును రాజ్ కెసిరెడ్డి వీరికి చేరవేస్తే,వీరు దాన్ని జగన్‌కు అందచేసేవారని ఇప్పటివరకూ అరెస్టైన నిందితులకు సంబంధించిన రిమాండ్ రిపోర్ట్‌ల్లో ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో మైసూరులో బాలాజీ గోవిందప్పను సిట్ అరెస్ట్ చేసింది.

# చిన్నారుల గల్లంతు

>> చెందిన తరుణ్ యాదవ్ (10) ఐదు మంది మల్లేపల్లి చెరువులో ఈతకు దిగారు. వెళ్లిన ఐదు మంది చెరువులో గల్లంతయ్యారు. దీంతో ఈ విషయం బయటికి రాలేదు. చెరువులోకి దిగిన పిల్లల బట్టలు, చెప్పులు చెరువు ఒడ్డునఉన్న విషయాన్ని చూసిన కొందరు పిల్లలు ఏమయ్యారు అని ఆందోళనతో గ్రామంలోకి వెళ్లి చెప్పిన వెంటనే చిన్నారుల కుటుంబ సభ్యులు బంధువులు పెద్ద ఎత్తున చెరువు వద్దకు తరలివచ్చారు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామం మొత్తం మల్లెపల్లి చెరువు వద్దకు తరలివచ్చింది. చిన్నారుల ఆచూకీకోసం తల్లిదండ్రులు, బంధువులు కన్నీటి పర్యంతమవుతున్నారు. బ్రహ్మంగారిమఠం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బాలికల హవా

>> బాలికలు పాసైనట్లు వెల్లడించారు. ఇది అబ్బాయిల కంటే 5.94 శాతం ఎక్కువ కావడం గమనార్హం. గతేడాదితో పోలిస్తే 0.41 శాతం ఎక్కువ మంది పాసైనట్లు బోర్డు వెల్లడించింది. విజయవాడ రీజియన్‌లో అత్యధికంగా 99.60 శాతం ఉత్తీర్ణత సాధించారు. తిరువనంతపురంలో 99.32, చెన్నైలో 97.39 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. బెంగళూరులో 95.95, ఢిల్లీ వెస్ట్‌లో 95.37, ఢిల్లీ ఈస్ట్‌లో 95.06 శాతం, ప్రయాగ్‌రాజ్‌లో అత్యల్పంగా 79.53 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొంది. ఫలితాలను సంబంధిత వెబ్ సైట్‌లో చూసుకునే అవకాశం కల్పించారు. సిబిఎస్ఇ 10, 12 తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభినందనలు తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, శ్రమకు ఈ ఫలితాలే నిదర్శమని చెప్పారు. ఇందులో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఉన్నత లక్ష్యాలను ఛేదించాలని ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో స్థానికేతర కోటా మనకే

>> తెలంగాణ వారికి అవకాశం లేకుండా ఉత్తర్వులు జారీ చేసింది. కన్వీనర్ కోటా సీట్లు 70%లో 85% సీట్లను స్థానికులకు కేటాయిస్తారు. స్థానికత ఏపీలో రెండు రీజియన్‌లుగా ఉంటుంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రీజియన్‌లుగా దీన్ని నిర్ణయిస్తారు. ఉమ్మడి ఏపీ, విభజన అనంతరం 10 ఏళ్ళ పాటు ఆంధ్ర శ్రీ వెంకటేశ్వర, ఉస్మానియా రీజియన్లుగా సీట్ల భర్తీ చేపట్టగా..ఇప్పుడు ఉస్మానియా రీజియన్‌ను తొలగించారు. ఇక నుండి ఆంధ్ర, శ్రీవెంకటేశ్వర రీజియన్‌ల వారీగా మాత్రమే ఓట్లను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలు, ఆంధ్ర రీజియన్(ఏయూ) పరిధిలో ఉంటాయి. ఇక్కడి విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను ఏయూ రీజియన్‌కు లోకల్‌గా పరిగణిస్తారు.

స్థానికేతర కోటాకు అర్హులను గుర్తించారు. స్థానికేతర జనరల్‌కోటా 15% సీట్ల కేటాయింపునకు కొన్ని నిబంధనలు విధించారు. అవి ఇలా ఉన్నాయి. ఆంధ్ర వర్సిటీ రీజియన్ అభ్యర్థులు, శ్రీ వెంకటేశ్వర రీజియన్‌లో 15% సీట్లకు పోటీ పడొచ్చు. అలాగే శ్రీ వెంకటేశ్వర రీజియన్ విద్యార్థులు, ఆంధ్ర రీజియన్‌లో 15% స్థానికేతర సీట్లకు అర్హులవుతారు. ఉద్యోగ, ఉపాధి కారణాల రీత్యా తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నా...ఇద్దరిలో ఎవరైనా ఒకరు గతంలో పదేళ్ళ పాటు నివసించిన వారై ఉంటే వారి పిల్లలు పోటీ పడొచ్చు. అభ్యర్థి ఏపీలో కనీసం 10 ఏళ్ళు నివసించి ఉండాలి. రాష్ట్రం బయట చదువుతున్న కాలాన్ని మినహాయించిన తర్వాత పదేళ్లు ఎపిలో ఉండి ఉండాలి. ఎపిలో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ సెక్టార్ కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, ఇతర అనుబంధ సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలు ఏ రాష్ట్రానికి చెందిన వారైన సరే ఈ సీట్లు పొందేందుకు అర్హులు. రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీవిత భాగస్వాములు కూడ అర్హులు. అంటే ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ ఉద్యోగిగా ఉంటే వారి భాగస్వామి(భార్య లేదా భర్త)అర్హుడు. స్థానికత ఇలా నిర్ణయిస్తారు. అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులకు గతంలో మాదిరిగానే రీజియన్‌ల వారీగా ఆరు నుండి ఇంటర్మీడియట్ చదువును ప్రామాణికంగా తీసుకుంటారు. ఉదాహరణకు బీటెక్, బీఫార్మసీ, బీఎస్సీ తదితర కోర్సులకు మొదట తొమ్మిదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగేళ్ల చదువును చూస్తారు. 9 నుండి ఇంటర్మీడియట్ వరకు వరుసగా నాలుగేళ్ళు ఆయా రీజియన్‌లో చదవకపోయినా ఏడేళ్ళలో నాలుగు చదివి ఉండాలి. ఏడేళ్ళ కాలంలో ఎక్కువ కాలం చదివిన ప్రాంతాన్ని స్థానికతగా తీసుకుంటారు. ఒకవేళ స్థానిక ప్రాంతంలో ఏ విద్యా సంస్థల్లోనూ నాలుగేళ్ళు చదవకపోయినా...అభ్యర్థి హాజరయ్యే అర్హత పరీక్షకు ముందు నాలుగేళ్ళు ఏ ప్రాంతంలో నివాసం ఉంటే దాన్ని స్థానికతగా పరిగణిస్తారు. రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో చదివిన కాలం సమానంగా ఉంటే చివరగా చదివిన ప్రాంతాన్ని స్థానికంగా తీసుకుంటారు. రాష్ట్రంలో ఏడేళ్ల ఏ విద్యాసంస్థల్లో చదవకపోయినా...అర్హత పరీక్ష రాయకముందు నుండి ఏడేళ్ళు ఏపీలో నివసించి ఇంటే స్థానిక అభ్యర్థులుగా లెక్కిస్తారు. ఏపీలో ఈ ఏడేళ్లలో ఎక్కడైతే ఎక్కువ కాలం నివసించి ఉంటారో అక్కడ స్థానికులుగా పరిగణలోకి వస్తారు.

# రైళ్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే

## రైల్వే భద్రతా సమీక్షా సమావేశంలో జిఎం జైన్

**గుంతకల్లు రైల్వే,మే 13,ప్రభాతవార్త:** రానున్న వర్షాకాలంలో రైళ్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఉద్ఘాటించారు. రైలు నిర్వహణలో, భద్రతలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో రైలు కార్యకలాపాల నిర్వహణపై భద్రత కోసం తీసుకోవలసిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. అదనపు జిఎం నీరజ్ అగ్రవాల్ వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్ఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్ల నిర్వహణ సజావుగా సాగేందుకు ఎప్పటికప్పుడు జారీ చేసిన రైల్వే బోర్డు మార్గదర్శకాల మేరకు భద్రతా నియమాలు, విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన ఆదేశించారు. రైలు కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించడంపై కూడా ఆయన నొక్కి చెప్పారు. ఎటువంటి సత్వర పద్ధతులను అనుసరించవద్దని ఆదేశించారు. విధినిర్వహణలో ఎలాంటి చిన్న పొరపాట్లు కూడా తలెత్తకుండా నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రానున్న వర్షాకాలం నేపథ్యంలో రుతుపవనాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్న విభాగాలు, వంతెనలు, సొరంగాలు, వాటి నిర్వహణ స్థితిపై ప్రాథమిక దృష్టిని పెట్టారు. ట్రాక్‌లపై వరదలురాకుండ రైళ్లు సజావుగాతిరిగేలా సైడ్ వాటర్‌డ్రైయిన్‌లు, జలమార్గాలను శుభ్రపరచడం, నిర్వహణ చేయడం, ప్రత్యామ్నాయ జలమార్గాలను ఏర్పాటు చేయడం వంటి వాటిపై దృష్టి సారించి నిర్ధారించాలని ఆయన ఆదేశించారు.

పరికరాలు సురక్షితంగా పనిచేసే స్థితిని నిర్ధారించుకోవాలని, వర్షాకాలంలో తీసుకోవలసిన అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక భద్రత, సిగ్నలింగ్ వ్యవస్థలకు సంబంధించి జోన్‌లో నిర్వహిస్తున్న వివిధ భద్రతా డ్రైవ్‌ల పురోగతిని కూడా సమీక్షించారు. జోన్ పరిధిలోని డివిజన్‌లలో లోకో పైలట్లు, ఎఎల్‌పిలు వారి కుటుంబ సభ్యుల కోసం చేపడుతున్న సమగ్ర కౌన్సిలింగ్ సెషన్‌ల స్థితిని కూడా ఆయన సమీక్షించారు.

# తిరుగులేని సైనిక సత్తా

>> కుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం ప్రపంచమంతా మార్మోగుతోందని ఆయన తెలిపారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం భారత్ శక్తిసామర్థ్యాలకు ప్రతీక అన్నారు. ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమని ఆయన వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ సైనికులను అభినందించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని ఈ జయ జయ ధ్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోడీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను ఆయన వెన్ను తట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోడీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాడి నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశామని ప్రధాని మోడీ తెలిపారు. మీరు గురిచూసిన కొట్టిన దెబ్బ శత్రు స్థావరాలు మట్టిలో కలిసిపోయాయన్నారు. భారత త్రివిధ దళాలు పాక్ సైన్యాన్ని మట్టి కరిపించాయని చెప్పారు. పాక్ సైన్యానికి స్పష్టమైన సందేశం ఇచ్చామన్నారు. పాక్‌లో ఎక్కడైనా ప్రశాంతంగా శ్వాస తీసుకునే అవకాశం లేకుండా చేశామని వివరించారు. మన డ్రోన్లు, మిస్సైల్స్ పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి విధ్వంసం సృష్టించాయని తెలిపారు. ఇంకా చెప్పాలంటే.. పాక్ సైన్యానికి నిద్ర లేని పరిస్థితి సృష్టించామన్నారు. పాక్ భూభాగంలో ఏ స్థావరాన్ని అయినా గురి చూసి కొట్టగలమని నిరూపించామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ భారత్ ఆత్మ విశ్వాసాన్ని కొత్త ప్రమాణాలు లిఖించిందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. ఇక మన స్థావరాలపై దాడి చేసేందుకు పాక్ ఎంతో ప్రయత్నించిందన్నారు. కానీ పాక్ విమానాలు, మిస్సైల్స్.. మన ముందు చిత్తైపోయాయన్నారు. భారత లక్ష్మ ణ రేఖ ఇప్పుడు ఎంతో సురక్షితమని పేర్కొన్నారు. మళ్లీ దాడి చేస్తే భారత్ గట్టిగా జవాబిస్తుందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. న్యూక్లియర్ బ్లాక్‌మెయిల్‌ను భారత్ ఏ మాత్రం ఉపేక్షించదని స్పష్టం చెప్పారు. ఉగ్రవాదులు..వారి వెనుకున్నవారిని భారత్ వేర్వేరుగా చూడదని ఆయన కుండ బద్దలు కొట్టారు. కేవలం 15 నిమిషాల్లో సరిహద్దుల ఆవల శక్తులను భగ్నం చేశామని చెప్పారు. ఇదంతా ప్రొఫెషనల్ సామర్థ్యంతోనే సాధ్యమైందని ప్రధాని మోడీ తెలిపారు. భారత్ సైన్యం దాడితో శత్రువు డీలా పడిపోయిందన్నారు. ఎప్పుడు దాడి జరిగిందో కూడా కనిపెట్టలేక పోయిందని ప్రధాని మోడీ చెప్పారు. ఎంతో కచ్చితత్వంతో ఎంతో నైపుణ్యంతో చేసిన దాడి ఇదని ఆయన గుర్తు చేశారు. పౌర విమానాలను అడ్డు పెట్టుకుని పాక్ కుయుక్తులు పన్నిందని ప్రధాని మోడీ చెప్పారు. అంతకుముందు ఆదంపూర్ ఎయిర్‌బేస్‌లో మోహరించిన ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ ముందు నిలబడి సెల్యూట్ చేశారు ప్రధాని మోడీ. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న వాయుసేన సిబ్బందితో ముచ్చటించిన వారిని అభినందించారు. దాదాపు గంటన్నరకుపైగా వైమానిక కేంద్రంలో గడిపిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వైమానిక దళ సిబ్బందితో కలిసి పెద్దపెట్టున భారత్ మాతాకీ జై, జై జవాన్ నినాదాలు చేశారు.

# రాష్ట్రానికి 91 పెద్ద కంపెనీలు

>> వరకు 91 ఐటి, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు రూ.91,839 కోట్ల పెట్టుబడులు, 1,41,407 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయి, వాటికి త్వరితగతిన అనుమతులు మంజూరుచేయాలి, సాధ్యమైనంత త్వరగా కంపెనీలు ఏర్పాటుచేసేలా సంబంధిత కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరపాలి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ ఉద్యోగాలు కీలకపాత్ర పోషిస్తాయి, రాబోయే అయిదేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని లోకేష్ అన్నారు. ఐటి కంపెనీలకు చెల్లించాల్సిన ప్రోత్సాహక బకాయిలను వెంటనే చెల్లించండి. రాష్ట్రవ్యాప్తంగా వీడియో కాన్ఫరెన్స్ ఎక్విప్‌మెంట్‌ను ఆధునీకరించండి. రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాట్లను వేగవంతం చేయండి. ప్రభుత్వానికి సంబంధించిన పౌరసేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులో ఉంచాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రస్తుతం 317రకాల సేవలు మనమిత్ర యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. నెలాఖరుకు 400రకాల సేవలకు విస్తరించాలి. రెవిన్యూశాఖతో పాటు వివిధరకాల సేవల సమయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి సర్టిఫికెట్ బ్లాక్ చెయిన్, క్యూఆర్ కోడ్‌తో నిర్ధారించుకునేలా టెక్నాలజీతో అనుసంధానం చేయాలి. మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలు, పంచాయితీల్లో పన్నుల బకాయిల వివరాలు వాట్సాప్‌లోవచ్చేలా ఏర్పాట్లుచేయాలి, బకాయిలకు సంబంధించి ఎప్పటికప్పుడు అలర్ట్ మెసేజ్‌లు పంపేలా చూడాలి. ఆర్‌టిజిఎస్‌కు సంబంధించి డేటా పాయింట్లు, కెపిఐలను ఇంటిగ్రేట్ చేయాలి. భారత ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్య పథకాలనకు సంబంధించి రియల్ టైమ్ సమాచారాన్ని ఆర్‌టిజిఎస్‌లో పొందుపర్చాలి. సచివాలయం నుంచి గ్రామస్థాయి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను అనుసంధానం చేయాలి. తుపానులు, వరదలు, పిడుగులు పడటం వంటి వాతావరణ సమాచారాన్ని రియల్ టైమ్‌లో అందించేలా చర్యలు తీసుకోవాలి. జూన్ 9,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఈగవర్నెన్స్ జాతీయ సదస్సుకు విస్తృత ఏర్పాట్లు చేయండి. వివిధ శాఖలకు సంబంధించి సమాచారాన్ని అంతటినీ ఏకీకృతం చేసి ఒక వెబ్ సైట్‌లో పొందుపర్చి ఎఐ ఎనేబుల్ చేసేలా చర్యలు తీసుకోవాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మరింత సరళతరం చేసేలా చర్యలు చేపట్టాలి. వివిధ రకాల చిరు వ్యాపారాలు, చిన్న పరిశ్రమలకు సంబంధించి సింగిల్ సర్టిఫికేషన్ ఉండేలా క్యూఆర్ కోడ్, బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అనుసంధానించాలి. ప్రభుత్వానికి సంబంధించి అన్నిరకాల జిఓలు, యాప్ లను సింగిల్ ప్లాట్ ఫాంపైకి తెచ్చి ఒకే వెబ్ సైట్‌లో అందుబాటులోకి తేవాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటి అండ్ సి సెక్రటరీ కాటంనేని భాస్కర్, స్పెషల్ సెక్రటరీ బి.సుందర్, ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు సిఇఒ సాయికాంత్ వర్మ, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ ఎండి సూర్యతేజ్, ఆర్ టిజిఎస్ సిఇఒ ప్రకార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 14-05-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
విదియ రా.2.27
అనూరాధ ఉ.11.45
వర్జ్యం సా.5.54-7.39
దు.ఉ.11.39-12.31
శుభసమయం : ఉ.9.10-9.40, 2)సా.4.20-5.10
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులు సజావుగా సాగుతాయి. ఆత్మీయుల నుండి ఆహ్వానాలు అందుతాయి.

**వృషభం :** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు. వాహన సౌఖ్యం.

**మిథునం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో ఇబ్బందులు తొలగుతాయి. వస్తు, వస్త్రాల కొనుగోలు చేస్తారు.

**కర్కాటకం:** ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు. ఋణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. బంధువుల కలయిక.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కన్య :** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఉద్యోగాలలో ఒత్తిడులు ఎదురైనా అధిగమిస్తారు.

**తుల :** వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో అసంతృప్తి పెరుగుతుంది.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడే సమస్యలు కొంతవరకు తీరుతాయి. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**మకరం:** కొత్త పనులకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది, వస్తు సేకరణ.

**కుంభం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యాపారాలలో ఆటుపోటులు తొలగుతాయి.

**మీనం :** మిత్రులను కలిసి ఆనందంగా గడుపు తారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మళ్లీ సిఫార్సు లేఖలపై దర్శనాలు

>> వచ్చిన విషయం విదితమే. సరాసరి రోజువారీగా 2వేల వరకు బ్రేక్ దర్శనాలు టిక్కెట్లు జారీఅయ్యాయి. వేసవిసెలవులు ఆరంభంతో సామాన్యభక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో ముందస్తుగా ప్రస్తుత టిటిడి బోర్డు, టిటిడి ఉన్నతాధికారులు జులై 15వరకు పూర్తిగా సిఫార్సులేఖలపై విఐపి బ్రేక్‌దర్శనాలు, ఆర్జితసేవల టిక్కెట్లు జారీనిలుపుదల చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే గత వారంరోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ తగ్గుముఖం పట్టడం వెనుక కారణాలు ఏమైనా సిఫార్సులేఖలు రద్దుచేయడంతోనేననే భావన టిటిడి బోర్డు దృష్టికి చేరింది. దీంతో ప్రభుత్వం నుండి, దేవాదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా విఐపి బ్రేక్ దర్శనాలు పునరుద్ధరించాలని టిటిడి అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో చేసేదిలేక టిటిడి అధికారులు కూడా రేపటి నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సులేఖలు అనుమతించి ,వాటికి విఐపి బ్రేక్ దర్శనాలతోబాటు 300 రూపాయలు ఎస్ఇడి దర్శనాలు, కల్యాణోత్సవం టిక్కెట్లు జారీచేయనున్నారు.

**టిటిడి బోర్డు అత్యుత్సాహమేనా!:**

ఆపదమొక్కులవాడు..అనాథరక్షకుడు ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం ఏడాదంతా సాధారణ రోజుల్లోకూడా 90వేలమంది భక్తుల సంఖ్య తగ్గడంలేదు. ఇక వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజులు లక్షమందివరకు చేరుకుంటారు. అలాంటిది ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా ఏప్రిల్ 15నుండి జులై 15వరకు వేసవిసెలవులు రద్దీ ప్రభావం తిరుమలను తాకుతుంది. రోజుకు లక్షమందివరకు భక్తులు వస్తుంటారు. 50వేలమంది భక్తుల రద్దీ పెరిగితే క్యూలైన్లు ఆలయం వెలుపలకు చేరి కిలోమీటర్లు దూరం వెలుపలే కొనసాగుతాయి.

సామాన్యభక్తులు గంటలగంటలు నిరీక్షణ కనిపిస్తుంది. గతంలో వేసవిసెలవుల రద్దీతో వారాంతం శుక్ర, శని, ఆదివారాల రోజుల్లోమాత్రమే సిఫార్సులేఖలు రద్దుచేసేవారు. అయితే ఈ ఏడాది అందుకు భిన్నంగా టిటిడి బోర్డు నిర్ణయం తీసుకుంది. వేసవిసెలవుల్లో పూర్తిగా జులై 15వరకు సిఫార్సులేఖలు స్వీకరించరాదని, దర్శనాలు జారీ ఉండదని అత్యుత్సాహంతో ప్రకటించారు. అయితే మేనెల 1వతేదీ నుండి భారత్ , పాక్ మధ్య ఉద్రిక్తతలతో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా తగ్గింది. అంతేగాక సామాన్యభక్తులు తిరుపతిలోని ఆఫ్‌లైన్ కౌంటర్లలో జారీచేసే 20వేలవరకు టైమ్‌స్లాట్ టోకెన్లు అందుకుని అదే రోజు తిరుమలకు వస్తున్నారు. టిటిడి కూడా ఒకడుగు ముందుకేసి నిర్ధేశిత దర్శన సమయానికి క్యూలైన్లోకి చేరుకోవాలని ప్రకటించడం కూడా భక్తుల తగ్గుముఖం పట్టిందనేది టిటిడి వర్గాల అభిప్రాయం. మేనెల 1వతేదీ నుండి 13రోజులు తిరుమలకు చేరుకన్న భక్తుల సంఖ్యను గమనిస్తే సోమవారం రాత్రివరకు 8,69,784మంది భక్తులు అన్ని రకాల టిక్కెట్లతో దర్శనం చేసుకున్నారు. కానుకల ద్వారా హుండీకి 38.80కోట్లు రూపాయలు ఆదాయం లభించింది. వేసవిసెలవుల్లో ఈ రద్దీ విపరీతంగా ఉంటుంది. మరీ భక్తుల రద్దీ తగ్గడంతో టిటిడి కూడా అనూహ్యంగా నిర్ణయం తీసుకుని రెండు తెలుగురాష్ట్రాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎంపిలు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎల సిఫార్సులేఖలపై బ్రేక్ దర్శనాలు జారీ చేస్తామని ప్రకటించింది.

ఇదీ కొంతవరకు భక్తుల్లో ఆనందం కలిగించే విషయం. ఇదిలా ఉండగా ఇప్పుడు వెంకన్న దర్శనం కోసం తిరుమలకు వచ్చే భక్తులకు సకాలంలో, త్వరగా స్వామివారి దర్శనం కల్పించేందుకు టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సుపథం ప్రవేశ మార్గం, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు క్యూలైన్లు, టైమ్‌స్లాట్ ఎస్ఎస్‌డి, దివ్యదర్శనం క్యూలైన్లలో భక్తులను ఆయా సమయానికి అనుమతించాలనేది ఆలోచన చేస్తున్నారు. వీలైనంత వరకు క్యూలైన్లను నియంత్రించి భక్తులకు సంతోష, సాఫీగా దర్శనం చేయించాలనేది చూడనున్నారు.

# జగన్ 25 లక్షల సాయం

>> కొనసాగించడం అభినంద నీయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కొనియాడారు. ఆ కుటుంబానికి అండగా తమ వంతు బాధ్యతగా రూ, 25 లక్షల సాయాన్ని ప్రకటిస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గోరంట్ల మండల పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తమ అభిమాన నేత జగన్మోహన్ రెడ్డిని చూసేందుకు ఎగబడ్డారు. జగన్ పర్యటనను పురస్కరించుకొని జిల్లా ఎస్పీ రత్న, పెనుగొండ డిఎస్పి నరసింగప్ప, గోరంట్ల సిఐ పోయే శేఖర్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి ఉషశ్రీ చరణ్, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, చాంద్ బాషా, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తదితర జిల్లా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చార్‌ధామ్ యాత్రలో మోసపోయిన తెలుగు టూరిస్టులు

**విజయవాడ,మే13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఉత్తరాఖండ్ చార్‌ధామ్‌యాత్రలో తెలుగు టూరి స్టులు దారుణంగా మోసపోయారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంతమంది ప్రయాణికులను హెలికాప్టర్ టికెట్ బుకింగ్ పేరుతో మోసం చేశారు. ఒక్కొక్కరికి అదనంగా రూ.30 వేలు చెల్లించినప్పటికీ టికెట్ బుక్ అవ్వకపోవడంతో మోసపోయామని వారు గ్రహించారు.శ్రీకాకుళం జిల్లా పలాస మండలం కాశీబుగ్గకి చెందిన యాత్రికులు చార్‌ధామ్ యాత్రకు వెళ్లారు. యాత్రలో భాగంగా తొలుత గంగోత్రిని సందర్శించారు. తర్వాత యాత్రికులు కేదార్ లోయకు చేరుకున్నారు. ఒక్కొక్క టికెట్‌కు ముప్పై వేల రూపాయలు చెల్లించినప్పటికీ, వారికి హెలికాప్టర్ టికెట్లు లభించలేదు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన భాధితులు, వారు నివాసం ఉంటున్న రత్నాకర్ గుప్తకాశీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, తాము ఒక బృందంగా ఒక ట్రావెల్ ఏజెన్సీ ద్వారా ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు బయలుదేరినట్లు చెప్పారు. ప్రయాణ ప్యాకేజీతో పాటు, కేదార్‌నాథ్,ధామ్‌కు హెలికాప్టర్ టికెట్ కోసం ఒక్కొక్కరికి 15,000 చొప్పున డబ్బు కూడా తీసుకున్నారని తెలిపారు.

# గత ఐదేళ్లలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవ్యస్తం

## మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో గత అయిదేళ్ళలో నిర్వహణ సరిగ్గా లేనందున ఇరిగేషన్ వ్యవస్థలో పలు సమస్యల తలెత్తాయని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు.సాగునీటి వ్యవస్థలు పంట కాల్వల నిర్వాహణ నిర్లక్ష్యం చేసారన్నారు.రూ.వందల, వేల కోట్లు పెట్టి ప్రాజెక్టులు నిర్మిస్తే జగన్ ప్రభుత్వం సరైన మెయింటెనెన్స్ కూడా చేయకుండా గాలికి వదిలేసిందని ఆరోపించారు. మంగళవారం ఏపీ సచివాలయంలో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. ఇరిగేషన్ పనుల నిర్వహణ, మరమ్మతుల కోసం సీఎం చంద్రబాబు రూ.344 కోట్ల నిధులు మంజూరు చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గత జగన్ ప్రభుత్వం తప్పిదాలను తమ ప్రభుత్వం సరిచేసుకుంటూ, ఇరిగేషన్ రంగాన్ని గాడిలో పెడుతున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్‌లో రూ.90 కోట్లతోనూ, సెప్టెంబర్‌లో అత్యవసర పనులకు గానూ రూ.326 కోట్లతో నిర్వహణ పనులు చేశామని అన్నారు. ఇరిగేషన్ అధికారులు కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు స్వీయ పర్యవేక్షణ చేస్తూ, మే చివరి నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామా నాయుడు ఆదేశించారు.తూడు, గుర్రపుడెక్క, పూడికతీత వంటి అత్యవసర పనుల కోసం రూ.10లక్షలు దాటితే కాలయాపన చేయకుండా 7 రోజుల్లోనే పనులు పూర్తయ్యేలా షార్ట్ టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు. రూ.10లక్షల్లోపు ఉన్న పనులను, సాగు నీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టాలని అన్నారు. గత ప్రభుత్వంలో కనీసం కాలువల్లో తట్టమట్టి కూడా తీయకపోగా, షట్టర్లు, డోర్లు, గేట్లకు మర మ్మతులు చేయక పోగా, గ్రీజు కూడా పెట్టలేదని మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

# 2019-2022 బడ్జెట్‌పై అసెంబ్లీ అంచనాల కమిటీ సమీక్ష


ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన అంచనాల కమిటీ సమావేశ దృశ్యం

**విజయవాడ, మే13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ అధ్యక్షులు మండపేట ఎంఎల్ఏ వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన గల ఎస్టిమేట్స్ కమిటీ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్లో సమావేశమై 2019 నుండి 2022 వరకూ మూడేళ్ళ కాలంలో సాంఘిక,గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖలతోపాటు పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించింది. తొలిరోజైన మంగళవారం ఉ.11గం.లకు సాంఘిక సంక్షేమశాఖ, మధ్యాహ్నం 2గం.లకు గిరిజన సంక్షేమశాఖ, 3.30.గం.లకు మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశమై ఆయా శాఖలకు 2019-20,2020- 21,2021- 22 ఆర్థిక సంవత్సరాల్లో ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ అంచనాలపై సమీక్ష నిర్వహించారు.

అలాగే 14వ తేదీ బుధవారం ఉ.11గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 2019-22 మూడేళ్ళ కాలంలో బడ్జెట్ అంచనాలపై అసెంబ్లీ అంచనాల కమిటీ అధ్యక్షులు వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షతన గల కమిటీ సమీక్ష నిర్వహించనుంది.

ఈసమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యులు అఖిల ప్రియ, డా.పార్ధసారధి, మద్దిపాటి వెంకటరాజు, నిమ్మక జయకృష్ణ, అసెంబ్లీ ఉప కార్యదర్శి రాజ్ కుమార్, సాంఘిక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు. మూడు వరుస ఆర్థిక సంవత్సరాల్లో బడ్జెట్ పరిధిలో ఆయా శాఖలకు కేటాయించిన నిధుల వ్యయం ఇతరం శాలపై అంచనాల కమిటీ చర్చిస్తుంది.

# హిందీ సలహాసంఘం సభ్యుడిగా ఆచార్య యార్లగడ్డ



**విజయవాడ, మే13,ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర వైద్య మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న హిందీ సలహా సంఘం పునర్నిర్మాణానికి సం బంధించి కీలక నియామకాలు చోటు చేసుకున్నాయి. పద్మభూషణ్ పురస్కార గ్రహీత, సాహిత్య విమర్శకుడు, ప్రఖ్యాత రచయిత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ సంఘానికి సభ్యునిగా ఎంపిక య్యారు. ఆ సంఘంలో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సభ్యత్వం దక్షిణాది రాష్ట్రాల మేదస్సుకు వచ్చిన గౌరవమే కాక, భాషా సమరసతకు దోహదపడే శుభ సంకేతంగా భావించవచ్చునని భాషా పండితులు అభిప్రాయపడుతున్నారు. ఇందులో మొత్తం పదిహేడు మంది సభ్యులు ఉండగా, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాత్రమే దక్షిణ భార తదేశం నుండి ఎంపిక కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. భాషాభిన్నతలు గల దేశంలో దక్షిణాది రాష్ట్రాల హిందీ మద్దతుదారుల జ్ఞానం, అనుభవం కూడ కేంద్ర సంస్థల్లో ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. యార్లగడ్డ నియామకం ఈ కోణంలో ఎంతో ప్రాధాన్యత కల్గి ఉంది. ఈ నియామకం మూడేళ్ళ కాలానికి వర్తిస్తుంది. ఈ వ్యవధిలో హిందీ పరిపాలనా వ్యవస్థలలో సమగ్రత,ప్రాంతీయ భాషలతో మైత్రి, హిందీ కార్యక్రమాల్లో సమగ్ర వనరుల వినియోగానికి సంబంధించి యార్లగడ్డ సలహాలు దిశానిర్దేశకంగా పనిచేయనున్నాయి.

# పట్టణాభివృద్ధి ఇక వేగవంతం: హైరైజ్ బిల్డింగ్స్‌కు సత్వర అనుమతులు

**విజయవాడ,మే 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పట్టణాభివృద్ధిని వేగవంతం చేయడంలో భాగంగా, పెద్దస్థాయి భవన నిర్మాణాలకు (హైరైజ్ బిల్డింగ్స్- 12 అంతస్తులు. అంతకంటే ఎక్కువ) అనుమతులను త్వరితగతిన ఇవ్వడాన్ని లక్ష్యంగా పెట్టుకుని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇకపై ఇటువంటి భవన నిర్మాణాలకు అభివృద్ధి అనుమతులు ఇవ్వడానికి డైరె క్టరేట్ ఆఫ్ టౌన్,కంట్రీ ప్లానింగ్ (డిటీసీపీ) కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రత్యేక సెల్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను డిటీసీపీ డైరెక్టర్ సమర్పించగా, దానిని పరిశీలించిన ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

అనుమతుల మంజూరుకు గరిష్ఠంగా72 గంటల (మూడు పని దినాలు)వ్య వధి విధిస్తూ సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ (ఎస్ఎల్ఏ )ఆధారంగా అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించింది.ఈ ప్రత్యేక సెల్ ఏర్పా టుతో అనేక నిర్మాణ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ వేగంగా లభించే అవకాశం ఉంది. దీని వల్ల రాష్ట్రంలోని పట్టణాల్లో మౌలిక సదు పాయాల అభివృద్ధి మరింత ఊపందుకోనుంది. ఈ సందర్భంగా పురపాలక, పట్టణా భివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సురేశ్ కుమార్ ఈ అంశం గురించి వివరిస్తూ పెద్దస్థాయి నిర్మాణాలకు త్వరి త అనుమతులు ఇవ్వడంవల్ల రాష్ట్ర అభివృద్ధి దిశగా మరింత వేగం వస్తుంది.

ప్రజలు, సంస్థలు అనుమతుల కోసం ఇబ్బందులు పడకుండా పారదర్శకమైన విధానం అమలులోకి వస్తోంది. ఇది రాష్ట్ర నిర్మాణ రంగ అభి వృద్ధిలో మైలు రాయిగా నిలుస్తుంది అని చెప్పారు.

# పర్యాటక సంస్థలకు ఇపిఎఫ్,ఇఎస్ఐ రాయితీ

## మూడేళ్ల దాకా యజమాని వాటా ప్రభుత్వమే భరిస్తుంది

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించే దిశగా కూటమి ప్రభుత్వం ఉపాధి ప్రోత్సాహక విధానాన్ని ప్రకటించింది. కనిష్టంగా కోటి పెట్టుబడి పెట్టే ప్రాజెక్టులను యూనిట్‌గా తీసుకొని ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. ముఖ్యంగా ఆయా సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు యజమాని (ఎంప్లాయర్) చెల్లించాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ వాటా మొత్తాలను మూడేళ్ళ వరకు ప్రభుత్వమే సమకూర్చనుంది. కొత్త పర్యాటక విధానం 2024-29కి అనుబంధంగా సోమవారం ఎంప్లాయిమెంట్ ఇన్సెంటివ్ పాలసీని ప్రకటించింది. పర్యాటక రంగానికి ఇప్పటికే పారిశ్రామిక హోదా కల్పించగా,పర్యాలకులను ఆకట్టుకునే వివిధ కార్యక్రమాలను మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. యూనిట్ కనిష్ఠ పెట్టుబడి రూ. కోటి ఉండి, 25 మందికి ఉపాధి కల్పిస్తే ఈపీ ఎఫ్,ఈఎస్ఐలో యజమాని వాటి 100%, 15-24 మంది ఉంటే 75%,10-14 మంది ఉద్యోగులుంటే 50%,మేర ప్రోత్సా హకంగా మూడేళ్ళపాటు చెల్లించనున్నారు. ఇందుకోసం ఆయా ప్రాజెక్టుల కార్యకలాపాలు నిర్దేశించిన గడువులోగా ప్రారంభమై ఉండాలి. ఉద్యోగులు కంపెనీ పేరోల్‌లో విధిగా ఉండాలి. ముఖ్యంగా సాహస కార్యకలాపాలు(అడ్వంచర్, రెస్టారెంట్/ఫ్లోటింగ్ రెస్టారెంట్, మీటింగ్, కాన్ఫరెన్స్, ఎగ్జిబిషన్లు(ఎంఐసీఈ),వినోద ఉద్యానవనాలు (అమ్యూజ్ మెంటు పార్కులు), పర్యావరణ, పర్యాటక(ఎకో-టూరిజం),లాడ్జిలు,హౌస్‌బోట్లు, కల్చరల్, హెరిటేజ్ కార్యకలాపాలకుఈరాయితీలు వర్తించనున్నాయి.

# ఎపి ఎయిమ్స్‌లో రోబోటిక్ సర్జరీలు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:**ఏపీ రాజధాని ప్రాంత ఎయిమ్స్‌లో ఉన్న విభాగాలతో పాటు తాజాగా గుండె శస్త్రచికిత్స విభాగాన్ని ప్రారంభించినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ అహంథెం సాంతాసింగ్ తెలిపారు. ఇందులో గుండెకు సంబంధించిన అన్ని పరీక్షల నిర్వహణకు అవసరమైన పరికరాలు సమకూరినట్లు తెలిపారు. ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీని కూడ నిర్వహించామని, రోబోటిక్ సర్జరీలను ప్రారంభించామని వెల్లడించారు. ప్రపంచ నర్సింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎయిమ్స్‌లో నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిర్వ హించిన వాక్‌థాన్‌ను ఆయన ప్రారంభించారు. ఎయిమ్స్ నుండి మంగళగిరి అంబేద్కర్ విగ్రహం కూడలి వరకు ర్యాలీ సాగింది. కార్డియాక్ అరెస్ట్ సమయంలో అత్యవసరంగా నిర్వహించాల్సిన సీపీఆర్‌పై ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.కంటింజెన్సీ ఆస్పత్రిగా ఎయిమ్స్ మంగళగిరిని తీర్చిదిద్దుతున్నారు.ముఖ్యమంత్రికి అత్యవసర వైద్యసేవల నిమిత్తం మంగళగిరిలోని ఎయిమ్స్‌ని కంటింజెన్సీ ఆస్పత్రిగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇప్పటి వరకు మణిపాల్ ఆస్పత్రి ఒక్కటే కంటింజెన్సీ హాస్పటల్‌గా ఉంది.

# ఆర్డీటీపై నిర్ణయం మార్పుకోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి: అఖిలపక్ష నేతలు

**విజయవాడ,మే13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌ను (ఆర్డీటీ) కాపాడుకోవాలని అఖిలపక్ష సమావేశం తీర్మానించింది. ప్రభుత్వానికి సమానంగా సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు నిధులు నిలిపేస్తూ తీసుకున్న నిర్ణయం సమంజసం కాదంటూ పలు రాజకీయ పక్షాల నేతలు అభిప్రాయపడ్డారు. విజయవాడ దాసరి భవన్‌లో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో రూరల్ డెవలప్ మెంట్ ట్రస్టు పరిరక్షణపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి హాజరయ్యారు. ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలను అందించిందన్నారు. ఈ సంస్థ ప్రజలలో ఎంతో పేరును సంపాదించిందని స్పష్టం చేశారు.కరోనా సమయంలో ఆర్డీటీ ప్రజలకు విశేష సేవలు అందించిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు గుర్తు చేశారు. అలాంటి సంస్థకు మతం రంగు పులమడం సమంజసం కాదన్నారు. ఫారిన్ రెగ్యులేటరీ నిబంధనల వల్ల విదేశాల నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయని అన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై అందరూ కలిసికట్టుగా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నమ్మిన సిద్ధాంతాల కోసం ఆర్డీటీ సంస్థ పని చేస్తుందని, సంస్థ పూర్తిగా పారదర్శకంగా వ్యవహ రిస్తుందని అభిప్రాయపడ్డారు. ఆర్డీటీ ఎప్పుడూ పేరు, ప్రఖ్యాతల కోసం పాకులా డలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఏ పార్టీకి మద్దతుగా ఇప్పటివరకు పని చేయలేదన్నారు. ఏ పార్టీ ఆదేశాలను తలకెక్కించుకోలేదని వారు పేర్కొన్నారు. కేవలం ప్రజల సంక్షేమం కోసమే ఆర్డీటీ కృషి చేసిందని వెల్లడించారు.

**నిబంధనలు ఎత్తివేయాలి:** అఖిలపక్ష నేతలు ముఖ్యమంత్రిని కలిసి, ఆర్డీటీపై నిబంధనలు ఎత్తివేసేలా చొరవ తీసుకోవాలని అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి సూచించారు. ఈ సంస్థ కుల, మతాలకు అతీతంగా పని చేస్తుందని స్పష్టం చేశారు.

# ఎంపిలు, ఎంఎల్‌ఎల ప్రొటోకాల్‌పై జాగ్రత్తలు వహించండి

## అధికారులు,జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు: శాసనసభాపతి లేఖపై స్పందన

**విజయవాడ,మే 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎంపీలు,ఎంఎల్ఏలు,ఎంఎల్సిలకు ప్రొటోకాల్,మర్యాదల విషయంలో ఎలాంటి లోటూ జరగడానికి వీల్లేదని రాష్ట్రస్థాయిల అధికారులు, జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీలు, ఎంఎల్ఏలు, ఎంఎల్సీలు, వీవీఐపీలు, విఐపీలకు ప్రొటోకాల్ విషయంలో పాటించాల్సిన నిబంధనలపై 2012లో జిఒ నెం.348 ద్వారా సాధారణ పరిపాలనా శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను మంత్రులు,రాష్ట్ర జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో ఎంఎల్ఏలు చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని శాసనసభాపతి సీహెచ్ అయ్యన్నపాత్రుడు మార్చి 26న ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. శాసనసభ్యులకు జిల్లా అధికారులు సమయం ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. అధికారులను కలిసేందుకు వెళ్ళిన శాసనసభ్యులను గంటలపాటు వేచి ఉండేలా చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఎంఎల్ఏలు ఇస్తున్న విజ్ఞప్తులకు మంత్రులు,అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని, జవాబు ఇవ్వడం లేదని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణం తగు చర్యలు తీసుకొని మంత్రులు,అధికారులు,జిల్లా యంత్రాం గానికి ఉత్తర్వులు జారీ చేయాలని ఆయన కోరారు. దానిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులు,జిల్లా యంత్రాంగానికి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీలు,ఎంఎల్ఏలు ఇచ్చిన విజ్ఞాపనలు,లేఖలపై తక్షణం స్పందిం చాలని, వారు అడిగిన సమాచారాన్ని వెంటనే అందచేయాలని వ్యక్తిగతంగా కలిసేందుకు వారికి వెంటనే సమయం ఇవ్వాలని సూచించారు. కీలకమైన ప్రభుత్వ కార్యక్రమాలు,సంక్షేమ పథకాల ప్రాధాన్యతను తగ్గిస్తూ,తమను ప్రధానం తమను ప్రొజెక్ట్ చేయాలంటూ కొందరు జిల్లా స్థాయి అధికారులు చేస్తున్న వత్తిడి కుడా ప్రోటో కాల్ నిబందన అతిక్రమించినట్లు అవుతుందని స్పీకరు పేషీ మౌఖికంగా ఆదేశించినట్లు సమా చారం. సీఎంపాల్గొన్న కార్యక్రమాల్లోను కలెక్టర్ల ను హైలెట్ చేస్తూ పత్రికా ప్రకటనలు జారీ చేయడం సరికాదని హెచ్చరించినట్లు సమాచారం.

# ఎపి భవన్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ సిఎం చంద్రబాబు సూచనలతో నిలిపివేత

**విజయవాడ మే 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీలోని ఏపీ భవన్ ప్రాంగణంలో ఏపీ భవన్‌లో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ నిలిచిపోయింది. ఆక్రమణల తొలగింపు అంశంపై అధికారులతో సిఎం చంద్రాబాబు మాట్లాడారు.0.37 ఎకరాల్లో ఆక్రమణలను అధికారులు గుర్తించారు. రెండు ప్రార్ధనా మందిరాలు ఉన్నాయని, వాటిని తొలగించాల్సి ఉందని సిఎం దృష్టికి వారు తీసుకెళ్ళారు.ప్రార్ధనా మందిరాల తొలగింపుపై సంయమనం పాటించాలని,ప్రజల మనోభావాలు దెబ్బతినే చర్యలు తీసుకోవద్దని అధికారులకు చంద్రబాబు సూచించారు. సిఎం సూచనతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను అధికారులు నిలిపివేశారు.

# సీమ రైల్వే విద్యుత్ విభాగంలో పదోన్నతులు

**గుంతకల్లు రైల్వే,మే 13,ప్రభాతవార్త:** రాయలసీమ జిల్లాల్లోని దక్షిణ మధ్య రైల్వే విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న పలువురు అధికారులకు పదోన్నతులు కల్పించడంతో పాటు, స్థానచలనంగా విస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డివిజన్ పరిధిలోని తిరుపతిలో ఎడిఇఇగా పనిచేస్తున్న జీ ప్రసాద్‌ను సీనియర్ స్కేల్ పదోన్నతిపై విజయవాడ డివిజన్ డిఇఇ గాను, ఆయన స్థానంలో రేణిగుంట విద్యుత్ టిఆర్‌డి వింగ్‌లో ఎడిఇఇగా పనిచేస్తున్న యం శ్రీనివాసులును నియమించారు. వీరితో పాటు జోన్ పరిధిలో హైదరాబాద్,కన్స్‌ట్రక్షన్స్, గుంటూరు, తుని, రాజమండ్రిలలో పనిచేస్తున్న పలువురికి పదోన్నతులు, బదలీలు చేశారు.

# తిరుమల సమాచారం

## ముగిసిన పద్మావతిఅమ్మవారి వసంతోత్సవాలు



**తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో సమానంగా తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో అన్ని రకాల సేవలు, కైంకర్యాలు పాంచరాత్ర ఆగమంతో జరుగుతాయి. వేసవితాపం నుండి పద్మావతి అమ్మవారికి ఉపశమనం కలిగించడానికి నిర్వహించిన వసంతోత్సవాలు మంగళవారం సాయంత్రం వేదోక్తంగా ముగిశాయి. చివరిరోజు మంగళవారం ఉదయం అమ్మవారిని ఉదయం మేల్కొలిపి ఆలయంలో కైంకర్యాలు జరిపించిన అర్చకులు అనంతరం ఉత్సవమూర్తిని శుక్రవారపు తోటకు వేంచేపుచేసి అక్కడ విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. పలు రకాల పండ్లరసాలతో అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మ వారి ఉత్సవమూర్తి ఆలయ మాఢవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి మహాపూర్ణాహుతితో వసంతోత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ అర్చకులు బాబుస్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ రమేశ్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, సుబ్బరాయుడు భక్తులు పాల్గొన్నారు.



# భారత్ సైన్యానికి మరింత శక్తినివ్వాలి

## తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో జనసేన పూజలు

**తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** పహల్గామ్‌లో గతనెలలో యాత్రికులపై ఉగ్రవాదులు దాడిచేసి 26మందిని హతమార్చడం, తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో భారత సైన్యం వీరోచితంగా పోరాడి భారత్ ప్రతిష్టను ప్రపంచానికి చాటారు.

భారత్ ,పాక్ మధ్య ఉద్రిక్త తలతో యుద్ధం జరగడం, చివరకు భారత్ ధాటికి పాకిస్తాన్ తప్పుతెలుసకుందని తిరుపతి జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రస్తుతం యుద్ధం విరమణ జరిగినా మళ్ళీ అవాంఛనీయసంఘటనలు చోటుచేసు కున్నా భారతప్రధాని నరేంద్రమోదీ,భారత సైన్యం ఆత్మస్థైర్యంతో అన్నివిధాలా శక్తిని ప్రసాదించాలని వేడుకున్నామన్నారు.జనసేనాని ,ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ప్రధాని మోదీకి దైవబలం మెండుగా ఉండాలని, సైనికులకు దేశనాయకత్వానికి తిరుత్తణి సుబ్ర మణ్య స్వామి ఆశీస్సులు ఉండాలని మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశామన్నారు. దేశ రక్షణకోసం ప్రదాని మోదీ తీసుకునే నిర్ణ యాలను జనసేన బలపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి, చిత్తూరుజిల్లాల నాయకులు తాతినేని వెంకటేశ్వరరావు, పొన్నా యుగంధర్, బాలసుబ్రమణ్యం, నరసింహ, ఎస్‌కె బాబు, రాజారెడ్డి, సికె రేవతి, దూది కుమారి, పొన్నాలచంద్ర, శివకుమార్, హరిశంకర్, ఆకేపాటి సుభాషిణి, కీర్తన,ఆర్కాట్ కృష్ణప్రసాద్, పగడాల మురళీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రప్రజలకు శుభాలు కలగాలి

## గంగమ్మజాతర పూజల్లో మాజీమంత్రులు

**తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి నగర గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మజాతర వేడుకల్లో మంగళవారం మాజీమంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు, ఆర్‌కె రోజా కుటుంబసభ్యులు పాల్గొన్నారు. ఉదయం గంగమ్మకు సారెను తీసుకువచ్చిన మాజీమంత్రులు ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయ ఇఒ జయకుమార్, అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాయలసీమలోనే తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఎంతో మహిమాన్వితమైన తల్లి అని, ఆమెను వేడుకుంటే అంతా శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# శ్రీవారి ఆశీస్సులందుకున్న జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప

**తిరుమల,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప తెలిపారు. ఆయన మంగళవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

# పటిష్ట ఏర్పాట్లతో గంగమ్మ జాతర ప్రశాంతం

**తిరుపతి,మే 13ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ జిల్లాల్లోనే తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ జాతర పటిష్ట ఏర్పాట్లుతో మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. వారంరోజులు జరిగే తాతయ్య గుంట గంగమ్మజాతరలో రోజుకోవేషంలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం, గంగమ్మ రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారం. సోమవారం అర్ధరాత్రి శాంతిఅభిషేకం నిర్వహించిన ఆలయ అర్చకులు ఆ తరువాత తెల వారుజామున 4.30గంటల నుండి సామాన్య భక్తులకు దర్శనం కల్పించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పర్యవేక్షణలో గంగమ్మ ఆలయ ఇఒ జయకుమార్ ,తిరుపతి నగర కమిషనర్ మౌర్య స్వయంగా ఏర్పాట్లుపై పర్యవేక్షించారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం

**అమ్మకము కొరకు ముందస్తు ప్రకటన**

SARFAESI చట్టం 2002 యొక్క సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 లోని రూల్ 8 (6) నిబంధనల అనుసరించి జారీ చేయడమైనది.

టు,
**ఋణగ్రహీత చిరునామా:** **శ్రీమతి సంగడాల నిర్మల,** భర్త : కంపా రవి ప్రసాద్, టీడీ కాలనీ, తంగెళ్ళమూడి గ్రామం, ఏలూరు మండలం, ఏలూరు - 534005. **వేరొక చిరునామా:** **శ్రీమతి సంగడాల నిర్మల,** భర్త : కంపా రవి ప్రసాద్, ఫ్లాట్ నెం.ఎఫ్-టి-1, ఝాన్సీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్, సమీప డి.నెం.4-6, సౌభాగ్య లక్ష్మి టెంపుల్ రోడ్డు, వట్లూరు, ఏలూరు.
సర్ / మేడమ్

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(12) దీనితో చదువుకోలసిన సదరు రూల్స్‌లోని రూల్ 3 ప్రకారం ఋణగ్రహీతలకు **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** యొక్క అధీకృత అధికారి **తేది. 04-02-2020**న జారీచేసిన డిమాండ్ నోటీసులో తెలిపిన విధంగా **తేది.31-01-2020** నాటికి చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.33,73,741/-** (అక్షరాల ముప్పై మూడు లక్షల డెబ్బై మూడు వేల ఏడు వందల నలభై ఒక్క రూపాయలు మాత్రమే) + **తేది.01.02.2020** నుండి కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు వసూలు నిమిత్తం పైన తెలిపినట్లు 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.

మీరు మొత్తం ఋణాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సదరు ఆస్తులను సెక్షన్ 13(4) దీనితో సదరు రూల్స్‌లోని రూలు 8(1) ప్రకారం అధీకృత అధికారి సదరు తనఖా ఆస్తిని **తేది.28.05.2020**న స్వాధీనం చేసుకున్నారు. సదరు స్వాధీనత నోటీసును **తేది.03-06-2020**న **(ఈనాడు : ఏలూరు జిల్లా ఎడిషన్ (తెలుగు)** మరియు **ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ : తాడేపల్లిగూడెం ఎడిషన్ (ఇంగ్లీష్))** దినపత్రికలలో రూలు 8(2) ప్రకారము ప్రచురించడమైనది.

తనఖా ఉంచిన దిగువ తెలిపిన ఆస్తులపై గల **తేది.04-02-2020**న డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి మొత్తమును ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించవలెను. లేని యెడల సదరు ఆస్తులు విక్రయించుటకు బహిరంగ వేలం కొరకు టెండర్లు / కొటేషన్లు సాధారణ ప్రజానీకం వద్ద నుండి ఆహ్వానించబడును.

**స్థిరాస్తి వివరములు**

ఏలూరు, వట్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, పెదపాడు మండలం, వట్లూరు గ్రామం, సౌభాగ్యలక్ష్మి గుడి రోడ్డు ఎదురుగా, సమీప డి.నెం.4-6 వద్ద ఆర్.ఎస్.నెం.189 లోని 460 చ॥గ॥ల మొత్తం విస్తీర్ణంలో 40 చ॥గ॥ల అవిభాజ్యపు వాటా విస్తీర్ణంతో "ఝాన్సీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్" నాల్గవ అంతస్తు నందు 1355 చ॥అ॥లు (కామన్ ఏరియా & కార్ పార్కింగ్ ఏరియాతో సహా) విస్తీర్ణంతో గల ఆర్‌సిసి రూఫ్డ్ నివాస డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ నెం.ఎఫ్-టి-1 యావత్తు ఆస్తి శ్రీమతి సంగడాల నిర్మల, భర్త : కంపా రవి ప్రసాద్ గారికి చెందినది. (రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.5465/2018, తేది.16.05.2018 ప్రకారం). **అపార్ట్‌మెంట్‌కు హద్దులు: తూర్పు** : పంచాయితీ రోడ్డు, **దక్షిణం** : పగడాల సీతమ్మ గారి స్థలం, **పడమర:** పిల్లి రామయ్య & ఇతరుల స్థలం, **ఉత్తరం** : అనసూయమ్మ, తండ్రి : పిల్లి రామయ్య గారి స్థలం. **ఫ్లాట్ నెం.201కు హద్దులు: తూర్పు** : ఓపెన్ టు స్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం** : ఓపెన్ టు స్కై.

తేది: 26-03-2025
ప్రదేశం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

వార్త

ఔన్నత్యం గల వ్యక్తి ఎన్ని సంవత్సరాలు జీవించవచ్చుననే దాని కంటే ఎంతటి ఉన్నత విలువలు పాటిస్తున్నామనే విషయానికే ప్రాధాన్యమిస్తాడు.

-సెనెకా

# రుతుపవన సంకేతం

అటు వడదెబ్బలు, ఇటు వడగళ్లు రైతును కుదేలు చేసిన సంఘటనలు మన కళ్లెదుటే తారసపడ్డాయి. దాదాపు నెల రోజులకుపైగా అకాల వర్షాలకు రైతు లబోదిబోమన్నాడు. వడదెబ్బకుజనం నీరసపడ్డారు. ఆగని వర్షాలు ధాన్యాన్ని అమ్ముకోనీయలేదు. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం తీరా ధర రాకుండానే వర్షార్పణమయ్యాయి. ఈ రెండు ఉదంతాలు సకల జనాన్నీ నిండా ముంచాయనే చెప్పాలి. నిన్నటికి నిన్న తెలంగాణలో వడదెబ్బకు ముగ్గురు నేలకొరిగారు. మరో చోట్ల వడ్ల కొనుగోలు కేంద్రంలో పడిగాపులు పడిన ఓ రైతు ఎండ తీక్షణతో తన ధాన్యం రాశులమీదనే ప్రాణం వదిలాడు. పెద్దవంగర మండలం రామోజీ తండాకు చెందిన గుగులోతు క్రిషన్ (60) యాసంగి ధాన్యాన్ని పోచంపల్లి కొనుగోలు కేంద్రానికి తెచ్చాడు. తేమ ఎక్కువ ఉందని నిరాకరించగా ఆరుదలకు ఏర్పాట్లు చేశారు. ప్యాడీ క్లీనర్ సహాయంతో వడ్లు తూర్పారబడుతుండగా శోషతో కిందపడి చనిపోయాడు. ఇలాంటి సందర్భాలలో విపక్షాలు ప్రభుత్వంపై విరుచుకుపడడం సర్వసాధారణం. పెట్టుబడి సాయాన్ని అరకొరగా అందించి, రుణమాఫీకి షరతులు పెట్టి, తీరా పంట ఉత్పత్తుల కొనుగోలులో కూడా ఉదారత కనిపించకపోవడంతో రైతులు సరైన ఉపశమనం దొరకని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు దిగుతున్నారన్న విషయం వాస్తవమే. ఎక్కడ ఉపశమనం దొరికినా రైతు సరిపెట్టు కుంటాడు. కానీ ప్రకృతి సహకరించక ప్రభుత్వాల సహా యమూ అందకపోతే చింతాకాంత్రుడౌతాడన్నది విదితమే. వడగళ్ళ, వడదెబ్బలతో కుదేలవుతున్న జనానికి రానున్న కాలం మంచి చేయబోతోందని ఆనందపడుతున్నారు. రేపటి కాలం గురించి ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎండా కాలంలోనే వర్షాకాలపు ఛాయలు విస్తృతంగా కనిపిస్తున్నాయి. వేసవి వెళ్లలేదు కానీ సోమవారం రాత్రి కురిసిన కుంభవృష్టితో హైదరాబాద్ నగరం తల్లడిల్లిపోయింది. నైరుతి రుతుపవనాల రాకకివి సంకేతం. తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ సూచికలు రైతాంగానికి, సాధారణ జనానికి ఎప్పటికప్పుడు అందుతూనే ఉన్నాయి. కొంతలో కొంత అప్రమత్తంగా ఉన్నా రైతాంగానికి ఏమాత్రం కలిసిరావడం లేదు. సాధారణ జనమైతే ఊపిరిపీల్చుకుంటున్నారు. ఇక రైతుల ఆశలన్నీ నైరుతి రుతుపవనాల రాకపైనే. దీని విషయంలో వాతావరణ శాఖ తాజా సమాచారాన్ని అందిస్తోంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంగళవారం సాయంత్రానికి అండమాన్ నికోబార్ దీవుల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయి. దక్షిణ బంగాళాఖాతంలోకి రుతుపవన ప్రవేశం ఉంటుంది. రుతుపవనాలు కేరళను యేటా జూన్ నెలలో తాకుతాయి. ఈసారి కాస్త ముందుగా అంటే మే 27 నాటికే తాకుతాయని అంచనా. ప్రస్తుత రుతుపవనాలు అండమాన్, బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశముంది. తెలంగాణలో వాతావరణం రోజుకొకలాఉంది. ఎప్పుడు వానలు పడతాయో ఎప్పుడు ఉష్ణోగ్రత పెరుగుతుందో అనిర్దిష్టం. సోమవారం కొన్ని ప్రాంతాల్లో 42డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. కొన్ని చోట్ల భారీ వర్షాలు పడ్డాయి. అనిశ్చిత వాతావరణం. రుతుపవన సంకేతాల వలన రేపటి వ్యవసాయానికి సురక్షిత బాటలు వేసుకునేందుకు వ్యవసాయదారులకు అవకాశముంటుంది. జూన్ 20న ఏరువాక పున్నమి. ఆ రోజు కన్నా ముందుగానే రైతు తన వ్యవసాయ క్షేత్రాన్ని సాగుకు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. నైరుతి రుతుపవనాలు తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశించిన నాటి నుంచి ఏరువాక వరకు పంట పొలాల్లో సందడి నెలకొంటుంది. రైతు తన క్షేత్రాన్ని సిద్ధం చేసుకుంటాడు. ప్రభుత్వాలు కూడా వర్షాకాల ప్రవేశానికిముందే వ్యవసాయ ప్రణాళికలను సిద్ధంచేసి రైతుకు విత్తనాలు ఎరువులు, రద్దు చేసే పనిలో పడతాయి. రైతులకు ఎక్కడా విత్తనాల కొరత లేకుండా ముందస్తుగానే కార్యాచరణకు దిగాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఖరీఫ్ కోసం 3.31లక్షల మెట్రిక్ టన్నుల ఎరువును, మరో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచారు. ఒకటి, రెండుపంటలు తప్పితే మిగిలిన అన్నిరకాల పంట ఉత్పత్తుల కొనుగోళ్ల బాధ్యత రాష్ట్రప్రభుత్వాలపైనే పెట్టడం వలనతమపై భారీ ఒత్తిడి ఉందని దీనివల్లనే కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన అంగీకరించారు. రానున్న వర్షాకాలంలో అత్యధిక వర్షాలు పడతాయని ఇంతక్రితమే భారత వాతావరణ సంస్థ వెల్లడించింది. గత యేడాది కూడా ఇదే పరిస్థితి. అందుచే పంటల ఉత్పత్తుల విషయంలో తెలుగు రాష్ట్రాలు ఎటువంటి ఇబ్బందులూ పడలేదు. రబీలో మంచి దిగుబడులు సాధించాయి. అయితే చివరి రోజుల్లో అకాల వర్షాలే అన్నదాతల్ని ఇబ్బంది పెట్టాయి. తెలంగాణలో 79.88 లక్షల ఎకరాల్లో పంటలు సాగైతే, రికార్డుస్థాయిలో 59.78 లక్షల ఎకరాలలో ధాన్యం పండింది. కాగా ఈసారి ఆరబోత జరిగితేనే కానీ తేమ పోయే పరిస్థితి లేనందున టార్పాలిన్‌లు, పట్టాలవంటి సౌకర్యాలు లేక రైతులు యాతన పడ్డారు. ఇదే పరిస్థితి ఆంధ్రాలో ఎదు రైనా ముందు జాగ్రత్త చర్యగా అన్నీ సమకూర్చుకోగలిగినందున కొంత గట్టెక్కినట్లే. ఏదిఏమైనా ఈసారి ఖరీఫ్‌సాగుపై రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అన్నదాత ఆశలకు, అవసరాలకు అనుగుణంగా పాలకులు రుణాలు, ఎరువులు తదితరవన్నీ సకాలంలో అందించగలరని ఆశిద్దాం.

గొప్ప త్యాగాలు చేయగలిగినప్పుడు గొప్ప పనులు చేయగలం.



స్వామి వివేకానంద

క్రమశిక్షణ నుంచే జీవితం తన విలువను పొందుతుంది. కాబట్టి జీవితపు క్రమశిక్షణ అన్నది జీవితం కంటే చాలా అమూల్యమైనది.



తిరుక్కురళ్

# ప్రజావాక్కు



## పాక్‌కు మరింత బుద్ధి చెప్పాలి

పెద్దన్న అని పిలుచుకునే అమెరికా జోక్యంతో ఇండో - పాక్‌ల మధ్య కాల్పుల విరమణ జరిగిన కొద్ది గంటల్లోనే పాక్‌మరల కాల్పులకు తెగబడింది. కొన్నిప్రశ్నలకు సరైన సమాధానంకావాలి. ఉగ్రవాదులందరిని తుదముట్టించడం పూర్తయిందా? పాక్ ఆక్రమించిన కాశ్మీర్‌లోని భూభాగం భారత్ వశంలోకి ఇంకాఎప్పుడు వస్తుంది? పాక్ లో తల దాచుకుంటున్న ఉగ్రవాదులైన మసూద్ అజర్, హాఫీజ్ సయీద్‌ను భారత్‌కు అప్పగించడానికి పాక్ ఒప్పుకున్నదా? విరమణ ఒప్పందం కుదిరిందన్నప్పుడు మరల పాక్ కాల్పులుజరిపితే ఎందుకు మరింత గట్టిగా ప్రతిస్పందించలేదు? సింధునది జలాలను పాక్‌లో ప్రవహింపచేస్తారా? కాల్పులవిరమణ ఒడంబడికకు కాలపరిమితి ఉంటుందా? భారత్‌లో ఉగ్రవాదుల దాడి ఇకముందు ఉండదా? సిందూర్ అనే నామధేయానికి పూర్తి న్యాయం జరిగినట్టేనా? పాకిస్థాన్‌ను నమ్మి అనేక సార్లు భారత్ భంగపడిన మాట వాస్తవమనే విషయం అందరికి తెలిసినదే. ఇప్పుడు చెప్పిన బుద్ధి సరిపోలేదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## ప్రమోషన్లలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి

దృష్టి లోపంతో ఉన్న ఉద్యోగవికలాంగుల సమస్యలను వికలాంగుల సంక్షేమశాఖ తెలంగాణ రాష్ట్రప్రభుత్వానికి తెలియజేయాలి. అంధ లెక్చరర్స్ మరియు టీచర్స్‌కు దృష్టి లోపం వలన విద్యార్థుల సహకారం చేత బోర్డుపై రాయడం చదవడం జరుగుతుంది. వీరికి రిడర్స్ అలవెన్స్ పెంచాలి. నాన్ డ్యూటీలు వీరికి మినహాయింపు ఇవ్వాలి. గురుకులాలలో టీచింగ్ డైరీ రాయడం మినహాయించాలి. ప్రయాణ సౌకర్యానికి రాయితీ కల్పించాలి. ప్రమోషన్లలో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి.

-రాపాక రవీందర్, జనగాం

## అవగాహన సదస్సులు నిర్వహించాలి

తెలంగాణలో ధరణి రద్దు చేసి భూభారతి యాప్‌లో భూ సమస్యలేకుండా చేసుకోటానికి ప్రజలలోరైతులకు అవగాహనా సదస్సులునిర్వహించాలి. రైతే రాజు కానీ రాయితీతో రైతు కూలీలకు తండ్రి తదనంతరం భూమిని వారస్వతంగా స్లాట్ బుకింగ్ లేకుండా తక్షణమే కుమారుని పేరున భూమిని పట్టా చేసియివ్వాలి.

-ఎస్. లక్ష్మీనారాయణ, భూపాలపల్లి

## స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి

వాహనాల వేగాన్ని నియంత్రించుటకు ప్రధాన రోడ్ల పైన వేసిన స్పీడ్ బ్రేకర్లు రోడ్డు నియమ నిబంధన ప్రకారం ఏర్పాటు చేసినారు. కానీ ఇతర రహదారులు, కాలనీ, గల్లి రోడ్లపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉన్నవి ఈ స్పీడ్ బ్రేకర్లు చిన్నపాటి ఆనకట్టవలె ఎత్తుగా ఉండడం వలన ఎటువంటి వాహనదారులకైనా నడుపుటకు చాలా ఇబ్బంది పడవలసివస్తున్నది. ఈ స్పీడ్‌బ్రేకర్ల దగ్గర రోడ్లపై నీరు సక్రమంగా వెళ్లకుండా నిల్వ ఉండడం వలన రోడ్లు పాడైపోతున్నవి. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు అన్ని రకములైన వాహనాలు ఈ స్పీడ్ బ్రేకర్ వలన పాడైపోతున్నవి. కావున వెంటనే రోడ్డు నియమ నిబంధనలు అనుసరించి తగు విధంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి.

- దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## కొత్త ఆయుధాల సేకరణ

ప్రపంచం యుద్ధాలు జరిగాయి. ప్రాణ నష్టం చాలా జరిగినా తేలిన ఒక విషయం ఏమిటంటే జర్మనీ యుద్ధ సమయంలో మరీ కొత్త కొత్త ఆయుధాలు టార్పెడోస్ అనేక కొత్త టెక్నాలజీ డెవలప్ చేసి యుద్ధం పేరిట టెస్టులు చేసింది. అలాగే ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్థాన్ పై వాడిన డిఫెన్స్ సిస్టంలో అన్ని అంటే ఆకాష్, బ్రహ్మోస్, ఇతర బ్లాస్టిక్ మిసాయిల్స్, పాక్‌కు సప్లై చేసిన న్యూటెక్ అని నమ్మించి మార్కెట్ పెంచుకోవడానికి ఇచ్చిన చైనా, అమెరికా, తుర్కివాటిని తుక్కు కింద బ్లాస్ట్ చెయ్యడమే కాక ప్రపంచానికి ఎందుకు పనికిరావు అని నిరూపించింది. మనకు ఇటు మన వాటిని టెస్ట్ చేసుకునేందుకు అటు మన పవర్ నిరూపించింది. మన ధర్మం మనల్ని కాపాడుతుంది.

-గర్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## వైద్యులకు సదుపాయాలు కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదవీవిరమణ తర్వాత సిజిహెచ్ఎస్ పథకంతోఆరోగ్య సేవలకుఉంది. ఈపథకంతో ఉన్న ప్రస్తుత కేంద్రాలకు అద్దె భవనాలు ఎక్కువ. రాష్ట్ర ప్రభుత్వాలు వారి సొంత అవసరాలకు వీరుఅద్దెకు ఇవ్వలేరు. వైద్యులకు, లబ్ధిదారులకు తగినవసతి, కనీససదుపాయాలు లేవు. వైద్యుల కొరత, పరిమిత కేంద్రాలవల్ల ఎన్నో సమస్యలున్నాయి. రాష్ట్ర కేంద్రాల్లో ఉన్నత అధికార్లు ఉండడం వల్ల వైద్యాధికారుల సమస్యలు వారికి విన్నవించడం తప్ప నిర్ణయం, మార్పులు చేసే అవకాశం లేదు. ఫిర్యాదులు ఎన్నో అపరిష్కృతంగా ఉన్నాయి.

-బొల్లోజు మేఘానాధం, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'సిందూర్' ఉపశమనమా? శాశ్వత పరిష్కారమా?

భారత్‌పాక్‌ల మధ్య సాగుతున్న భీకర పోరాటాన్ని ఇప్పటి వరకు భారత్ యుద్ధంగా ప్రకటించలేదు. కేవలంఉగ్రవాదుల ఏరివేతకు సంబంధించిన 'ఆపరేషన్ సింధూర్'లోని వివిధ దశలుగానే పేర్కొనడం గమనార్హం. పూర్తిస్థాయి యుద్ధం గనుక సంభవిస్తే భారత్ వద్దనున్న అధునాతన ఆయుధాలతో పాక్ కొద్దిరోజుల్లోనే భారత్‌చేతిలో ఓటమిచెందకతప్పదు. ఒక చిన్న దేశమైన ఉక్రెయిన్ బలమైన ఆయుధ సామర్థ్యంగల రష్యాతో సంవత్సరాల తరబడి పోరాడడం లేదా?అనే మీమాంస కొందరిలో ఉంది. పాక్ పరిస్థితివేరు, ఉక్రెయిన్ పరిస్థితి వేరు. ఉక్రెయిన్‌కు అమెరికా, నాటోలుసహకరించడం వలనే ఇంతకాలం యుద్ధం చేయగలిగింది. కాని పాక్‌కు సహాయం చేయడం బూడిదలో పోసిన పన్నీరుగానే ప్రపంచ దేశాలు భావిస్తు న్నాయి. భారత దేశానికి అనేక సందర్భాల్లో పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే అవకాశాలొచ్చినా ఆ అవకాశాలన్నింటినీ జారవిడుచుకుని చారిత్రక తప్పిదం చేసిందని విశ్లేషకుల అభిప్రాయం.



సుంకవల్లి సత్తిరాజు

ఇటీవల భారత్ పాక్‌ల మధ్య జరుగుతున్న భీకర పోరాటానికి స్వస్తి చెబుతున్నట్టుగా, ట్రంప్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ జరిగినట్టుగా వెలువడుతున్న వార్తలు గందరగోళానికి దారితీసాయి. అయితే పి.ఓ.కె ను భారత్‌కు పాక్ అప్పగించడమే సమస్యకు శాశ్వత పరిష్కారమని కాశ్మీర్ పై ఇతర దేశాల జోక్యం అంగీకరించబోమని భారత ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. అయితే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను దక్కించుకునే సువర్ణావకాశాన్ని భారత ప్రభుత్వం చేజేతులా జారవిడిచిందనే విమర్శలు వస్తున్న నేపథ్యంలో మోడీ జాతి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. భారత దేశ ఆయుధ, ఆర్మీ శక్తిని పాక్‌కు తెలియచెప్పామని, పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులను తుదముట్టించామని, భారత్ త్రివిధ దళాల దాడులను పాక్ తట్టుకోలేక కాళ్ల బేరానికొచ్చిందని, ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఇదే సందర్భంలో ఆపరేషన్ సింధూర్ పేరిట భారత్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని నిలుపుదల చేసానని, తాను జోక్యం చేసుకోకపోతే ఇరు దేశాల మధ్య అణు యుద్ధం సంభవించి, లక్షలాది మంది మరణించి ఉండేవారని ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు భారతదేశ పౌరుల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. అమెరికా అధ్యక్షుని వ్యాఖ్యలను భారత్ నిర్ద్వంద్వంగా ఖండించింది. యుద్ధం ఆపకపోతే ఇరు దేశాలతో వాణిజ్య సంబంధాలను నిలుపుదల చేస్తానని తాను హెచ్చరించబట్టే భారత్ పాక్‌లు సంధి కుదుర్చుకున్నాయని ట్రంప్ చేసిన ప్రకటనలో వాస్తవముందా? అదే నిజమైతే భారత్ అమెరికాకు తలొగ్గినట్టేనని దేశ ప్రజలు భావిస్తారు. ఇప్పటికే సాంఘిక మాధ్యమాల్లో ప్రధానిపైన, అత్యున్నత స్థాయి అధికారుల పైన జరుగుతున్న ట్రోలింగ్‌ను తిప్పికొడుతూ, కేంద్ర ప్రభుత్వం పాక్‌కు గుణపాఠం చెప్పగలదా? ట్రంప్ తాను చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోమని భారత్ కోరగలదా? పాక్ డి.జి.ఎం.ఓ కాళ్ళబేరానికి రావడంతోనే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ చెబుతున్నది. అయితే అమెరికా పెత్తందారీ మధ్యవర్తిత్వాన్ని ఖండించడంలో చేసిన ప్రకటనలో అంతగా తీవ్రత కనిపించడం లేదు. ఈ కారణంగానే మోడీ ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 1971వ సంవత్సరంలో ఇందిరాగాంధీ చేసిన సాహసంతో ప్రస్తుత ప్రభుత్వ చర్యను పోల్చి చూస్తూ మోడీని విమర్శిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. అయితే మోడీ దేశ భక్తిని శంఖించడం తగదు. ఏఏ కారణాలు కాల్పుల విరమణలో ప్రధాన భూమిక పోషించాయో మనకు తెలియదు. ఆపరేషన్ సింధూర్‌కు కేవలం తాత్కాలిక విరామమిచ్చామని, పాక్ తోక జాడిస్తే తగిన బుద్ధి చెబుతామని మోడీ దేశ ప్రజలకు విస్పష్టంగా చెప్పడం జరిగింది. భారత్‌కు సవాల్ విసిరిన ఉగ్రమూకలను తుదముట్టించడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ పేరుతో పాక్‌లోని పలు ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది. అయితే పాక్ ఆటలు భారత్ ముందు సాగలేదు. కేవలం రెండు మూడు రోజుల్లోనే పాక్ చేతులెత్తేసి శరణు వేడుకునే పరిస్థితి దాపురించింది. కేవలం టర్కీ తప్ప ఏదేశమూ పాక్‌కు సహాయం చేయలేదు. పాక్‌లో ఆర్థిక కారిడార్ నిర్మించుకుంటున్న చైనా కూడా పాక్ వెంటరాలేదు. బలూచిస్తాన్ పోరాట యోధులు తమ ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. తమకు ఎవరూ సహకరించడం లేదని, చివరికి ఇస్లాం దేశాలు కూడా మొహం చాటేసాయని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కన్నీటి పర్యంతమై పలాయనం చిత్త గించారు. పాక్ ఆర్మీలో లుకలుకలుప్రారంభమయ్యాయి. పాక్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి భారత్ సంసిద్ధమౌతుండగా ఇంతలోనే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన మధ్యవర్తిత్వంతో భారత్, పాక్‌లు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించినట్టు ట్వీట్



చేసి పాక్‌పై ఆగ్రహజ్వాలలతో రగిలిపోతున్న భారత దేశ పౌరులపై నీళ్ళుచల్లారు. ఎరుపెక్కిన కళ్ళతో, అపారమైన దేశ భక్తితో అలుపెరుగక పోరాడుతున్న త్రివిధ దళాల్లో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. పాక్ పతనంచూడాలనే ఆవేశంతో దేశ ప్రజలంతా ఉత్కంఠతో ఎదురుచూస్తున్న తరుణంలో 'సీజ్ ఫైర్' వార్త కారణంగా ఒక్కసారిగా దేశంలో స్తబ్ధత ఆవహించింది. విజయానికి అతి సమీపంలో ఉన్న సమయంలో భీకరంగా సాగుతున్న పోరుకు బ్రేకులు పడ్డాయి. అమెరికా మధ్యవర్తిత్వానికి కారణాలేమిటి? పాక్ పై యుద్ధం నిలుపుదల చేయడానికి ఇరుదేశాలకు అమెరికా ఎలాంటి సూచనలు చేసింది?ఇందుకు భారత దేశం ఎందుకు ఒప్పుకుంది? ఈ ఒప్పందానికి భారత్ విధించిన షరతులేమిటి? భారత్ పాక్‌యుద్ధం రెండు దేశాలకు సంబంధించిన విషయమని, జె.డి వాన్స్ చెప్పగా, అంతలోనే తాను ఇరు దేశాలకు మధ్యవర్తిత్వం వహించి కాల్పుల విరమణకు ఒప్పించానని ట్రంప్ ఎలా చెప్పగలరు? చైనా, సౌదీ అరేబియా, జి 7దేశాలు భారత్ పాక్ మధ్య సంధి కుదర్చడంలో ఎలాంటి పాత్ర వహించాయి? భారత్ విజయం సాధిస్తే పాక్‌లో తాను కొనసాగిస్తున్న నిర్మాణాలకు, ఆర్థిక కారిడార్‌కు భంగమని చైనా భావించిందా? ఏది ఏమైనప్పటికీ పాక్ విషయంలో భారత్ అందివచ్చిన అవకాశం చేజార్చుకోవడం వెనుక కారణ మేమిటి? ఇది మరో చారిత్రక తప్పిదమా? లేదా యుద్ధాల వలన భారత్ ఆర్థిక వ్యవస్థను ఉన్నత స్థానానికి తీసుకుపోలేమన్న కారణమా? అల్లకల్లోలంగా మారిన పాకిస్థాన్ గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రస్తుతం కాల్పుల విరమణకు అంగీకరించినా, కుక్కతోక వంకర అన్నట్టుగా భారత్‌పై దాడులు చేయదని గ్యారంటీ లేదు. పాక్ ప్రభుత్వంతో పాటు మిలటరీ కూడా ఉగ్రవాదుల కనుసన్నల్లోనే మెలగక తప్పదు. మత చాంధసవాదులైన ఉగ్రవాదులతో నిండిన పాక్‌లో ఉగ్రవాదులదే అంతిమ నిర్ణయం. అక్కడి ప్రభుత్వం కేవలం ఉత్సవ విగ్రహమే. భవిష్యత్తులో భారత్‌లో ఏ చిన్న ఉగ్రదాడి జరిగినా, దానిని యుద్ధ చర్యగానే భావిస్తామని భారత్ ఇప్పటికే ప్రకటించింది. ఉగ్రవాదులు పాక్ మాట వినరు. ఉగ్రవాదులతో పాక్ ఆర్మీ తన సాన్నిహిత్యాన్ని వదులుకోదు. ఉగ్రవాదులకు భారత దేశాన్ని నాశనం చేయడమే ఏకైక లక్ష్యం. కాబట్టి ఎన్ని ఒప్పందాలు కుదిరినా ఉగ్రవాదుల ధోరణిమారదు. భారత్‌ను ప్రశాంతంగా ఉండనీయరు. కాబట్టి భారత్ ఈసారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి. ఆర్థికంగాను, రక్షణపరంగాను అత్యంత దయనీయమైన స్థితిలో ఉన్న పాక్‌ను లొంగ దీసుకుని, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను విలీనం చేసుకునే మరో అవకాశాన్ని కాల్పుల విరమణ ద్వారాభారత్ జారవిడుచుకున్నట్టుగా చాలామంది భావించారు. భారత్ పాక్‌ల మధ్య భీకర దాడులు కొనసాగుతున్న సమయంలో భారత్ అభ్యంతరం చెప్పినా పాక్‌కు ఐ.ఎం.ఎఫ్ 2.3 బిలియన్ డాలర్ల రుణం మంజూరు చేయడం వెనుక ఎవరి అదృశ్య హస్తముంది? ఏఏ దేశాలు పాక్‌కు ఆర్థిక సాయం చేయడానికి ఐఎఫ్ఎంను ఒప్పించాయి?ఐ. ఎమ్.ఎఫ్ రుణం వెనుక కాల్పుల విరమణ అంశం ముడిపడి ఉందా? అనే విషయం తేలాలి. భారత్‌పాక్‌ల మధ్య సాగుతున్న భీకర పోరాటాన్ని ఇప్పటి వరకు భారత్ యుద్ధంగా ప్రకటించలేదు. కేవలంఉగ్రవాదుల ఏరివేతకు సంబంధించిన 'ఆపరేషన్ సింధూర్' లోని వివిధ దశలుగానే పేర్కొనడం గమనార్హం. పూర్తి స్థాయి యుద్ధం గనుక సంభవిస్తే భారత్ వద్దనున్న అధునాతన ఆయుధాలతో పాక్ కొద్దిరోజుల్లోనే భారత్‌చేతిలో ఓటమిచెందకతప్పదు. ఒక చిన్న దేశమైన ఉక్రెయిన్ బలమైన ఆయుధ సామర్థ్యం గల రష్యాతో సంవత్సరాల తరబడి పోరాడడం లేదా? అనే మీమాంస కొందరిలో ఉంది. పాక్ పరిస్థితి వేరు, ఉక్రెయిన్ పరిస్థితి వేరు. ఉక్రెయిన్‌కు అమెరికా, నాటోలుసహకరించడం వలనే ఇంతకాలం యుద్ధం చేయగలిగింది. కాని పాక్‌కు సహాయం చేయడం బూడిదలో పోసిన పన్నీరుగానే ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. భారత దేశానికి అనేక సందర్భాల్లో పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే అవకా శాలొచ్చినా ఆ అవకాశాలన్నింటినీ జారవిడుచుకుని చారిత్రక తప్పిదం చేసిందని విశ్లేషకుల అభిప్రాయం. ఏది ఏమైనప్పటికీ తాజాగా భారత్ తనకు అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేక అమెరికా ట్రాప్‌లో ఇరుక్కుపోయి, అప్రతిష్ఠపాలైనట్టు ఎంతోమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉగ్రవాదులు భారత్‌వైపు కన్నెత్తి చూడకుండా భారత ప్రభుత్వం పాక్‌పై కఠిన నిబంధనలు విధిస్తే సమంజసంగా ఉండేది. అప్పుడే ఆపరేషన్ సింధూర్‌కు సార్థకత చేకూరేది. ●

# వ్యవసాయ భవిష్యత్తుకు డిజిటల్ మార్గదర్శనం

డి. అశోక్

భారతదేశం వ్యవసాయ ప్రాధాన్యత గల దేశం. దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ప్రపంచం డిజిటల్ యుగంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో, వ్యవసాయ రంగం కూడా సాంకేతిక పరిజ్ఞానం వైపు దూసుకెళ్తోంది. ఈ పరిణామంలో డిజిటల్ వ్యవసాయం కీలక పాత్రపోషిస్తోంది. డిజిటల్ వ్యవసాయం అనేది డేటా, సమాచారం, సాంకేతిక పరిజ్ఞానాల ఆధారంగా వ్యవసాయ చర్యలను ప్రణాళిక చేయడం, అమలు చేయడం, విశ్లేషించడం. ఇందులో కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్‌సిస్టమ్, డ్రోన్లు, మొబైల్ అప్లికేషన్లు వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తారు. ఈ విధానం ద్వారా రైతులు తమ పొలాలకు సంబంధించిన రియల్ టైం సమాచారం తెలుసుకోవచ్చు. విత్తనాల ఎంపిక, సాగు విధానం, నీటిపారుదల, క్రిమిసంహారకాలు, మార్కెట్ ధరలు వంటి విషయాల్లో సమగ్ర సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. డిజిటల్ వ్యవసాయ ప్రయోజనాలు ఎన్నో గమనించవచ్చు. సరైన సమాచారం ఆధారంగా సాగు చేస్తే పంట దిగుబడి మెరుగవుతుంది. రైతుల ఆదాయం పెరుగుతుంది. మార్కెట్ సమాచారం ఆధారంగా సరైన సమయంలో పంటలుఅమ్మితే మంచి ధర లభిస్తుంది. నీరు, ఎరువులు, ఔషధాల వాడకాన్ని కచ్చితంగా నియంత్రించవచ్చు. ఇన్పుట్‌లను అర్థవంతంగా వినియోగించడంతో పర్యావరణంపై ప్రభావం తగ్గుతుంది. అధిక దిగుబడితో ప్రజలకు సమృద్ధిగా ఆహారం లభించే అవకాశముంటుంది.



పంటల పెరుగుదల, తెగుళ్ళ, వాతావరణం వంటి అంశాలను విశ్లేషించి నిర్ణయాలు తీసుకునేలా చేస్తాయి. పొలాల్లోని తేమ స్థాయి, ఉష్ణోగ్రత, గాలి తేమ వంటి సమాచారం ఇవ్వడంలో సహాయపడతాయి. పొలాలపై అవలోకనం చేయడం, ఔషధాలు పిచికారీ చేయడం వంటి పనుల్లో ఉపయోగపడతాయి. భూభాగాన్ని విశ్లేషించేందుకు, ఏ భూమిలో ఏపంట మంచిదో నిర్ణయించేందుకు ఉపయోగపడతాయి. డిజిటల్ వ్యవసాయంలో సవాళ్లు కూడా లేకపోలేదు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్, ఎలక్ట్రిసిటీ మౌలిక వసతుల కొరత కనిపిస్తుంటుంది. రైతుల్లో సాంకేతిక అవగాహన లేకపోవచ్చు. డేటా ప్రైవసీ, భద్రతపై చట్టాలు స్పష్టంగా లేకపోవచ్చు. చిన్న రైతులకు సాంకేతిక పరికరాల ధరలు అధికంగా ఉండడం కూడా ఆటంకమే. డిజిటల్ వ్యవసాయం భారతీయ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. ఇది కేవలం ఉత్పాదకతే కాదు, రైతుల జీవన ప్రమాణాలను మెరుగుపరచే శక్తిని కూడా కలిగిఉంది. ఈ రంగం చిట్టచివర కొలమానం కాకుండా, వ్యవసాయ ఆర్థికతకు మార్గదర్శిగా మారుతోంది. 'ఇండస్ట్రీ 4.0' వలె 'డిజిటల్ వ్యవసాయం' వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోందని సంస్థ విశ్వాసం వ్యక్తం చేసింది. భారతదేశం డిజిటల్ వ్యవసాయం దిశగా ముందుకు సాగుతోంది. ఇది ఇప్పటికీ ప్రారంభ దశలోఉన్నా, అభివృద్ధి తేవడానికి ప్రభుత్వం, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ల భాగస్వామ్యం చాలా అవసరం. రైతులను డిజిటల్ టెక్నాలజీతో చేతనంగా చేయడం ద్వారా, దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధిని సాధించవచ్చు. ●

# కులగణన పేదలను గుర్తించేందుకేనా?



ఎనుగొండ నాగరాజ నాయుడు

ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతులు తెలిపేదే వర్గ విశ్లేషణ అని భారత రాజ్యాంగం భావించితే, కాదు కులమని సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా పదేపదే తెలిపింది. కుల ఆధారిత జీవనాధార అంతరాల సమాజం మనది. 1931 సెన్సస్ ప్రకారం 4147 కులాలుగా గుర్తించినారు. యంత్ర పొలిటికల్ సర్వే ప్రకారం 6325కులాలు దేశంలో ఉన్నాయి. 2011లో యూపీఏ గవర్నమెంట్-2 నిర్వహించిన సోషియో ఎకనామిక్ సర్వే ప్రకారం 4673034 కులాలు ఉపకులాలు గోత్రాలు కలిగిన వారిగా గుర్తించడం జరిగింది(దీనిని విడుదల చేయలేదు). ఈ దేశం కులాలమయం. అభివృద్ధి ఫలాలు అందరికీ అందలేదు. బీహార్‌లో జరిగిన కులగణాల వలన అక్కడ మూడింట రెండు వంతులు వెనుకబడిన వర్గాల ప్రజలు కర్ణాటకలో జరిగిన సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం 50శాతం పైగా రిజర్వేషన్లు కావాలని వెనుకబడిన వర్గాలు కోరుకుంటున్నారు. కులగణన జాతీయ సమస్యగా మారింది. కులగణన కోరిన రాహుల్ గాంధీని అర్బన్ నక్సలైట్‌గా పేర్కొన్న వాళ్లు ఇప్పుడు అదే కులగణన కోరుకుంటున్నారు. వీళ్ళు రూరల్ నక్సలైట్లు? వీరి ప్రకారంనిన్నటి వరకు దేశంలో నాలుగే నాలుగు కులాలు ఉండేవి అవి ( పేదలు ,యువత, స్త్రీలు, రైతులు). ఇప్పుడు వీళ్ల దేశంలో ఉన్న అన్నికులాలను వారి సామాజిక ఆర్థిక రాజకీయ స్థితిగతులను గురించి లెక్కించుతారా? లేదా దేశంలోని వివిధ కులాల శాతం మాత్రమేనా? అప్పుడు కులగణన రాజకీయ లబ్ధి కోసమే అవుతుంది. ఓబీసీలకు రాజ్యాంగం తొలి ప్రతిలో రిజర్వేషన్ లేదు. తమిళనాడులో నిరసనలను చెలరేగాక సుప్రీంకోర్టు జోక్యంతో రాజ్యాంగాన్ని తొలి సవరణకు ఆర్టికల్ 15(4) చేర్చి రాష్ట్రాల స్థాయిలో విద్యా ఉద్యోగాలు రిజర్వేషన్ కల్పించారు. అయితే కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఈ సౌకర్యం కల్పించలేదు. ఓబీసీలు సామాజిక విద్య ఆర్థిక రంగాల్లో ఎదుర్కొంటున్న వివక్ష వెనుకబాటుతనం పేదరికలను తొలగించడానికి అవసరమైన సూచనలు ఇవ్వడానికి 1979 జనవరి 1న అప్పటిప్రధాని మొరార్జీ దేశాయి బిపి మండల్ కమిషన్ వేశారు. దేశ జనాభాలు ఓబీసీలు 54శాతం ఉన్నారని మండల కమిషన్ తేల్చింది. వారికి కేంద్ర ప్రభుత్వంలో ప్రభుత్వ రంగసంస్థల 27శాతం రిజర్వేషన్ కల్పించాలని సూచించింది. ఆ సిఫార్సులన్నీ ఒక దశాబ్దం తర్వాత 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ ఆమోదించారు. ఓబీసీలకు రిజర్వేషన్ కల్పించడం



సహించలేని ఆధిపత్య కులాలు తీవ్ర ఆగ్రహంతో రగిలిపోయాయి. ఉత్తర భారతదేశంలో నిరసనజ్వాలలు చెలరేగాయి. స్వాతంత్రం వచ్చాక గడిచిన 78 ఏళ్లలో 14 మంది ప్రధానులు మారారు గాని ఒక్కరూ కులగణాల జరపడానికి సాహసించలేదు. బ్రిటిష్ ప్రభుత్వంలో జనాభా లెక్కల కమిషనర్‌గా ఉన్న జిహెచ్ హాటన్ 1931లో మనదేశంలో కులగణనను నిర్వహించాడు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉండగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ 2011లో సామాజిక ఆర్థిక కులగణనను నిర్వహించింది. దానిమీద నిరసనలు చెలరేయగలడంతో ఆ నివేదికను బయటకు రాకుండా నిలిపివేశారు. మనం ఇప్పటికీ 90ఏళ్ల క్రితంకులాల గణాంకాల ఆధారంగానే దేశ జనాభాలో కులాల శాతాల గురించి మాట్లాడుతున్నాం. జనాభా లెక్కల్లో ఎస్సీ ఎస్టీలు వరకు వివరాలు సేకరిస్తుంటారు. అది కూడా 2011 తర్వాత ఆగిపోయింది. 78ఏళ్ల స్వాతంత్ర్యం కులగణన నిర్ణయాన్ని గొప్ప చర్యగా భావించడం రాజకీయంగా సబబే కావచ్చు కానీ దాని వెనుక సామాజిక ఆర్థిక రంగాల్లో వైఫల్యమే కొట్టొచ్చినట్లు కనబడుతుంది. వైఫల్యాలు పునరావృతం కాకుండా ఎటువంటి చర్యలు, విధానాలు చేపట్టాలో స్పష్టం చేయకుండా కేవలంకులాలను లెక్కించడం వల్ల జరిగేలాభం పెద్దగా ఉండదు. కులంతోపాటు ఉద్యోగ, విద్య, ఆస్తులు వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగపరిస్తే రాజకీయ రంగమే చాలా ఒడిదుడుకులకు లోను కావలసి వస్తుంది. కులజనాభాను బట్టి ఉద్యోగాలు పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. ఇది జాతీయ సమస్యగా ఉన్నది. అందుకోసం రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు విధించిన 50శాతం పరిమితిని ఎత్తివేయాలని గట్టిగా కోరుతోంది. దేశవ్యాప్తంగా కులలెక్కలు అందుబాటులోకి వస్తే ఆపరిమితి తొలగించాలనే ఒత్తిడి తీవ్రమోతుంది. ఆర్థికాభివృద్ధి ఫలాలు అందరికీ అందని విధానాలు ఎప్పటిలాగే కొనసాగితే కులం ప్రాంతం ఆధారంగా కొత్త డిమాండ్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. కులాల్లో ఆర్థిక అంతరాలను పరిగణలోకి తీసుకొని మాత్రమే రిజర్వేషన్ కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవాల్సిన సమయంవచ్చింది. ఆదాయ సంపద అసమానత్వం మనభారత్లో చాలా తీవ్రంగా ఉందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు వచ్చాయి. పరిస్థితిని ఎంతో కొంత చక్కదిట్టడానికి తోడ్పడితేనే కులగణన సార్థకత లభిస్తుంది. దానికి విరుద్ధంగా జరిగితే ప్రజాస్వామ్యం సంకుచిత భావాలతో సతమతమైపోతుంది. హేతుబద్ధత లోపిస్తుంది. పేదరికం నిరుద్యోగాన్ని ఆదాయ అసమానతలను తొలగించుకోవాలనుకునే వారికి కులగణన జనగణన అనే ప్రశ్నలు ఎందుకు వస్తాయి? ఏ కులం వారు ఎంతమంది ఉన్నారో ఎన్ని ఓట్లు దండుకోవచ్చు అనుకునే వాళ్లకు కులగణన అవసరమేమో ఇదే కదా ఓటు బ్యాంకు రాజకీయమంటే. జనగణలోనే కులగణన చేయకూడదా? జనాభా లెక్కల్లోనే కులగణన చేసి ఎవరు అభివృద్ధి ఫలాలు అందుకోలేకపోతున్నారు చెప్పగలం. అప్పుడు కులపరమైన విభజన సమాజంలో ఉండే అవకాశంలేదు. కులగణన అనేది రాజ్యాంగం పరిధిలోనిది. 246అధికరణం కింద ఏడో షెడ్యూల్లో 69వజాబితాలో జనాభా లెక్కల ప్రస్తావనఉంది. ఇది కేంద్ర ప్రభుత్వ బాధ్యతని రాజ్యాంగం చెబుతున్నది. ●

# శ్రీనగర్ నుంచి ఇక హజ్ సర్వీసులు




## నేటి నుంచి ఎయిర్‌పోర్టు పునఃప్రారంభం

## జెకె, లడఖ్ నుంచి 3,900 మంది హజ్ యాత్రికులు

**శ్రీనగర్, మే 13:** భారత్‌పాకిస్తాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో గత ఆరు రోజులుగా మూతపడిన శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన సర్వీసులు నేటినుంచి తిరిగి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో ప్రయాణికులతో పాటు, హజ్ యాత్రకు సిద్ధమైన యాత్రికులు కూడా ఊపిరి పీల్చుకున్నారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడికి ప్రతిగా, భారత బలగాలు ఈనెల 7న పాకిస్తాన్ మరియు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగడంతో, ముందు జాగ్రత్త చర్యగా మే 7వతేదీ నుంచి శ్రీనగర్ విమానాశ్రయంలో పౌర విమానయాన కార్యకలాపాలను నిలిపివేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సరిహద్దు ప్రాంతాల్లో ఎటువంటి అసాధారణ కార్యకలాపాలు జరగలేదని భారత వైమానిక దళం ధృవీకరించడంతో విమానాశ్రయాన్ని తిరిగి తెరవాలని అధికారులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగా, ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 32 విమానాశ్రయాలను పౌర విమానాల రాకపోకల కోసం తిరిగి తెరుస్తున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సోమవారం నోటీసులు జారీ చేసింది. అంతర్జాతీయ విమాన మార్గాల పునఃప్రారంభానికి కూడా ప్రత్యేక నోటీసు విడుదల చేశారు. శ్రీనగర్ విమానాశ్రయంలో రేపటి నుంచి విమాన సర్వీసులు నడుస్తాయి. ఈ విషయాన్ని ఇప్పటికే విమానయాన సంస్థలకు తెలియజేశామని శ్రీనగర్ విమానాశ్రయ డైరెక్టర్ జావేద్ అంజుమ్ తెలిపారు. విమానాశ్రయం నేటి నుంచే కార్యకలాపాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, విమానయాన సంస్థలకు తమ విమానాలను, ప్రయాణికులను సిద్ధం చేసుకోవడానికి కొంత సమయం అవసరమని, అందుకే మంగళవారంనుంచి సర్వీసులు ప్రారంభిస్తున్నారని ఆయన వివరించారు. విమానాశ్రయం మూసివేత కారణంగా జమ్మూ కశ్మీర్ నుంచి హజ్ యాత్రకు వెళ్లాల్సిన యాత్రికులకు అంతరాయం కలిగింది. 2025 వార్షిక హజ్ యాత్ర కోసం జమ్మూ కాశ్మీర్ నుంచి 178 మంది యాత్రికులతో కూడిన మొదటి బృందం మే 4న సౌదీ అరేబియాకు బయలుదేరింది. ఆ తర్వాత విమానాశ్రయం మూసివేయడంతో, ఈనెల 7 నుంచి 12వ తేదీ మధ్య బయలుదేరాల్సిన ఏడు హజ్ విమానాలను అధికారులు రద్దు చేయాల్సి వచ్చింది. హజ్ విమానాల పునఃప్రారంభంపై జమ్మూ కాశ్మీర్ హజ్ కమిటీఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షుజాత్ అహ్మద్ ఖురేషీ స్పందిస్తూ, షెడ్యూల్ ప్రకారం 14 నుంచి హజ్ విమానాలు తిరిగి ప్రారంభమవుతాయి. ఈనెల 14, 15 తేదీలలో షెడ్యూల్ ప్రకారం మూడు విమానాలు నడుస్తాయి. గతంలో రద్దయిన ఏడు విమానాల కోసం త్వరలోనే కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం జమ్మూ కాశ్మీర్ నుంచి 3,622 మంది, లడఖ్ నుంచి 242 మంది యాత్రికులు హజ్ యాత్రకు వెళుతున్నారు. మే 4 నుంచి 15వ తేదీ మధ్య శ్రీనగర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మొత్తం 11 హజ్ విమానాలను నడపాలని మొదట షెడ్యూల్ చేశారు.



# మరిన్ని ఎస్400లు కొనుగోలుకు భారత్ సిద్ధం

## దేశ గగనతల రక్షణ వ్యవస్థ పటిష్టం

**న్యూఢిల్లీ, మే 13:** పాక్ దాడుల్ని దీటుగా తిప్పికొట్టిన ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ మిలిటరీ దళాల ప్రశంసలు పొందుతోంది. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్400లు కావాలంటూ భారత్ రష్యాకు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. ఇందుకు రష్యా సూత్రప్రాయంగా అంగీకరించిందని సమాచారం. పాక్ ప్రయోగించిన డ్రోన్లు, మిస్సైల్స్ వంటివాటిని ఎస్400 గగనతల రక్షణ వ్యవస్థ దీటుగా ఎదుర్కొన్న విషయం తెలిసిందే. మార్గమధ్యంలోనే పాక్ డ్రోన్స్, మిస్సైళ్లను ఇది ధ్వంసంచేసింది. అత్యంతకచ్చితత్వంతో, ప్రభావశీలతతో ఈ వ్యవస్థ పనిచేసిందని డిఫెన్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో మరిన్ని ఎస్400లు కొనుగోలు చేసేందుకు భారత్ నిర్ణయించుకుంది. గగనతల రక్షణ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రష్యా రూపొందించిన ఎస్400ను భారత్ సుదర్శన్ చక్ర పేరుతో మోహరించిన విషయం తెలిసిందే. మొత్తం ఐదింటిని కొనుగోలు చేసేందుకు 2018లో భారత్, రష్యా మధ్య ఒప్పందం కుదిరింది. పాక్, చైనా నుంచి ముప్పు పొంచి ఉన్న తరుణంలో భారత్ వీటి కొనుగోలుకు మొగ్గు చూపింది. 2021లో తొలి ఎస్400ను పంజాబ్‌లో మోహరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి భారత్‌కు ఈ ఐదు సమకూరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎస్400 ద్వారా నాలుగు రకాల మిస్సైళ్లను ప్రయోగించి శత్రదేశ డ్రోన్లు, యుద్ధ విమానాలు, క్రూయిజ్, బాలిస్టిక్ మిస్సైళ్లను ధ్వంసం చేయొచ్చు. ఇందులోని అత్యాధునిక ఫేజ్డ్ అరే రాడార్ ఒకేసారి 100 మిస్సైళ్ల ప్రయాణమార్గాన్ని గమనిస్తూ దాడులు చేయగలదు. శత్రుదేశ మిస్సైళ్లు, యుద్ధ విమానాలు 600 కిలోమీటర్ల దూరంలో ఉండగానే ఇది గుర్తిస్తుంది. 400 కిలోమీటర్ల దూరంలోనే ధ్వంసం చేస్తుంది.

వీటికి మొబైల్ లాంచర్లు కూడా అందుబాటులో ఉండటంతో యుద్ధ క్షేత్రంలో కావాల్సిన చోట రంగంలోకి దింపే అవకాశం కూడా ఉంది. ఎస్400 ముప్పు ఉండటంతో పాక్ యుద్ధ విమానాలు అనేకంమార్గమధ్యంలోనే వెనక్కు మళ్లాల్సి వచ్చింది. తాజాగా ప్రధాని మోదీ.. ఎస్400లు మోహరించిన ఆదమ్‌పూర్ వైమానిక స్థావరాన్ని కూడా సందర్శించారు. తద్వారా పాక్ వ్యాపిస్తున్న వందంతులకు చెక్ పెట్టారు.



## నేను ఏ అధికారిక పదవి చేపట్టను..

### ఆఖరి పనిదినం రోజున సిజెఐ సంజీవ్‌ఖన్నా వ్యాఖ్య

**న్యూఢిల్లీ, మే 13:** పదవీ విరమణ తర్వాత తాను ఎలాంటి అధికారిక పదవులు చేపట్టబోనని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా అన్నారు. తాను న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలని అనుకుంటున్నానని చెప్పారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్‌ఖన్నా పదవీకాలం మంగళవారంతో ముగిసింది. దాంతో తన ఆఖరి రోజు కోర్టులో బెంచ్ కార్యకలాపాలు ముగియగానే సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

కాగా జసిస్ సంజీవ్‌ఖన్నా గతేడాది నవంబరు 11న భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు మాజీ న్యాయమూర్తి, దివంగత జస్టిస్ హెచ్‌ఆర్‌ఖన్నా సమీప బంధువు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు జడ్జిగా నియమితులైన సంజీవ్‌ఖన్నా ఆ మరుసటి యేడాది శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, 2004 నవంబరు 11న సిజెఐగా బాధ్యతలు చేపట్టారు.

సంజీవ్‌ఖన్నా పదవీవిరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ (బిఆర్‌గవాయ్) బాధ్యతలుచేపట్టనున్నారు. మే14న ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము నూతన సిజెఐతో ప్రమాణస్వీకారం చేయిస్తారు. సీనియారిటీపరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్‌పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో కేంద్రం ఆమోదం తెలిపింది. జస్టిస్ గవాయ్ పదవీకాలం నవంబరు23న ముగియనుంది.

# అర్థరాత్రి పారిపోయిన బంగ్లా మాజీ అధ్యక్షుడు!

## లుంగీతోనే విమానం ఎక్కేసిన అబ్దుల్ హమీద్



**ఢాకా, మే 13:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం కుప్పకూలి పోయినప్పటి నుంచి ఆ పార్టీ నేతలు, మద్దతు దారులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తాత్కాలిక ప్రభుత్వాధినేతలు వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పటికే షేక్ హసీనా అక్కడి నుంచి పారిపోయి వచ్చి భారత్‌లో ఆశ్రయం పొందుతుండగా తాజాగా ఆ దేశానికి మరో మాజీ అధ్యక్షుడు దేశం విడిచి పారిపోయారు. అర్ధరాత్రి 3 గంటల సమయంలో లుంగీమీదనే విమానం ఎక్కేశారు. ప్రస్తుతం ఆయన థాయ్‌లాండ్ వెళ్లినట్లు తెలుస్తుండగా తాత్కాలిక ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. రిజర్వేషన్ల కోటా అంశంతో బంగ్లాదేశ్ రణరంగంగా మారగా 2024 ఆగస్టు నెలలో నిరసనకారులు ప్రధాని ప్యాలెస్‌ను చుట్టుముట్టారు. దీంతో 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికి షేక్ హసీనా ఆగస్టు 5వ తేదీన ఆ భారత దేశానికి పారిపోయి వచ్చారు. అప్పటినుంచి ఇక్కడే ఉంటూ ఆమె ఆశ్రయంపొందుతున్నారు. అయితే ఆ తర్వాత నోబెల్‌గ్రహీత ముహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా పదవీ బాధ్యతలు చేపట్టి దేశాన్ని పాలిస్తున్నారు. అలాగే షేక్ హసీనాను అక్కడికి రప్పించాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా అవామీ లీగ్ పార్టీ మద్దతుదారులు, నేతలకు చుక్కలు చూపిస్తున్నారు. అనేక కేసుల్లో వారిని ఇరికిస్తూ జైల్లలో పెడుతున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది జనవరిలో మాజీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ పై కూడా హత్య కేసు నమోదు చేశారు. ఇది చాలదన్నట్లుగా తాజాగా అవామీ లీగ్ పార్టీని పూర్తిగా నిషేధిస్తున్నట్లు సోమవారం రోజు బంగ్లా సర్కారు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. అవామీ పార్టీ, దాని నాయకులపై ప్రత్యేక ట్రిబ్యునల్ విచారణ పూర్తయ్యేవరకు ఈ నిషేధం కొనసాగుతుందని వెల్లడించింది. దీంతో అవామీ లీగ్ పార్టీకి చెందిన వాళ్లంతా మరింత భయపడిపోతున్నారు. ఇలాంటి సమయంలోనే 81 ఏళ్ల వయసు కల్గిన మాజీ దేశ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి థాయ్ ఎయిర్‌వేస్ విమానం ఎక్కినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా అర్ధరాత్రి 3 గంటల సమయంలో లుంగీ కట్టుకుని ఉండగానే దేశం విడిచి పారిపోయినట్లు సమాచారం. ఆయనతో పాటు సోదరుడు, బావ కూడా ఉన్నారంటూ ఇందుకు సంబంధించిన వీడియోలను కూడా విడుదల చేశారు. దీంతో యూనస్ సర్కారు దర్యాప్తు చేపట్టింది. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి మరీ అనేక మందిపై చర్యలు తీసుకుంది.

# భారత్‌పై పాక్ బోగస్ వార్తల క్యాంపెయిన్

**న్యూఢిల్లీ, మే 13:** భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ఎదుర్కొనే సత్తా లేక పాకిస్థాన్ తప్పుడు ప్రచారానికి తెరలేపింది. పాత ఫొటోలను ఎడిట్ చేసి తన ప్రజలను, ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేసింది. స్వయంగా సైనిక ఉన్నతాధికారులు ప్రెస్ మీట్ పెట్టి మరీ ఫేక్ ఫొటోలతో మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ఇది నమ్మి పాక్ ప్రజలు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. పాక్ తప్పుడు ప్రచారాన్ని ఆ దేశ ప్రజలు నమ్మారు కానీ ప్రపంచం నమ్మలేదు. సోషల్ మీడియా యుగంలో ఫేక్ వార్తల గుట్టు రట్టుచేయడం ఎంతసేపు ఫ్యాక్ట్ చెక్ పేరుతో పలు మీడియా సంస్థలు, సోషల్ మీడియా యూజర్లు పాక్ కుటిల నీతిని ఎప్పటికప్పుడు బయట పెట్టారు. ఇటీవల పాక్ డీజీ ఐఎస్ పీఆర్ ప్రెస్ మీట్ లో ఆ దేశ నేవీ అధికారి చూపించిన చిత్రం గుట్టును తాజాగా ఓనెటిజన్ బట్టబయలు చేశారు. అసలేం జరిగిందంటే భారత నౌకా దళాన్ని కట్టడి చేసేందుకు తమ యుద్ధ నౌకలను, ఫైటర్ జెట్లను, సబ్ మెరైన్లను సముద్రంలో వేగంగా మోహరించామని పాక్ నేవీకి చెందిన ఉన్నతాధికారి ఒకరు ప్రెస్ మీట్‌లో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఫొటో ఇదేనంటూ ఓ చిత్రాన్ని ప్రదర్శించారు. అందులో మూడు యుద్ధ నౌకలు వాటిపై ఎగురుతున్న మూడు నిఘా విమానాలు, నౌకల పక్కనే ఓ సబ్ మెరైన్ కనిపిస్తున్నాయి. అయితే, పాక్‌కు అంత సీన్ లేదని, ఈ ఫొటో ఎక్కడి నుంచి ఎత్తుకొచ్చిందని నెటిజన్లు క్రాస్ చెక్ చేశారు. ఫ్యాక్ట్ చెక్‌లో.. ఈ ఫొటో 2023లో చైనాతో కలిసి పాకిస్థాన్ హిందూ మహా సముద్రంలో నౌకాదళ విన్యాసాలు చేపట్టిన నాటి ఫొటో అని తేలింది. బీజింగ్ ఇస్లామాబాద్‌కు చెందిన యుద్ధ నౌకలు పెట్రోలింగ్ ఫార్మేషన్‌గా ఏర్పడినవి. వాటిపైన ఎగురుతున్న లాక్ హీడ్‌మార్టిన్ సంస్థ తయారుచేసిన పీ3సీ ఓరియన్ విమానాలు అని బయటపడింది. ఈ ఫొటోను కాస్త ఎడిట్ చేసి ఓ సబ్‌మెరైన్ చిత్రాన్ని జోడించి మీడియా ముందు ప్రదర్శించారని నెటిజన్లు చెబుతున్నారు.

# ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మొదలు!

**రియాద్, మే 13:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా మంగళవారం సౌదీ అరేబియాకు చేరుకున్నారు. ఆయనకు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ స్వాగతం పలికారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన తొలి పెద్ద పర్యటన ఇదే. దీనిలో భాగంగా ఆయన సౌదీ, యుఎఇ, ఖతార్‌ను సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం ఆయన విమానం రియాద్‌కు చేరుకొంది. ట్రంప్ వెంట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో,రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్, ఇంధన శాఖ మంత్రి క్రిస్ రైట్ ఉన్నారు. పశ్చిమాసియా పర్యటన నాలుగు రోజులపాటు జరగనుంది. మంగళవారం ట్రంప్ కోసం ఏర్పాటు చేసిన విందులో పలు కంపెనీల సిఇఒలు పాల్గొననున్నారు. వీటిల్లో అమెజాన్, ఎన్విడియా, ఓపెన్ ఎఐ, ఉబర్, కోకాకోలా, గూగుల్, బోయింగ్ సిఇఒలు ఉంటారన్నారు. దీనికి టెస్లా సారథి మస్క్ కూడా హాజరుకానున్నారు.



తాను తుర్కియేకు కూడా వెళ్లే అవకాశం ఉన్నట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఈ నెల 15 నుంచి ఉక్రెయిన్, రష్యా మధ్య చర్యలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పుతిన్, జెలెన్‌స్కీతో నేరుగా చర్చించే అవకాశాలున్నాయి.

**విమానం తాత్కాలికంగా బదలీనే..**

తనకు ఖతార్ రాజకుటుంబం అత్యంత విలువైన బోయింగ్ 737 విమానం గిఫ్ట్‌గా ఇవ్వనుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోవైపు ఆ బహుమతి తీసుకోవడం అనైతికం.. అన్న అంశాన్ని ఆయన కొట్టిపారేశారు. దాదాపు 400 మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన విమానాన్ని కానుకగా అందించనున్నట్లు ప్రచారం మొదలైంది. దీనిని ఎయిర్‌ఫోర్స్ వన్ కింద వాడుకోవాలని ట్రంప్ ఆలోచిస్తున్నారు. ఇప్పటివరకు అమెరికా అధ్యక్షులకు అందిన అత్యంత విలువైన బహుమతి ఇదే కావొచ్చు. దీనిని స్వీకరించడంపై వచ్చిన విమర్శలను తోసిపుచ్చారు. 'అంత ఉదారంగా ఖతర్ రాజకుటుంబం ఇచ్చే బహుమతిని వద్దనడానికి నేను మూర్ఖుడిని కాదు' అని పశ్చిమాసియా పర్యటనలకు వెళ్లే ముందు ట్రంప్ వ్యాఖ్యానించారు. చివరలో దీనిని ప్రెసిడెన్షియల్ లైబ్రరీకి ఇచ్చేస్తానన్నారు. వ్యక్తిగత అవసరాలకు వాడుకొనే ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు. మరోవైపు ఖతార్ ప్రతినిధి మాత్రం తాము విమానం ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. తాత్కాలికంగా ఓ విమానాన్ని బదలీ చేసే అంశం మాత్రమే చర్చల్లో ఉందని వెల్లడించారు.

# ఆరేళ్ల కనిష్టానికి రిటైల్ ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ, మే 13:** భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్ 2025లో ఆరేళ్ల కనిష్ట స్థాయికి చేరింది. కూరగాయలు, పప్పులు వంటి ఆహార పదార్థాల ధరలు తగ్గడం వల్ల సామాన్యులకు ఊరటనిచ్చింది. ఆర్బీఐ కూడా ధరల పరిస్థితి మెరుగుపడటంతో ఇటీవల వడ్డీ రేట్లనుతగ్గించిన సంగతి తెలిసిందే. రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని అంచనా వేసున్నారు. నిత్యావసర వస్తువులు, ఇతర ఉత్పత్తుల ధరలు దిగిరావడంతో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా ఆరేళ్ల కనిష్ట స్థాయికి చేరుకుంది. ఏప్రిల్ 2025లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.16 శాతంగా నమోదైంది. అంతకుముందు మార్చిలో ఇది 3.34 శాతంగా ఉండగా, గత ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 4.83 శాతంగా నమోదైంది. 2019 జులై తర్వాత ఇదే అత్యల్ప ద్రవ్యోల్బణం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడానికి ప్రధాన కారణం ఆహార పదార్థాల ధరలు గణనీయంగా తగ్గడమే. కూరగాయలు, పండ్లు, పప్పులు, ఇతర మాంసకృత్తులు అధికంగా ఉండే ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టాయి. పప్పుల ధరలు 5.23 శాతం తగ్గాయి. మార్చిలో కూడా 2.73 శాతం తగ్గుదల కనిపించింది. చిరుధాన్యాల ధరలు పెరుగుదల స్వల్పంగా తగ్గింది. మార్చిలో 5.93 శాతం పెరిగిన ధరలు, ఏప్రిల్‌లో 5.35 శాతానికి పరిమితమయ్యాయి. ఆహార పదార్థాల ధరలు తగ్గడంతో పాటు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలుకూడా స్థిరంగా ఉండటం ద్రవ్యోల్బణం తగ్గడానికి దోహదం చేసింది. దీనివల్ల సామాన్యుడిపై ఆర్థిక భారం తగ్గుతుంది. దీంతో వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణాన్ని 4 శాతంలోపు అదుపులో ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ద్రవ్యోల్బణం 3.16 శాతానికి తగ్గడం ఆర్బీఐకి ఊరటనిచ్చేవిషయం. ధరలపరిస్థితి మెరుగు పడటంతో ఇప్పటికే ఆర్బీఐ.. గత రెండు దఫాలుగా కీలక వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది.

## యుఎస్‌లో రోడ్డు ప్రమాదం

# ఇద్దరు భారతీయ విద్యార్థుల దుర్మరణం

**న్యూయార్క్, మే 13:** ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఇద్దరు భారతీయ విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఈఘటన చోటుచేసుకుంది. మృతులను సౌరవ్ ప్రభాకర్ (23), మానవ్ పటేల్ (20)గా గుర్తించారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాద ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరిద్దరూ ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీలో చదువుతున్నారు. ఈ నెల 10న పెన్సిల్వేనియాలోని లాంకస్టరన్ కౌంటీలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి వంతెన మధ్యలో ఇరుక్కుపోయింది.ఈ ప్రమాదంలో సౌరవ్,మానవ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించిచికిత్స అందించారు.

# తుర్కియేకు షాక్ ఇచ్చిన పుణే వ్యాపారులు!

**పుణే, మే 13:** పహల్గాం ఉగ్రదాడితో భారత్ ప్రతీకార చర్యలు చేపట్టింది. ముఖ్యంగా 26 మంది అమాయక ప్రజలను చంపింది. పాక్ ఉగ్రవాదులేనని గుర్తించి ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఉగ్రస్థావరాలే లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది. ప్రతిదాడులుచేసిన దాయాదికి తుర్కియే మద్దతుగా నిలుస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయం గుర్తు పెట్టుకున్న భారతీయులు.. ఆ దేశానికి చుక్కలు చూపిస్తున్నారు. ముఖ్యంగా పుణేలోని వ్యాపారులు ఆదేశం నుంచివచ్చే పండ్లపై నిషేధం విధించారు. యాపిల్స్‌ను వారి వద్ద నుంచి అస్సలే దిగుమతి చేసుకోవడం లేదు.

ఫలితంగా పుణేలోని మార్కెట్ యార్డుల్లో తుర్కియే యాపిల్స్ కనుమరు గయ్యాయి.పూణే మార్కెట్ కమిటీ ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలనుంచి యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటుంది. అందులోనూ టర్కీ నుంచి ఎక్కువగా యాపిల్స్‌ను దిగుమతి చేసుకుంటుంది. సీజన్‌కు తగ్గట్లుగా పండ్లను దిగుమతి చేసుకుంటూ పుణేలో భారీ వ్యాపారాలుచేస్తారు. పహల్గాం ఉగ్రదాడితో భారత్‌పాక్ దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పాకిస్తాన్‌కు తుర్కియే మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించడాన్ని భారతీయులు కోపోద్రిక్తులయ్యారు. ముఖ్యంగా పుణే వ్యాపారులు దాన్ని గుర్తు పెట్టుకుని మరీ ఆదేశంపై పగ తీర్చుకుంటున్నారు. ఆ దేశం నుంచివచ్చే పండ్లపై నిషేధం విధించారు. ప్రస్తుతం అక్కడి నుంచి పెద్ద ఎత్తున యాపిల్స్ వస్తుండగా వాటిని అస్సలే దిగుమతి చేసుకోవడం లేదు.

ఫలితంగా పుణేలోని మార్కెట్ యార్డులన్నీ తుర్కియే యాపిల్స్ లేక వెలవెల బోతున్నాయి. బ్యాన్ తుర్కియే అని చెబుతూ ఆ దేశం నుంచి అన్ని పండ్లను బహిష్కరిస్తున్నారు. నిషేధం లేకపోయి ఉంటే దాదాపుగా రూ.1200 నుంచి రూ.1500 కోట్ల టర్నోవర్ జరిగేదని.. కానీ పాక్‌కు మద్దతు ఇవ్వడంతో టర్కీ ఇంత పెద్ద నష్టాన్ని చవిచూడాల్సి వస్తోందని వ్యాపా రులు చెబుతున్నారు.వ్యాపారాలు మనతో చేస్తూ బాగా డబ్బులు సంపాదించుకుని, మన దేశంపైకే కత్తిదువ్వే వాళ్లకు ఇలాగే గుణపాఠం చెప్పాలంటూ వివరించారు. తుర్కియేనుంచి యాపిల్స్ కొనుగోలు ఆపేసి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఇరాన్ మరియు ఇతరప్రాంతాల యాపిల్స్‌ను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నామని చెప్పారు. భారత దేశం ఉగ్రవాదంపై చర్యలు తీసుకుంటుంటే తుర్కియే మాత్రం పాకిస్థాన్‌కు డ్రోన్లను సరఫరా చేసిందని వ్యాపారి సుయోగ్ జెండే గుర్తు చేశారు.

## అమృత్‌సర్‌లో విషాదం

# కల్తీమద్యం సేవించి 17 మంది మృతి



**అమృత్‌సర్, మే 13:** పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఘోర విషాదం చోటు చేసుకుంది. కల్తీ మద్యం తాగి 17 మంది చనిపోయారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. సోమవారం అమృత్‌సర్ మజితా బ్లాక్‌లోని భంగాలి కలన్, తారీవాల్, సంఘ, మరారి కలన్ గ్రామాలకు చెందిన కొంతమంది ప్రజలు మద్యం తాగిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురయ్యారు. వారిని దగ్గరలోని అమృత్‌సర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 17 మంది చనిపోయారు. మరో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న అమృత్‌సర్ డిప్యూటీ కమిషనర్ సాక్షి శాన్వే ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని సమీక్షించి అనంతరం మాట్లాడుతూ మజితా బ్లాక్‌లో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. నిన్న మద్యంతాగి 5 గ్రామాలకు చెందిన ప్రజలు అస్వస్థతకు గురైనట్లు మాకు సమాచారం అందింది. వెంటనే మేము మెడికల్‌టీమ్స్‌ను గ్రామాలకు పంపాము. మెడికల్ టీమ్స్ బాధిత గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఆరోగ్యం గురించివిచారిస్తున్నాయి. ఇప్పటివరకు 17 మంది చనిపోయారు. మరణాల సంఖ్య ఇక పెరగకూడదని దేవుడ్ని ప్రార్థిస్తున్నాము' అని అన్నారు. ఇక, పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని రక్షించడానికి డాక్టర్లు అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నారు.

పశ్చిమగోదావరి,ఏలూరు వార్త

## రెడ్ క్రాస్ రాష్ట్ర అవార్డు పొందటం జిల్లా వాసులకు గర్వకారణం

### కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ

**భీమవరం మే 13 ప్రభాతావార్త :** మానవతా సేవల్లో చూపిన విశేష కృషికి గుర్తింపుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రస్థాయి అవార్డు పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సి.హెచ్. నాగరాణి గవర్నర్ చేతుల మీదుగా అందుకోవటం జిల్లా వాసులందరికీ గర్వకారణం అని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈ నెల(మే 8 తేదీన) విజయవాడలో జరిగిన వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ గారి చేతుల మీదిగా జిల్లా కలెక్టర్ నాగరాణి రెడ్ క్రాస్ రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం భీమవరంలోని కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ శ్రీమతి నాగరాణిని కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వరదల సమయంలో కలెక్టర్ శ్రీమతి నాగరాణి ప్రోటోకాల్‌లు పక్కనపెట్టి, స్వయంగా నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని తక్షణ సహాయం అందించడంలో ఆమె తీసుకున్న చొరవ, జిల్లాలో రెడ్‌క్రాస్ కాంపొనెంట్ బ్లడ్ సెంటర్‌ను ప్రారంభించడం, థాలసీమియా డే కేర్ సెంటర్ ప్రారంభించి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన చికిత్స అందేలా చేయటం వంటి ఎన్నో కార్యక్రమాల వల్ల కలెక్టర్ నాగరాణి అవార్డు పొందటం జిల్లా వాసులందరికీ గర్వకారణం అన్నారు. ఈ అవార్డు ఆమె సేవాభావానికి, మానవతా కార్యక్రమాలపైన ఉన్న నిబద్ధతకు గుర్తింపుగా నిలుస్తోంది అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వెంట బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్ వర్మ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.



# ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్..

## జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి..



**ఏలూరు,మే,13:** ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తంచేసి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్స్ ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్ లో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు మాక్ డ్రిల్స్ నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మాక్ డ్రిల్ నిర్వహణ వల్ల ప్రజల భద్రత, సన్నద్ధతను గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. విపత్తు సమయంలో తీసుకోవల్సిన చర్యల గురించి అవగాహన కల్పించి తద్వారా ప్రజలు గంధరగోళానికి గురికాకుండా త్వరగా స్పందించగలరన్నారు. మాక్ డ్రిల్ సమయంలో సురక్షిత ప్రాంతాలకు చేరడం, స్వీయ రక్షణకు టెక్నికల్ ను నేర్చుకోవచ్చున్నారు. ఈ డ్రిల్స్ ద్వారా అత్యవసర సేవలైన అగ్నిమాపకదళం, ఎస్ డి ఆర్ఎఫ్, పోలీసులు, వైద్య బృందాల సమన్వయాన్ని మెరుగుపరుస్తాయన్నారు. ఇది వాస్తవ సంఘటనలో సమర్ధవంతమైన రక్షణ చర్యలకు దోహదపడుతుందన్నారు. మాక్ డ్రిల్స్ ద్వారా భవిష్యత్ లో జరిగే నష్టాన్ని అరికట్టవచ్చున్నారు. మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా చూపించిన సంబంధిత అధికారులు.. ఏలూరు కలెక్టరేట్ లో నిర్వహించిన మాక్ డ్రిల్స్ నిర్వహణ కార్యక్రమాన్ని కన్నులకు కట్టినట్లుగా సంబంధిత అధికారులు చూపించారు. అగ్నిమాపక సేవలు, ఎస్డిఆర్ఎఫ్, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ, శిక్షణ పొందిన ఆపదమిత్ర వాలంటీర్లు, ఎన్ సిసి, విద్యుత్ శాఖ, తదితర బహుళవిభాగాలు మాక్ డ్రిల్స్ లో పాల్గొన్నాయి. ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది రక్షణ భద్రత కలిగివుండి ప్రభావిత భవనాల నుండి వ్యక్తులను రక్షించారు. సహాయక చర్యల్లో మెట్లు, నిచ్చెనలు ద్వారా గాయపడిన వారిని తీసుకువచ్చి తాత్కాలిక వైద్య శిబిరంలో ప్రధమ చికిత్స అందించి వెంటనే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సిపిఆర్, స్ట్రెచర్ వినియోగం, అత్యవసర వైద్యం అందించడంపై అవగాహన కల్పించారు. కలెక్టరేట్ పై అంతస్థులో అగ్నిప్రమాదం సంభవించింది మొదలు



నిచ్చెన ఆసరాగా భవనంపైకి విపత్తు స్పందన సిబ్బంది చేరుకుని ప్రమాదంలో చిక్కుకున్నా వారిని క్రిందికి తీసుకువచ్చి తక్షణం వైద్య సహాయం అందించేందుకు 108 వాహనాలు ద్వారా ఆసుపత్రికి తరలించడం వంటి అంశాలను అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ చేశారు. ఈ కార్యక్రమాలను అన్నింటిని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసరు సిహెచ్. రత్నబాబు, 3 టౌన్ సిఐ కోటేశ్వరరావు, ఎపిఇపిడిఎసిఎల్ ఎస్ఇ పి. సాల్మన్ రాజు, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్ కుమార్, ఎన్.టి.ఆర్. ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డా. రాజీవ్, సెట్ వెల్ సిఇఓ ప్రభాకర్, బి.సి. కార్పోరేషన్ ఈడి ఆర్.వి. నాగరాణి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, తహశీల్దారు జి. శేషగిరి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్ సిసి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## దళితులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన జగన్

### తణుకులో పర్యటించిన రాష్ట్ర హోం మంత్రి అనిత





**తణుకు, మే 13 ( ప్రభాత వార్త ) :** దళితులను లక్ష్యంగా చేసుకుని వారిపై దాడులకు పాల్పడిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదని రాష్ట్ర హోం మంత్రి అనిత అన్నారు. డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై చిత్రహింసలకు గురి చేసి, ఎమ్మెల్యే అనంతబాబు డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేశారని, వరప్రసాద్ అనే యువకుడిని ఇసుక కుంభకోణం చేస్తున్నారని ప్రశ్నించినందుకు సాక్షాత్తూ పోలీసు స్టేషన్‌లో కూర్చోబెట్టి శిరోముండనం చేసి ఇలా దళితులనే లక్ష్యంగా చేసుకుని సర్వనాశనం చేశారని ఆరోపించారు. మంగళవారం తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో పర్యటించిన ఆమె పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇరగవరం మండలం కె.ఇల్లిందలపర్రు గ్రామంలో అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఆవిష్కరించిన ఆమె అనంతరం మాట్లాడారు. దళితుల ఓట్లతో గెలిచానని చెప్పుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వారి పతనమే లక్ష్యంగా పని చేశారన్నారు. దళితురాలిని అయిన తనపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. టీడీఆర్ బాండ్లు కుంభకోణంలో ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు నియోజకవర్గ ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కొన్నారని ఎద్దేవా చేశారు. స్వేచ్ఛ, సమానత్వం చూపించడానికి తానే ఒక మార్గదర్శిగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిస్థాయిలో సామాన్యురాలి ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించారని గుర్తు చేశారు. నాలాంటి సామాన్య ఉపాధ్యాయురాలు అసెంబ్లీకు వెళ్లిందంటే ఆనాడు బాబా సాహెబ్ అంబేద్కర్ పెట్టిన భిక్షగా భావించాలన్నారు. దళిత వర్గానికి రెండు కళ్లు లాంటి అంబేద్కర్, బాబూజగ్జీవన్ అని అన్నారు. అంబేద్కర్, బాబూజగ్జీవన్ విగ్రహాలను దళితవాడల్లో ఒకే చోట స్థాపిస్తున్నారంటే దళితల మధ్య ఐక్యతకు నిదర్శనమన్నారు. అయతే విగ్రహాలు పెట్టినంత మాత్రాన అభిమానం కాదని వారి అడుగుజాడల్లో వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో దళితులకు సంబంధించిన పథకాలకు తిలోదకాలు ఇస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని పునరుద్ధరించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకే దక్కుతుందన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నీటి సంఘ అధ్యక్షుడు మృతి



**చాట్రాయి, మే 13, ప్రభాతవార్త :** వివాహ కార్యక్రమానికి అన్నవరం వెళ్లి వస్తుండగా జరిగిన భీమడోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామానికి చెందిన చిన్నం కృష్ణ (45) మృతి చెందారు. చిన్నంపేట లోని మొగల్ చెరువు నీటి సంఘ అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఇటీవల ఎన్నికయ్యారు. మంచి వ్యక్తిగా పేరు సంపాదించిన కృష్ణ టైలర్ వృత్తితో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. కృష్ణ రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో చిన్నంపేటలో విషాదఛాయలు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. చిన్నం కృష్ణ మృతి పట్ల మాజీ చిన్నంపేట సహకార సంఘం అధ్యక్షులు, మండల తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు అత్తులూరి శ్రీనివాసరావు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రైతుల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు....

### నాడు గాలికి వదిలేసి నేడు గాలి పోగేసి మాట్లాడుతున్నారు...


### కోడి విజయభాస్కర్ ఎద్దేవా

**పాలకొల్లు ప్రభాతవార్త :** గత వైసిపి ఐదేళ్ల పాలనలో రైతులను వ్యవసాయాన్ని గాలికి వదిలేసారని, రైతుల గురించి వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదని పాలకొల్లు మండల టిడిపి అధ్యక్షుడు కోడి విజయభాస్కర్ అన్నారు. ఆయన పాలకొల్లు మండలం అరటి కట్ల గ్రామంలో జరుగుచున్న రాపాక ఛానల్ పంట కాలవ తవ్వక పనులను కూటమి నాయకులతో పరిశీలించారు. జరుగుతున్న పనులు పట్ల రైతాంగం సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా విజయ భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయం గురించి కనీస జ్ఞానం తెలియని పాలకొల్లుకు చెందిన ఓ వైసీపీ నాయకుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి మేలు జరగలేదని ఆ సమయంలో ఎందుకు మాట్లాడలేకపోయావని ప్రశ్నించారు. ముందుగా మీరు ఏం చేస్తున్నారో.... అక్రమాలు ఏంటో అందరికీ తెలుసునని ఇకనైనా జాగ్రత్తగా మాట్లాడాలని విజయభాస్కర్ హితవు పలికారు. లేనియెడల మీ అక్రమ బాగోతాలను బయట పెట్టాల్సిస్తుందని హెచ్చరించారు. పాలకొల్లు నియోజకవర్గంలో రైతులకు మేలు జరిగే పంట కాలువలు, మురుగు డ్రైన్ల త్రవ్వకం పనులతో పాటు గ్రావెల్ రహదారులు, ఇతర పనులను కోట్లాది రూపాయలతో జరుగుతున్నాయని తెలిపారు. రైతాంగం అంతా మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు వ్యక్తం చేసుకున్నారన్నారు. ఇది తట్టుకోలేని వైసీపీ నాయకులు అసత్యపు, అబద్దాలతో కాలక్షేపం చేయాలనుకుంటే ప్రజలే తరిమికొట్టే రోజులు వస్తాయనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో



నాయకులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, ఇంటి శ్రీరాముడు, అందికోటి వీరభద్రం, నెక్కంటి ఆది నారాయణ అంగర చిన్న, చింతపల్లి శ్రీనివాస్,, మల్ల సాంబ, తదితర నాయకులు పాల్గొన్నారు పాల్గొన్నారు

## శాఖ గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లీష్ పై శిక్షణ




**పెనుమంట్ర, మే-13, ప్రభాతవార్త:** మండలంలోని మార్టేరు శాఖా గ్రంధాలయంలో నందు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా 15వ రోజు ఆంగ్ల అధ్యాపకులు పి.సువర్ణ గౌరి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారని గ్రంథ పాలకుడు పిటిఎస్ కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత తహసిల్దార్ చిర్ల సూర్యనారాయణారెడ్డి పిల్లలకు గీత శ్లోకాలు, నేర్పించారని తెలిపారు. గ్రంధాలయ మాస్టర్ పి.టి. యస్.కుమార్ పిల్లల చేత గ్రంధాలయంలో పుస్తకాలు స్టోరి బుక్స్ చదివించినట్లు తెలిపారు. ఈ వేసవి శిక్షణా శిబిరంలో బి హాసిని, యస్. జశ్వంతి, యమ్. సాజన్య, సి.హెచ్. వంశీ, వై, యోగమృత్, పి. స్త్రీ భవిష్య, యస్. తనుష్క,బి. నిహిత, కె. శ్రావ్య. డి. సూర్య, యమ్. కౌషిక్, పి. లోకేష్, తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మానవత మరియు గ్రంథాలయ సిబ్బంది కలిసి నిర్వహించడం జరిగిందన్నారు.

## ఓటు వేసిన ప్రజలకు ఎంపీ పుట్టా కృతజ్ఞతలు



**ఏలూరు ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎన్నికలు జరిగి ఏడాది ముగియడంతో తనకు ఓటు వేసి గెలిపించిన ఏలూరు పార్లమెంట్ ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాదిలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో చేపట్టిన పనులు పోలవరం ప్రాజెక్ట్ కదలికలు నిర్వాసితులకు సాయం గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులు వందే భారత్ వంటి రైల్వే అభివృద్ధి పనులు పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధరను సాధించడం ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన రైతుకు అండగా నిలవడం వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వ వల్ల సాధ్యమైంది అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన ప్రజలకు అండగా నిలిచిన అభిమానులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల అభివృద్ధి వారి అభిమతం మేరా మరింతగా కృషి చేస్తానని ఎప్పుడూ అండగా అందుబాటులో ఉంటానన్నారు . వారి ఆదరణ తనలో గొప్ప ప్రేరణ రేకెత్తించింది అని తెలిపారు.

## తుపాకీ మందు పేలి ముగ్గురికి గాయాలు



**కైకలూరు మే 13 (ప్రభాతవార్త):** మండలంలోని రామవరం గ్రామంలో నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు తమిళనాడు రాష్ట్రం నుంచి కైకలూరు మండలం రామవరంలో ఆక్వా చెరువులపై పక్షులను బెదిరించటానికి వలస వచ్చిన పక్షుల వేటగాళ్ల గ్రామంలోనే అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఈ తరుణంలో మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నాటు తుపాకీలో ఉపయోగించే మందు తయారు చేస్తూ ఉండగా ఒక్కసారిగా మందు గుండు సామాగ్రి పేలింది. ప్రమాదంలో చరణ్ ,సతీష్ ,మణి అనే ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. భారీ శబ్దం రావడంతో భయాందోళనకు గురైన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా స్థలానికి కైకలూరు టౌన్ సిఐ కృష్ణ రూరల్ ఎస్ఐ రాంబాబు, పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు నమోదు చేసుకుని విచారించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

## భూసార పరీక్షల పై దృష్టి సారించండి

### - మండల వ్యవసాయ అధికారి శివశంకర్

**చాట్రాయి, మే 13, ప్రభాతవార్త :** రైతులందరూ భూసార పరీక్షలపై దృష్టి సారించి వ్యవసాయ శాఖ సిబ్బందికి సహకరించాలని మండల వ్యవసాయ అధికారి శివ శంకర్ చెప్పారు. మట్టి నమూనాలు సేకరిస్తున్నందున రైతులు తమ తమ పొలాలలో భూసార పరీక్షలు చేయించుకునేందుకు వ్యవసాయ అధికారుల నియమ నిబంధనలకు అనుకూలంగా మట్టి సేకరణ చేయాలని ఆయన కోరారు. భూసార పరీక్షలు కోసం మట్టిని సేకరించి సమయంలో రైతులు ఎత్తు పొలాల్లో ఉన్న భూముల నుండి కానీ, చెట్లు కింద పుట్ల వద్ద ఉన్న మట్టిని గాని సేకరించకూడదని చెప్పారు. అంతేకాకుండా కల్లాలుగా తయారు చేసిన చోట కూడా మట్టిని సేకరిస్తే మంచి ఫలితాలు రావని చెప్పారు. ఈ నిబంధనలను దృష్టిలో పెట్టుకుని రైతులు 15 సెంటీమీటర్లు లోతు వి ఆకారంలో గోతిలో మట్టిని సేకరించాలని చెప్పారు. ఒక ఎకరం భూమిలో ఐదు చోట్ల ఒక కేజీ మట్టి ఉండే విధంగా సేకరించి నీడలో ఎండబెట్టి పొడిచేసి రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న తమ సిబ్బందికి అందజేయాలని ఆయన కోరారు. మట్టి నమూనా సేకరించి పరీక్షలు నిర్వహించడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ఆయన చెప్పారు. భూమిలో నత్రజని,బాస్వరం, పొటాషియం, జింకు మరియు సేంద్రీయ కరిచిన పదార్థము సమపాళ్లలో ఉందో లేదో తెలుస్తుంది అని చెప్పారు. భూమి మన పంట సాగుకు సరిపడా ఎరువులు వాడటం వల్ల రైతులకు ఖర్చు తగ్గడంతో పాటు కాంప్లెక్స్ ఎరువులను తగ్గించుకోవచ్చని చెప్పారు. చాట్రాయి మండలంలో 1250 మట్టి నమూనాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మట్టి నమూనాలు సేకరణ ప్రారంభం అయినందున రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మవారిని దర్శించుకున్న విజయనగరం వాసులు



**మొగల్తూరు మే 13 (ప్రభాతవార్త)** ముత్యాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వెలసి ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ తల్లి ఆలయం నందు మంగళవారం సాయంత్రం జాతర మహోత్సవములు పురస్కరించుకొని విజయనగరం జిల్లా బనవలపేట వాస్తవ్యులు హృదయ ఆగ్రో ఫామ్ అధినేత మణికంఠ జ్యోతి స్వరూపిణిగా ఉన్న, శ్రీ బండి ముత్యాల అమ్మవారిని దర్శించుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ఈవో మోకా అరుణ్ కుమార్ మణికంఠకు ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు, వారితో పాటుగా పర్వత అనిల్, తదితరులు పాల్గొన్నారు

## డీసీఎం ఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ (చిన్న) ను కలసిన జనసేన నాయకులు



**మొగల్తూరు మే 13 (ప్రభాతవార్త)** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ గా ఎన్నికైన చాగంటి మురళీకృష్ణ (చిన్న) కు మంగళవారం మొగల్తూరు మండల జనసేన నాయకులు వారి ఆఫీసు నందు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా మొగల్తూరు మండల జనసేన ఉపాధ్యక్షుడు, దోసనపూడి సత్యనారాయణ, శేరేపాలెం జనసేన గ్రామ అధ్యక్షుడు, కొండేటి తాతాజీ, లక్కు బాబి, దాసరి శివాజీ పలువురు జనసేన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఈ నెల 20 సమ్మె విజయవంతం చేయాలి



**తణుకు, మే 13 ( ప్రభాత వార్త ):** కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్లు రద్దు వెనక్కి తీసుకొనే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ హెచ్చరించారు. మంగళవారం హమాలీ కార్మికులతో ఈనెల 20న చేపట్టనున్న సమ్మె పోస్టర్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 చట్టాలు రద్దు చేయడం మానుకోవాలన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులపై జరిగిన యుద్ధాన్ని దేశ ప్రజలు అందరూ హర్షించారని అన్నారు. దేశంలో ఉన్న కార్మికులపై యుద్ధాన్ని ఎవరు హర్షించరని తెలిపారు. కార్మికుల శ్రమ దోపిడీ చేయడానికే లేబర్ కోడ్లు తీసుకొస్తున్నారని విమర్శించారు. లేబర్ కోడ్లుపై కార్మిక సంఘాలతో, పార్లమెంట్‌లో గాని ఎలాంటి చర్చలు జరుపకుండా ఏక పక్షంగా అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. కార్మికులపై లేబర్ కోడ్స్ ద్వారా జరుగుతున్న ఈ యుద్ధానికి వ్యతిరేకంగా ఈ నెల 20న జరిగే సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యన్.చిన్నారావు, గార రంగారావు, కుడిపూడి రాము, ఎ.నర్సింహమూర్తి, యస్.రాజు, టి.అప్పన్న, గోవింద్, సుధాకర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అమ్మకానికి యంటీయు-1318 వరి విత్తనం సిద్ధం

పెనుమంట్ర, మే-13, ప్రభాతవార్త: మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో యం.టి.యు 1318 రకం ఫౌండేషన్ విత్తనం అమ్మకానికి సిద్ధంగా ఉందని పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.టి. శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 కిలోలు వెల రూ.1050/-, ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులంతా వినియోగించుకోవాలని కోరారు. ఈ విత్తనం కావలసినవారు డా. ఎన్.వెరోనిక, శాస్త్రవేత్త. 89850 59378 ను సంప్రదించాలని కోరారు. అమ్మకం వేళలు. ఉదయం. 8.00 నుండి 11.00 గం. వరకు తిరిగి మధ్యాహ్నం 3.00 నుండి 5.00 గంటల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ పేమెంట్ సౌకర్యం కూడా కలదు.

## మాతృ మూర్తులకు పాదాభివందనం



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: మాతృ దినోత్సవ సందర్భంగా ఇన్నర్ వీల్ రోటరీ క్లబ్ ఆఫ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ ఆధ్వర్యంలో పదిమంది మాతృ మూర్తులకు పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం లోని శ్రీ మాధవి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, టైలరింగ్ సెంటర్ నందు క్లబ్ అధ్యక్షురాలు నాగ సూర్య మధురి ఆధ్వర్యంలో మాతృ మూర్తులను శాలువతో ఘనంగా సత్కరించారు. ఇన్నర్ వీల్ రోటరీ క్లబ్ జంగారెడ్డిగూడెం గోల్డ్ కార్యదర్శి పద్మ జ్యోతి మాట్లాడుతూ ప్రతి రోజు మాతృ దినోత్సవంగా జీవితాలు ఉండాలన్నారు. మాతృ దినోత్సవం ఒక్క రోజుకే పరిమితం కాకూడదన్నారు. తొలుత సింధూర్ యుద్ధంలో మరణించిన భారత అమర వీరులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర పిండివంటల అధినేత వెంకటలక్ష్మి ,తదితరులను సన్మానించారు.

## బారులు దీరి మ్రొక్కులు చెల్లించుకున్నారు




జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : మండలంలోని గుర్వాయిగూడెంలో ఈ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవాలయమునకు మంగళవారం తెల్లవారుజాము నుండే అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని, మ్రొక్కులు చెల్లించుకన్నారు. భక్తులు హనుమాద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీ స్వామి వారి ఆలయం చుట్టు 108 ప్రదక్షణలు చేశారు. మధ్యాహ్నం వరకు దేవస్థానంకు వివిధ సేవల విరాళాల ద్వారా రూ.1,87,132లు సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారిణి ఆర్ వి చందన తెలిపారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి నిత్య అన్నదాన సత్రం నందు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ ఓ చందన పూజా కార్యక్రమాలు భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవస్థానం పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తగిన ఏర్పాట్లు చేశారు.

## బుట్టాయిగూడెం ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



జంగారెడ్డిగూడెం, ప్రభాతవార్త: బుట్టాయిగూడెం ప్రెస్ క్లబ్ కు నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పడింది.సమావేశంలో అధ్యక్షులుగా కట్టా మధుసూదన బాబు(నాని),ఉపాధ్యక్షులుగా మద్రి రమేష్ బాబు,కార్యదర్శిగా అందుగుల నానాజీ రావు, కోశాధికారి నిట్టా రవీంద్రబాబు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షునిగా సీనియర్ రిపోర్టర్ నూకల క్రాంతి నాద్ ను సమావేశం ఎన్నుకొంది.

## వేసవి దాహార్తి తీరుస్తున్న వారధి ట్రస్ట్ దాతలు



జంగారెడ్డిగూడెం ప్రభాతవార్త : స్థానిక నాలుగో వార్డు ఇందిరా నగర్ కాలనీలో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద బుద్దాల నాగ దుర్గరావు సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. అలాగే అభయాంజనేయ స్వామి గుడి వద్ద వేయించిన షెడ్డులో బుద్దాల తాతారావు బుద్దాల శేషయ్యల జ్ఞాపకార్థం భక్తులు,బాటసారులు కూర్చోవడానికి రెండు సిమెంట్ బల్లలను బుద్దాల నాగు వేయించారు. ఈ కార్యక్రమం గురించి 4వ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ ప్రతిరోజు తన తల్లిదండ్రులు వలవల నాగభూషణం,నాగ మణి ల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద మంచినీరు ఏర్పాటు చేస్తున్నామని ఆరు మంగళవారాలు దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని ఈరోజు దాత బుద్దాల నాగు కు అభినందనలు తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



జంగారెడ్డిగూడెం,ప్రభాతవార్త: చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మంగళవారం లింగపాలెం మండలం అన్నపనేని వారి గూడెం పంచాయితీ లో దొడ్డిగర్ల సురేష్ ,దొడ్డిగర్ల రవి,త్రివేణి లకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగపాలెం మండలం ప్రెసిడెంట్ గరిమెళ్ళ చలపతి, ఒబిలినేని సూరిబాబు,తొమ్మండ్రు మల్లయ్య,మాజీ ఎంపీటీసీ కర్లపూడి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# విడుదల రజిని పై దాడి అమానుషం

## - వైసిపి రాష్ట్ర బి. సి.కార్యదర్శి చెన్నారావు



చాట్రాయి, మే 13, ప్రభాతవార్త : మాజీ మంత్రి విడుదల రజిని పై పోలీసులు చేసిన దాడి అమానుషమని దీనిని బీసీలపై చేసిన దాడిగానే పరిగణించాల్సి వస్తుందని రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ కార్యదర్శి పర్సా చెన్నారావు అన్నారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ విడుదల రజిని అనుచరుడు శ్రీకాంత్ రెడ్డిని అరెస్టు చేసే సమయంలో సిఐ సుబ్బారాయుడు అతి ఉత్సాహం చూపించారని ఆయన ఆరోపించారు. బీసీ వర్గానికి చెందిన రజనీపై దాడి చేయటం బీసీలపై దాడి చేసినట్టేనని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం బీసీలను అణగదొక్కాలని ఆలోచనలో ఉందని ఆయన ఆరోపించారు.

# జిల్లా కలెక్టర్ ను అభినందించిన

## గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం.



భీమవరం మే 13 ప్రభాతవార్త: రెడ్ క్రాస్ సేవలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ చేతులు మీదుగా ఇటీవల రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అందుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జకరయ్యలు శాలువాతో సత్కరించి, చిత్ర పటాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లా గ్రామ, రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రవీంద్ర రాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్ఫూర్తితో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారులు అందరూ కష్టపడి జిల్లాకి మంచి పేరు తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంలో భీమవరం డివిజన్ అధ్యక్షులు కెనడి, నరసాపురం డివిజన్ అధ్యక్షులు సత్తిబాబు, అత్తిలి మండల విఆర్ఓలు రామకృష్ణ, గోపికృష్ణ కుమార్ భీమవరం వీఆర్వోలు ప్రజ్యోతన, పార్వతి,విజయ, కిరణ్మయి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన గురువు రవిశంకర్



భీమవరం మే 13 ప్రభాతవార్త :ఆధ్యాత్మిక యోగా గురువు శ్రీశ్రీ రవిశంకర్ అంటే పరిచయం అవసరం లేని పేరు అని, ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన గురువు అని ఆర్ట్ ఆఫ్ లివింగ్ భీమవరం శిక్షకులు రచయిత కలిగోట్ల గోపాలశర్మ అన్నారు. భీమవరం భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ భీమవరం శాఖ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురువు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించి యోగాసన కార్యక్రమాలను నిర్వహించారు. గోపాల శర్మ మాట్లాడుతూ ధ్యానం ద్వారా సంఘర్షణను పరిష్కరించడానికి ఆయన మాటలు చాలా మందిని ప్రభావితం చేశాయని, శ్రీ శ్రీ రవిశంకర్ ప్రతి సంవత్సరం 40కి పైగా దేశాలలో పర్యటిస్తూ తన అనుచరులలో శాంతి సందేశాన్ని వ్యాపింపజేస్తున్నాన్నారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆధ్యాత్మిక, మానవసేవతో ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు గురుదేవ్ శ్రీశ్రీరవిశంకర్ అని, సర్వత్రా మానవతా విలువలను తిరిగి ప్రవేశపెట్టడం ద్వారా హింస, మానసిక ఒత్తిడి లేని సమాజాన్ని సృష్టించాలన్నదే ఆయన దృక్పథమన్నారు. కార్యక్రమంలో రవిశంకర్ గురూజీ శిష్యులు వివి కృష్ణ మోహన్, సిహెచ్ వి రామకృష్ణంరాజు, సిహెచ్ వి జయవాణిశ్రీ, టి విజయ కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## బాల త్రిపుర సుందరి అమ్మవారి వార్షికోత్సవ పూజలు ప్రారంభం



భీమవరం మే 13 ప్రభాతవార్త : భీమవరం మెంటేవారి తోటలోనిశ్రీబాల త్రిపుర సుందరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమైయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో మద్దాల సత్యనారాయణ, లక్ష్మీ బ్రహ్మాజీ దంపతులు, మిరెడ్డి వెంకటేశ్వర రావు, శ్రీమతి హేమ దంపతులచే ఆలయ అర్చకులు అమ్మవారికి లలితా పారాయణం, హారతులు, నీరాజన మంత్ర పుష్పాలతో మహాన్యాస పూర్వకంగా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కలశాలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. మూడురోజులపాటు అమ్మవారికి వార్షిక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## జనార్ధన వరం గ్రామ తెదేపా అధ్యక్షుడిగా పుల్లయ్య



చాట్రాయి, మే 13, ప్రభాతవార్త : చాట్రాయి మండలం,జనార్ధనవరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా మాదాసు చిన్న పుల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా పామర్తి నాగరాజు, కార్యదర్శిగా బలువురు రత్తయ్య జనరల్ సెక్రెటరీగా కాసగాని గోపాలస్వామి,నందమూరి ఏసుబాబు, ఆడిమిల్లి మోషే,వంగల రమేష్, రాచకొండ కృష్ణ,నడిపింటి ప్రభాకర్ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ చెరుకూరి దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ టిడిపి కార్యకర్తల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు వంగల సుబ్బారావు,నందమూరి వరప్రసాద్,మాదాసు వెంకటనారాయణ నడిపింటి వెంకటేశ్వరరావు చీపు సత్యనారాయణ వెంగళరావు, వంగల లక్ష్మీనారాయణ,బొల్లి కొండ సూరిబాబు, ఈడా జానుబాబు, నడిపింటి రాంబాబు, గొడవర్తి మంగారావు,తదితరులు పాల్గొన్నారు

# పాలూరు లో రోడ్ ప్రారంభం.



అత్తిలి – మే 13 (ప్రభాత వార్త ): అత్తిలి మండలం పాలూరు లో ఉపాధి హామీ పథకం క్రింది నిర్మించిన సిసి రోడ్ ను రాష్ట్ర హోమ్ శాఖా మంత్రి వంగలపూడి అనిత ప్రారంభించారు. 36 లక్షల తో నిర్మించిన రక్షితనీటి పథకాన్ని ప్రారంభించారు. 55 లక్షల తో నిర్మించే మైక్రో ఫిల్టర్లు , పైప్ లైన్ పనులకు శంఖుస్థాపన చేసారు. అత్తిలి లో కోటి 99 లక్షల తో నిర్మించే రక్షిత నీటి పథకం ట్యాంకు , పైప్ లైన్ల విస్తరణకు మంత్రి శంఖుస్థాపన చేసారు. కేవస్ గట్టు లో 34.4 లక్షలతో నిర్మించే నీటిపథకం ట్యాంకు , పైప్ లైన్లకు మంత్రి అనిత శంఖుస్థాపన చేసారు. ఈ కార్యక్రమం లో తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీ ఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు , టీడీపీ నాయకులు అనాల ఆదినారాయణరావు , ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్ , మాజీ చైర్మన్ దాసం బాబ్జి , ఆల్తి సత్యనారాయణ , శిరగాని నాగేశ్వరరావు , అత్తిలి ఎంపిపి సుంకర నాగేశ్వరరావు ,మెంతు రాజకుమార్ , మాజీ ఎంపిపి మక్కా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్సార్, నీలపాల పేరుతో క్రికెట్ టోర్నమెంట్



కైకలూరు మే 13 (ప్రభాతవార్త) :యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు బి ఎస్ ఆర్, ఎన్ వై పేర్లతో మెగా టెన్నిస్ బాల్ టోర్నమెంట్ను ఏర్పాటు చేశారు. ఈ క్రీడలను బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టిడిపి నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు, నీలపాల నరేష్ యాదవ్ లు ప్రారంభించారు. ముందుగా టోర్నమెంట్ రిబ్బన్ ను కట్ చేసి తొలి బాల్ ని బ్యాట్ తో ఆడి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషికి క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా కలుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ క్రీడలపై మక్కువతో ఉండాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో మొత్తం 40 జట్లు పోటీ పడతాయని తెలిపారు. ఎనిమిది ఓవ ర్లకు పోటీ ఉంటుందన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రారంభం రోజున చావలిపాడు – మండవల్లి జట్ల మధ్య జరిగిన పోటీ డ్రాగా ముగిసింది.

## సరస్వతి నదీ పుష్కర యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పెనుమంట్ర, మే–13, ప్రభాతవార్త:: సరస్వతి నది పుష్కరాలకు కాళేశ్వరం దగ్గర ఉన్న గోదావరి ప్రాణహిత నదులు సంగమం జరిగే ప్రదేశంలో అంతర్వాహినిగా ప్రవహించుచున్న సరస్వతి నది త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించాలనే భక్తులకు ఈనెల 19 నుండి 23వ తేదీ వరకు వరకు భద్రాచలం, మల్లూరు, మేడారం, కాళేశ్వరం ,ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి పుణ్యక్షేత్ర యాత్రలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు నరసాపురం డిపో మేనేజర్ సత్తి సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు

## వ్యవసాయ, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించాలి

## జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి




ఏలూరు, మే 13 ప్రభాతవార్త: జిల్లాలోని వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ను అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా విద్యుత్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో 'పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం' (%=ఋూ%) కింద వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్ల విభజన, ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, తదితర అంశాలపై విద్యుత్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి 9 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అదేవిధంగా గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం 'పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం' 176 కోట్ల రూపాయలతో వ్యవసాయ ఫీడర్ల నుండి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాలు, అదే విధంగా 66 . 51 కోట్ల రూపాయలతో ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన పనులను డిసెంబర్ లోగా పూర్తిచేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. హెచ్.టి., ఎల్. టి, వ్యవసాయ సర్వీసులు, అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్సఫార్మర్లకు మరియు ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను కూడా నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, లో వోల్టేజ్ సమస్య లేకుండా చూడాలన్నారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ అందే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించాలన్నారు. చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో చేపట్టిన 11 సబ్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా 'పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం' కింద చింతలపూడి నియోజకవర్గానికి కేటాయించిన పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపెరింటెండెండింగ్ ఇంజనీర్ సాల్మన్ రాజు, ఈఈ లు రాధాకృష్ణ, అంబేద్కర్ , శశిధర్, ఖాన్, డిఈ లు, ఏడిఈ లు, ఏఈ లు, ప్రభృతులు పాల్గొన్నారు.



## అత్తిలి సుబ్బారాయుడు ను దర్శించుకున్న మంత్రి



అత్తిలి– మే 13 ( ప్రభాత వార్త ): అత్తిలి లో గల వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత దర్శించారు. మంత్రి తో పాటు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీ ఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ తరుపున మద్దాల శ్రీనివాస్ , దిరిశాల ప్రభాకరరావు వారిని సత్కరించి స్వామి వారి చిత్రపటాలను బహుకరించారు.

## సెల్ ఫోన్ లకు విద్యార్థులు దూరంగా ఉండండి.



అత్తిలి – మే 13 ( ప్రభాత వార్త ): విద్యార్థులు సెల్ ఫోన్ లకు దూరంగా ఉండాలని రిటైర్డ్ గ్రంథ పాలకుడు గంధం శేష వేంద్రరావు కోరారు. అత్తిలి శాఖా గ్రంధాలయంలో వేసవి శిక్షణ లో భాగంగా విద్యార్థులకు సెల్ ఫోన్ వాడకం వాళ్ళ కలిగే లాభ నష్టాలను తెలిపారు. రిసోర్స్ పర్సన్ ఎస్. సుబ్బయ్య కథల పుస్తకాలను చదివించారు . ఎన్ దుర్గా ప్రసాద్, రంగినీడి దానకృష్ణ ,ఎం. శ్రీదేవి , వెంకటేశ్వరరావు , గ్రంథాలయాధికారి డి. కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆప్షన్-3ఇళ్ల నిర్మాణం వేగం పెంచాలి:కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మే 13 ప్రభాతవార్త : జిల్లాలో ఆప్షన్ –3 ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కాంట్రాక్టర్లను, గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేదలకు నిర్మించి ఇచ్చే గృహాలలో ఆప్షన్ –3 క్యాటగిరికి సంబంధించి గృహ నిర్మాణాలపై కాంట్రాక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ లబ్ధిదారులలో గృహ నిర్మాణము చేసుకోలేని వారికి ప్రభుత్వ ఇల్లు కట్టించి ఇచ్చేలా ఆప్షన్–3 క్యాటగిరిలో జిల్లాలో 6,960 గృహములు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణం పనులు తీసుకున్న 49 మంది కాంట్రాక్టర్లు గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చియ్య, డ్వామా పిడి కె. సి హెచ్ అప్పారావు, గృహ నిర్మాణ శాఖ డిఈలు, ఏఈలు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భారత సైన్యానికి నైతిక మద్దతునిద్దాం.. జయహో భారత్ ర్యాలీ



భీమవరం మే 13 ప్రభాతవార్త :పాకిస్థాన్ పై ధర్మయుద్ధం చేస్తున్న భారత సైన్యానికి నైతిక మద్దతు అవసరమని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని కృష్ణదేవరాయ కళ్యాణ మండలం నుంచి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రైస్తవలతో కులమతాలకు అతీతంగా జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డ్స్ తో ర్యాలీ నిర్వహించారు. సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, కళ్యాణ మండలం సభ్యులు గ్రంధి నానాజీ, రామాయణం రాజేష్, అడ్డగర్ల ప్రభాకర్ గాంధీ, ఎండి నౌషాద్, మైలబత్తుల ఐజాక్ బాబు, యర్రంశెట్టి హరినాథ్, కొండ్రు శ్రీనివాస్, సంకు సౌభాగ్య లక్ష్మి, ఎస్ కే అన్సారీ, శ్యామల రాజ్, పులపర్తి శ్రీనివాస్, మాట్లాడుతూ దేశ భద్రత కోసం సర్వమత పూజలు, ప్రార్థనలు కూడా చేస్తున్నామని, పహల్గామ్ ఉగ్ర దాడికి ప్రతీ కారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమయ్యిందని, కానీ పాకిస్తాన్ మాత్రం వంకర బుద్ధితోనే ఉందన్నారు. అనంతరం బ్యాంక్ కాలనీలోని ప్రధాన వీధుల్లో జయహో భారత్ అంటూ జాతీయపతాకాలు పట్టుకుని ప్లకార్డ్స్ తో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

## జాగాబత్తినను కలిసిన దేవాంగ సంఘం నాయకులు



పెనుమంట్ర, మే–13, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డ్ చైర్మన్ గా ఎన్నికైన డా. జాగాబత్తిన శివప్రసాద్ ను విజయవాడ మినర్వ పేరడైజ్ నందు రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నర్సాపురం పార్లమెంటు దేవాంగ బిసి సాధికారిక సమితి రోబ్బి భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు (గణేష్), పెడన మాజీ మున్సిపల్ చైర్మన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత సమైక్య అధ్యక్షులు బండారు ఆనంద ప్రసాద్, పృథ్వీ రవి, నెల్లూరు, మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్ల వెంకటరమణ, అల్లక నమ శివయ్య శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఉపాధి హామీ రక్షణ చట్టం కోసం బంద్ ను జయప్రదం చేయండి.



అత్తిలి – మే 13 ( ప్రభాత వార్త ):ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్ర రావు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ కూలీలకు పిలుపునిచ్చారు. అత్తిలి మండలం వరిగేడు గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారితో సంభాషణ జరిపారు. అనంతరం వీరభద్రరావు.గోపాలన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి పెరగాలంటే ఉపాధి హామీలో ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.600 వేతనం ఇస్తేనే జీవించగలరని ఆర్థికవేత్తలతో పాటు సుప్రీంకోర్టు సైతం గతంలో చెప్పిందని వీరభద్రరావు,గోపాలన్ గుర్తు చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి రూ. 25 లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పితాని దానేశ్వరరావు. బొక్క శ్రీను. బాలం చంద్రకళ. జోగి శ్రీనివాసు. కట్టా కుమారి. బాలం తులసమ్మ. జోగి సింహాచలం తదితరులు పాల్గొన్నారు..

# 'తమ్ముడు' నుంచి 'మూడ్ ఆఫ్ తమ్ముడు' విడుదల

ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం తమ్ముడు. ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మూడ్ ఆఫ్ తమ్ముడు అంటూ సినిమాలోని పాత్రల్ని పరిచయం చేశారు. ఈ చిత్రంలోని ఇంపార్టెంట్ పాత్రలని, కారెక్టర్ నేమ్స్‌ను రివీల్ చేస్తూ వదిలిన 'మూడ్ ఆఫ్ తమ్ముడు అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మూడ్ ఆఫ్ తమ్ముడు విషయానికి వస్తే ఇందులో సప్తమి గౌడ రత్న అనే పాత్రలో, స్వసిక గుత్తి అనే కారెక్టర్‌లో కనిపించబోతోన్నారు. ఇక సౌరభ్ సచ్ దేవ్ అగర్వాల్ పాత్రను పోషిస్తున్నారు. చిత్రగా వర్ష బొల్లమ్మ, ఝాన్సీ కిరణ్మయిగా లయ కనిపించబోతోన్నారు. మూడ్ ఆఫ్ తమ్ముడు అంటూ ఒక్కొక్కరి పాత్ర ఎలా ఉంటుందో హింట్ ఇచ్చారు. కథను కూడా కాస్త రివీల్ చేసినట్టు అనిపిస్తోంది. మూడ్ ఆఫ్ తమ్ముడు చివర్లో నితిన్ ఎంట్రీ, బాణం వదిలిన తీరు అద్భుతంగా ఉంది. మూడ్ ఆఫ్ తమ్ముడు కోసం అజనీష్ లోకనాథ్ ఇచ్చిన ఆర్ఆర్ గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. నెవ్వర్ బిఫోర్ అనే రేంజ్‌లో అజనీష్ తన బీజీఎంతో 'మూడ్ ఆఫ్ తమ్ముడ్ని ఆకాశమంత ఎత్తులో నిలబెట్టేశాడు. కేవీ గుహన్ విజువల్స్, కెమెరా వర్క్ కూడా ఎలా ఉండబోతోందో ఈ మూడ్ ఆఫ్ తమ్ముడు చూపించేస్తోంది. మొత్తానికి శ్రీరామ్ వేణు మాత్రం ఈ సారి తెరపై మ్యాజిక్ చేయబోతోన్నాడని ఈ 'మూడ్ ఆఫ్ తమ్ముడ్ని చెప్పకనే చెబుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉందన్న సంగతి తెలిసిందే. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా.. దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా ఎంసీఏ, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా వకీల్ సాబ్ వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్‌లో తమ్ముడు సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. మూడ్ ఆఫ్ తమ్ముడ్నితో ఒక్కసారిగా మరింత హైప్ క్రియేట్ చేశారు. నటీనటులు నితిన్, లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, స్వసిక విజయన్.



# ఎలిజబెత్ తర్వాత చరిత్ర సృష్టించిన రామ్ చరణ్

ఈ అరుదైన గౌరవం ఆయనను క్వీన్ ఎలిజబెత్2 తర్వాత ఐకానిక్ మ్యూజియంలో తమ పెంపుడు జంతువుతో నిలిచిన ఏకైక సెలబ్రిటీగా ఉన్నత స్థానంలో ఉంచింది. ఈ ఆవిష్కరణ ఎమోషనల్ మూమెంట్. లండన్‌లో జరిగిన కార్యక్రమానికి రామ్ చరణ్ కుటుంబం, సన్నిహితుల హాజరయ్యారు. వాస్తవానికి, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రకటనను వాయిదా వేయాలని భావించారు. అయితే, శాంతి నెమ్మదిగా నెలకొని, పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో, ఈ క్షణాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి ఇది సరైన సమయం అని కుటుంబం భావించింది. 2023 ఆస్కార్ అవార్డ్స్‌లో నాటు నాటు ఆస్కార్ అవార్డు గెలుచుకున్న తొలి భారతీయ పాటగా నిలిచి చరిత్ర సృష్టించిన సందర్భంలో రామ్ చరణ్ ధరించిన బ్లాక్ వెల్వెట్ బంద్‌గళా స్టయిల్‌లో మైనపు విగ్రహం వుండటం అదిరిపోయింది. ఈ విగ్రహం ఆయన విజయాన్ని మాత్రమే కాదు, ఆయన తన పెంపుడు జంతువుతో ఉన్న బంధాన్ని కూడా తెలియజేస్తుంది. ఈ వేడుకలో రామ్ చరణ్ తండ్రి చిరంజీవి గారు భావోద్వేగంతో ప్రౌడ్ ఫాదర్‌గా మాట్లాడారు. రామ్ చరణ్ తల్లి సురేఖ, భార్య ఉపాసన కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.



ఈ విగ్రహం రామ్ చరణ్ స్టార్ డమ్‌కి, లెగసీకి, మన జీవితాల్లో పెంపుడు జంతువుల ప్రత్యేకతకు గుర్తుగా నిలుస్తోంది. ఫ్యాన్స్, విజిటర్స్ మే 19 వరకు లండన్‌లో ఈ విగ్రహాన్ని చూడవచ్చు. తర్వాత విగ్రహాన్ని ప్రదర్శన కోసం మేడమ్ టుసాడ్స్ సింగపూర్‌కి తరలిస్తారు. ఈ విగ్రహం అద్భుతంగా వుందనే ప్రసంశలు వెల్లువెత్తుతు న్నాయి. దీనికి సంబధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినీ లవర్స్, మెగా అభిమానులు మ్యాసీవ్‌గా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

నిఖితా దత్తా నయా లుక్



# 'శుభం'కి 3రోజుల్లో రూ.5.25 కోట్లు వసూళ్లు

స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం నిర్మాతగా భారీ సక్సెస్‌ను అందుకున్నారు. ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ అంటూ తన సొంత బ్యానర్ మీద నిర్మించిన తొలి చిత్రం శుభం. ఈ మూవీ మే 9వ తేదీన విడుదలై సక్సెస్ ఫుల్‌గా దూసుకు పోతోంది. ఇప్పటికే ఈ చిత్రానికి ఆడియెన్స్ నుంచి మంచి స్పందన లభించింది. శుభం ప్రీమియర్లకు మంచి స్పందన రావడంతో భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. ఈ మూడు రోజుల్లో ఈ చిత్రానికి రూ.5.25 కోట్లు వచ్చాయి. మొదటి రోజు కంటే రెండు రోజు ఎక్కువగా వచ్చాయి. ఇలా రోజు రోజుకీ కలెక్షన్స్ పెరుగుతూనే ఉన్నాయి. ఓవర్సీస్‌లో ఆల్రెడీ 125కే వసూలు చేసింది. మంచి మౌత్ టాక్‌తో శుభం చిత్రం బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, గవిరెడ్డి శ్రీనివాస్, చరణ్ పేరి, శ్రియ కొంతం, శ్రావణి లక్ష్మి, షాలిని కొండేపూడి, వంశీధర్ గౌడ్ తదితరులు నటించారు. ఈ సినిమాలో సమంత అతిధి పాత్రలో మెరిసిన సంగతి తెలిసిందే.



# చిత్రపురికాలనీలో ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్

తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన చిత్రపురి కాలనీ నూతన ప్రాజెక్ట్, భవిష్యత్ కార్యాచరణ గురించి జరిగిన కార్యక్రమంలో సభ్యులు వెల్లడించారు. త్వరలోనే భూమి పూజ ఉంటుందని అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్ వెల్లడించారు. వల్లభనేని అనిల్ కుమార్ మాట్లాడుతూ, 1994లో మొదటిసారి చిత్రపురి కాలనీ అనే ప్రాజెక్టు మొదలైంది. ప్రభుత్వాలు మారుతున్నాయి, అసోసియేషన్ అధ్యక్షులు మారుతున్నారు. అనుమతుల కోసం ప్రయత్నం చేయడంలో ఎక్కడా వెనకడుగు వేయలేదు. అయితే ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్ కలగచేసు




కున్న తర్వాతే పర్మిషన్ వచ్చిందని చెప్పడానికి గర్విస్తున్నాము. అయితే ఇప్పుడు రూ.166 కోట్లు అప్పులో ఉన్నాం. ఇక్కడ చాలా సమస్యలున్నాయి. వాటిని బయటకు చెప్పుకోలేం. కానీ ఎవరికీ ఇబ్బంది కలగకుండా పరిశ్రమలో కార్మికులు అందరికీ ఇళ్లు అందించాలనే ప్రయత్నంలో ఉన్నాం. ఆ తరుణంలో హైడ్రా వల్ల బఫర్ జోన్‌లో నాలుగున్నర ఎకరాల ల్యాండ్ కాస్త రెండు ఎకరాలు అయింది. అందులోనే ఇళ్లు నిర్మించి అందరికీ సర్దుబాటు చేయాలి. 166 కోట్లు అప్పు తీర్చాలి. ఇంకా 50 కోట్ల వర్క్ పూర్తి చేయాల్సి ఉంది. ఉన్న స్థలం ఎలా ప్లాన్ చేస్తే అందరికీ సర్దుబాటు చేయగలం, అప్పులు తీర్చగలం, పెండింగ్ వర్క్‌లు ఎలా పూర్తి చేయగలం అని అందరం కూర్చుని మాట్లాడుకుని ముందుకు వెళ్తున్నాం. ఇప్పుడు కట్టబోయే ప్రాజెక్ట్‌కు షఫైర్ సూట్ పేరుతో మొదలుపెట్టాం. పెండింగ్‌లో ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత. కొత్తగా అప్లై చేసుకునే వారికి సంబంధిత అసోసియేషన్ నుంచి ధృవీకరణ పత్రాలు తీసుకొస్తే వాటిని పరిశీలించి మెంబర్‌షిప్ ఇవ్వడం జరుగుతుంది. 2013లో జరిగిన ఇబ్బందులకు కూడా మమ్మల్నే బాధ్యుల్ని చేస్తున్నారు. ఇకపై ఆ సమస్యలు లేకుండా ట్రాన్స్‌ఫరెన్స్‌గా పని చేస్తున్నాం. గతంలో ప్రాజెక్ట్ 14 ఏళ్లు పట్టింది. ఇప్పుడు ప్రాజెక్ట్ మాత్రం భూమి పూజ చేసినప్పటి నుంచి 40 నెలల్లో అన్ని ఎమినిటీస్‌తో పూర్తి చేసి ఇస్తాం. ఇదొక ల్యాండ్ మార్క్ ప్రాజెక్ట్ అవుతుంది. ఇకపై చిత్రపురిపై ఎలాంటి అపోహలు ఉండవు అని అన్నారు. ఈ సందర్భంగా సి కళ్యాణ్ మాట్లాడుతూ, చిత్రపురి కాలనీ అనేది చక్కటి ఆలోచనతో వచ్చిన ప్రయత్నం. చిత్రపురి కాలనీ కోసం మనం ఎంతగానో కష్టపడ్డాము. ఇప్పుడు వెయిటింగ్‌లో ఉన్నవారికి అలాగే కొత్త వారికి కూడా ఇప్పుడు చిత్రపురి కాలనీలో సొంత ఇల్లు రాబోతున్నాయి అనే వార్త సంతోషకరం. ఈ ప్రాజెక్టు పూర్తయితే అక్కడ ఉండే ఎన్నో వేల మంది సమస్యలు పరిష్కరింపబడతాయి. ఈ సమస్యల నుండి బయటకు వచ్చేలా సహాయపడిన చదలవాడ శ్రీనివాసరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు. సినిమా వాళ్ళ మీద ప్రేమతో ఆయన ముందుకు వచ్చి సహాయపడ్డారు. వేలానికి వెళ్లే సమయంలో ఆయన ఆర్థికంగా నిలబడి మనకు చిత్రపురి కాలనీ వచ్చేలా చేశారు.

# 'ఆర్‌పిఓ22'లో సూర్యకుమార్‌గా ఉపేంద్ర

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఆర్‌పిఓ22'తో అదరగొట్టబోతున్నారు. మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టితో సక్సెస్ అందుకున్న మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం, అన్ని వర్గాల ప్రేక్షకులను కట్టిపడేసేలా హార్ట్ టచ్చింగ్ ఎంటర్టైనర్ లా వుండబోతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. షూటింగ్ వేగంగా జరుగుతోంది. ఇందులో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నారు. ఈ కథలో కొత్త కోణాన్ని తెస్తూ కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర సూర్య కుమార్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పాత్ర ప్రతి ఒక్కరు అభిమానించే సూపర్ స్టార్‌ల ప్రతినిధిగా నిలుస్తుంది. ఇవాళ విడుదలైన పోస్టర్‌లో ఆయన పాపరాజీ లైట్ల మధ్య స్టైలిష్‌గా కనిపించి, తన స్క్రీన్ ఇమేజ్‌తో అదరగొట్టారు. ఈ నెల 15న సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల కానుంది. ఈ చిత్రంలో కంప్లీట్ డిఫరెంట్ గెటప్‌లో రామ్ పోతినేని కనిపించనున్నారు. ఇప్పటి వరకు చేసిన హై వోల్టేజ్ యాక్షన్ చిత్రాలకు భిన్నంగా ఈ సినిమాతో ఆయన ఓ కొత్త అవతార్‌ని ప్రజెంట్ చేస్తోంది. దర్శకుడు మహేష్ బాబు పి ఈ కథను అద్భుతంగా మలిచారు. పాన్‌ఇండియా స్థాయిలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణం అత్యున్నత స్థాయిలో ఉండబోతోంది ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీం వర్క్ చేస్తోంది. కెమెరామెన్‌గా సిద్ధార్థ నుని కాగా వివేక్-మెర్విన్ మ్యూజిక్ అందిస్తున్నారు, నేషనల్ అవార్డ్ విన్నర్ శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. ఈ డ్రీమ్ టీమ్ తో 'ఆర్‌పిఓ22' భారీ స్థాయిలో రూపొందుతోంది. తారాగణం: రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వి.టి.వి గణేష్ తదితరులు. సాంకేతిక విభాగం: కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం: మహేష్ బాబు పి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, బ్యానర్: మైత్రీ మూవీ మేకర్స్

సిఈఓ: చెర్రీ

సంగీతం: వివేక్ మెర్విన్

ఛాయాగ్రహణం: సిద్ధార్థ నుని

ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్



ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా

పీఆర్ఓ: వంశీశేఖర్

మార్కెటింగ్: ఫస్ట్ షో.

# 'బ్యాడ్ బాయ్ కార్తీక్' షూటింగ్ పూర్తి

హీరో నాగశౌర్య అప్ కమింగ్ అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బ్యాడ్ బాయ్ కార్తీక్. ఈ మూవీకి రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. నాగ శౌర్య క్యారెక్టర్ ఇంటెన్స్ నేచర్‌ని ప్రజెంట్ చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుంది. సైమల్టేనియస్‌గా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేస్తారు. ఈ చిత్రంలో నాగశౌర్య జోడిగా విధి హీరోయిన్‌గా నటిస్తోంది. సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, వెన్నెల కిషోర్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ డీవోపీగా పని చేస్తున్నారు. సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ తెలుగు సినిమాకు కమ్ బ్యాక్ ఇస్తూ మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారు. రామాంజనేయులు ఆర్ట్ డైరెక్టర్ కాగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. నటీనటులు: నాగ శౌర్య, విధి, సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్ కుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ, అజయ్, ప్రియ, నెల్లూరు సుదర్శన్, కృష్ణుడు, చమక్ చంద్ర, శివన్నారాయణ, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్), నిర్మాత: శ్రీనివాసరావు చింతలపూడి, బ్యానర్: శ్రీ వైష్ణవి ఫిల్మ్స్, డీవోపీ: రసూల్ ఎల్లోర్

సంగీతం: హారిస్ జైరాజ్

ఆర్ట్: రామాంజనేయులు

ఎడిటర్: కోటగిరి వెంకటేశ్వరరావు

ఫైట్స్ సుప్రీమ్ సుందర్, పృధ్వి


కొరియోగ్రాఫర్స్: రాజు సుందరం, శోబి మాస్టర్, విజయ్ పొలంకి, శిరీష్

లిరిక్స్: చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి.




# బాలీవుడ్‌లో శ్రీలీల బ్యాక్ టూ బ్యాక్

శ్రీలీల బాలీవుడ్‌లో బ్యాక్ టూ బ్యాక్ ఛాన్సులందుకుంటుంది. ఒక్క సినిమా రిలీజ్ అవ్వకుండానే మరో రెండు చిత్రాలకు సైన్ చేసిందంటే? అమ్మడు జోరు అక్కడ ఏ రేంజ్ లో కొనసాగుతుందో చెప్పాల్సిన పనిలేదు. ప్రతిష్టాత్మక హిట్ ఫ్రాంచైజీ ఆషికీ3తో ఎంట్రీ ఇస్తుంది. ఇందులో కార్తీక్ ఆర్యన్‌కి జోడీగా నటిస్తోంది. ఆషికి నుంచి రిలీజ్ అయిన రెండు చిత్రాలు భారీ విజయాలు సాధించడంతో మూడవ భాగంపై భారీ అంచనాలున్నాయి. ఇలాంటి లవ్ స్టోరీతో శ్రీలీల ఎంట్రీ ఇవ్వడంతోనే రిలీజ్‌కు ముందే అమ్మడు అక్కడ ఫేమస్ అయిపోతుంది. కార్తీక్ ఆర్యన్‌తో రొమాంటిక్ సన్నివేశాల శ్రీలీల చెలరేగడం ఖాయం. అనురాగ్ బసు తెరకెక్కిస్తోన్న చిత్రం దీపావళికి రిలీజ్ అవుతుంది. ఈ సినిమా సెట్స్‌లో ఉండగానే యంగ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రాకి జోడీ గానూ ఎంపికైంది. రాజ్ సాండియాలా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఆనంద్ ఎల్. రాయ్ నిర్మాత కావడం మరో విశేషం. శ్రీలీల పెర్ఫార్మెన్స్ నచ్చిందంటే ఆనంద్ ఎల్. రాయ్ తన దర్శకత్వంలోనే ఛాన్స్ ఇవ్వడం ఖాయమే. ఈ రెండు సినిమాల సంగతి పక్కన బెడితే అమ్మడిప్పుడు ఏకంగా బడా బ్యానర్లోకే ఎంటర్ అవుతున్నట్లు సమాచారం. శ్రీలీలపై ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్ కన్నుపడింది. ఆయన హిట్ ఫ్రాంచైజీ దోస్తానా 2 లో శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ ఛాన్స్ స్వయంగా కరణ్ జోహార్ తీసుకున్నాడని వినిపిస్తుంది. తొలుత ఆయన కొంత మంది సౌత్ భామల పేర్లను పరిశీలించారుట. ఈ క్రమంలో సౌత్ నుంచి వచ్చి నార్త్ లో సినిమాలు చేస్తోన్న పేర్లను పరిశీలించి శ్రీలీల అయితే బాగుంటుందని ఎంపిక చేసినట్లు వినిపిస్తుంది. ఈ అవాకశం నిజమైతే శ్రీలీల జాతకం మారిపోతుంది. టాలీవుడ్‌లో సాధించలేనిది బాలీవుడ్‌లో సాధిస్తుంది. అమ్మడి చలాకీతనానికి అక్కడ కనెక్ట్ అవ్వడం సులభమే.



# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ '3బిహెచ్‌కె'

సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేష్ దర్శకత్వంలో ఓ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ తెరకెక్కుతోంది. బ్లాక్ బస్టర్ హిట్ మావీరన్ నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్ లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. ఈ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ జూలై 4న వరల్డ్ వైడ్ గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సిద్దార్థ, శరత్‌కుమార్, దేవయాని బ్యూటీఫుల్ ఫ్యామిలీగా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ బ్యూటీఫుల్‌గా వుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈసినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి అమృత్ రామ్‌నాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. దినేష్ కృష్ణన్ బి జితిన్ స్టానిస్లాస్ డీవోపీగా పని చేస్తున్నారు. గణేష్ శివ ఎడిటర్. రాకేందు మోళి డైలాగ్ రైటర్. నటీనటులు: సిద్ధార్థ్, శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు, మీతా రఘునాథ్, చైత్ర, రచన, దర్శకత్వం: శ్రీ గణేష్, నిర్మాత: అరుణ్ విశ్వ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఆర్. సిబి మారప్పన్, ఫోటోగ్రఫీ డైరెక్టర్: దినేష్ కృష్ణన్ బి. జితిన్ స్టానిస్లాస్, సంగీతం: అమృత్ రామ్‌నాథ్, ఎడిటర్: గణేష్ శివ డైలాగ్స్: రాకేందు మోళి, ఆర్ట్ డైరెక్టర్: వినోద్ రాజ్‌కుమార్ ఎన్, కాస్ట్యూమ్ డిజైనర్: అశోక్ కుమార్ ఎస్ కిరుతిక ఎస్ పీఆర్వో: వంశీ శేఖర్.



# అందమైన మనసు ఆమెది




మనకేదైనా సమస్య వస్తే దాన్నుంచి ఎలా బయటపడాలో ఆలోచిస్తాం.. కానీ తనలాంటి సమస్యే తన చుట్టూ ఉన్నవారికి ఎదురైతే వాళ్లనెలా బయటపడేయాలని ఆలోచిస్తుంది. ఈ నిస్వార్థమైన మనస్తత్వమే ఇప్పుడు ఆమెను ప్రపంచ వేదికపై నిలబెట్టి మరిన్ని రోజుల్లో ప్రారంభం కానున్న 'మిస్ వరల్డ్ 2015' పోటీల్లో థాయ్‌ల్యాండ్ తరపున పోటీపడనుందీ అందాల భామ. తన దేశంలోని మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, వారిలో ఆరోగ్య స్పృహ పెంచుతోన్న సుచత.. తన జీవితంలోని ఓ సంఘటనే తన మనసును సేవ వైపు మళ్లించిందని ఇటీవలే ఓ సందర్భంలో పంచుకుంది.

**మోడలింగ్‌పై మక్కువతో...**
సుచత థాయ్‌లాండ్‌లోని పుకెట్‌లో పుట్టి పెరిగింది. ఆమెది వ్యాపారవేత్తల కుటుంబం అయితే ఆమెకు మోడలింగ్ అన్నా, అందాల పోటీల్లో పాల్గొనడమన్నా చిన్నతనం నుంచే మక్కువట! ఈ ఇష్టంతోనే 'మిస్ రత్తనకోసిన్' పోటీల ఆడిషన్స్‌లో పాల్గొంది. అయినా ఆమెకు ఆ పోటీల్లో చోటు దక్కలేదు. అలాగని అధైర్యపడలేదామె. 2022లో తన 18వ ఏట 'మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్' పోటీల్లో పాల్గొని రెండో రన్నరప్‌గా నిలిచింది. దీంతో తనలో ఆత్మవిశ్వాసం రెట్టింపైంది. ఇక 2024లోనూ 'మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్' పోటీల్లో పాల్గొంది సుచత. ఇందులో విజయం సాధించడమే కాదు.. 'మిస్ ఛార్మింగ్ ట్యాలెంట్', 'మిస్ బ్యూటీ అండ్ కాన్ఫిడెన్స్' వంటి సబ్ టైటిళ్లూ గెలుచుకుందీ బ్యూటీ.

**అక్కడ పోటీపడి..** గతేడాది జరిగిన 'మిస్ యూనివర్స్' పోటీల్లో పాల్గొని మూడో రన్నరప్‌గా నిలిచిన సుచత. ఈ పోటీల్లో 'వాయిస్ ఫర్ చేంజ్ సిల్వర్ అవార్డు' గెలుచుకుంది. అయితే హైదరాబాద్ వేదికగా జరగనున్న 'మిస్ వరల్డ్-2025 పోటీల్లో పాల్గొనేందుకు వచ్చారు. ఇక్కడి అందాలు, అతిథ్యాన్ని తనివితీరా ఆస్వాదిస్తున్నానంటోంది. అందమే కాదు. అంతకు మించిన ఆత్మసౌందర్యమూ ఈ ముద్దుగుమ్మ సొంతం. ప్రస్తుతం తన 'బ్యూటీ విత్ పర్పస్' ప్రాజెక్ట్‌లో భాగంగా.. థాయ్‌లాండ్ వ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తోన్న సుచత. దీన్ని ప్రారంభించడం వెనకున్న కథను ఇటీవలే ఓ సందర్భంలో పంచుకుంది.

**అందుకే ఈ ప్రాజెక్ట్:** అప్పుడు నాకు 16 ఏళ్లు. ఆ సమయంలో నా రొమ్ములో కణితి ఉందని నిర్ధారణ అయింది అయితే అది క్యాన్సర్ కణితి కాదని, దాంతో ప్రమాదమేమీ లేదని పరీక్షల తర్వాత తేలడంతో ఊపిరి పీల్చుకున్నా. అయితే అది భవిష్యత్తులో క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. నిజానికి నాకు క్యాన్సర్ లేకపోవచ్చు.. కానీ బాధపడే వారి పరిస్థితేంటి? ఈ మహమ్మారిపై అవగాహన లేక కొందరు, అపోహలతో మరికొందరు వారి అనారోగ్యాన్ని బయట పెట్టలేక పోతున్నారు. అందుకే ఈ వ్యాధిపై అవగాహన పెంచాలనిపించింది. ఇదే 'ఆపిల్ ఫర్ హెచ్ఇ ఆర్'అనే ప్రాజెక్టు ప్రారంభమయ్యేందుకు కారణమైన క్యాన్సర్‌పై అవగాహన కల్పించి.. తొలి దశలోనే దాన్ని గుర్తించేలా చేయడమే ఈ ప్రాజెక్ట్ ముఖ్యోద్దేశం...

**ఎన్నెన్నో కార్యక్రమాలు! ...** ఈ విధంగానే మా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. నిపుణులతో పాడ్‌కాస్ట్ షోలు చేస్తున్నాను. ఆస్పత్రులతో కలిసి.. ఉచిత బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నా. మరోవైపు ప్రభుత్వ అధికారులతో చర్చించి దీనిపై అవగాహన పెంచేందుకు మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తున్నా. బాధితులకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందించాలన్న ముఖ్యోద్దేశంతో నిధులు కూడా అందిస్తున్నారు. భయం, అవగాహన లేమి మౌలిక సదుపాయాల కొరతతో ఏ మహిళా క్యాన్సర్ మహమ్మారికి బలికాకుండా చూడడమే ఏకైక ప్రాజెక్ట్ లక్ష్యం! భవిష్యత్తులో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించే దిశగానూ ప్రణాళికలు రూపొందిస్తున్నా..' అంటూ తన సమాజ సేవ గురించి చెబుతోంది. ప్రస్తుతం 'పాలిటిక్స్-ఇంటర్నేషనల్ రిలేషన్స్' డిగ్రీ చదువుతోన్న ఈ అందాల రాణి చేస్తోన్న మంచి పని ఎంతోమందికి స్ఫూర్తిదాయకం అంటూ నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. □

# వ్యవసాయ అభివృద్ధే లక్ష్యం

ఎఐ అంటూ యువతంతా సాంకేతికత దిశగానే పరుగులు తీస్తోంది అనుకునేవారికి ఈ అమ్మాయిలను చూపాలి. సాగుపై ఇష్టాన్ని పెంచుకోవడమే కాదు.. అగ్రస్థానంలో నిలిచి 'స్వర్ణ' పతకాలూ అందుకున్నారు. భవిష్యత్తుకు బాటలు వేసుకోవడమే కాదు.. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సాగుతున్నారు.

హైదరాబాద్‌లోని జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ (నార్మ్).. దీన్ని వ్యవసాయ వాణిజ్య నిర్వహణలో 'ఐఎస్‌బి'తో పోలుస్తుంటారు. వ్యవసాయ రంగంలో వ్యాపారవేత్తలు. నిపుణులను తీర్చిదిద్దడానికి పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్




అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ (పిజిడిఎం-ఎబిఎం) కోర్సు నిర్వహిస్తోంది. రెండేళ్ల ఈ కోర్సుకు జాతీయస్థాయిలో పోటీ ఉంటుంది. ఏటా 65 మందికే అవకాశం కల్పిస్తారు. అంటే పోటీ ఎంతగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయినప్పటికీ దీనిలో సగానికిపైగా అమ్మాయిలే! నార్మ్‌లో తాజాగా 2021 నుంచి 2023 వరకు మూడు బ్యాచ్‌లకు స్నాతకోత్సవం నిర్వహించింది. మూడింటా బంగారు పతకాలు సాధించారీ అమ్మాయిలు .

**అలా రాష్ట్రాన్ని మార్చాలనీ.. అలన రఫీ (2021-23)**
మాది కేరళలోని త్రిసూర్. బిఎస్సీ అగ్రికల్చర్ పూర్తిచేశాక మా సీనియర్ 'నార్మ్'లో ప్రవేశం పొంది, మంచి ప్యాకేజీతో ఉద్యోగం సాధించారని విన్నా. తన సలహాతో నేనూ ప్రయత్నించా. బంగారు పతకం సాధించడమే కాదు, ప్రాంగణ నియామకాల్లో ఎర్నాకులంలోని ఫెడరల్ బ్యాంక్‌లో రిలేషన్స్ మేనేజర్‌గా కూడా ఎంపికయ్యా. విద్యావంతుల రాష్ట్రంగా పేరొందిన కేరళను వ్యవసాయ రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నది నా కోరిక. ఏడాది ఉద్యోగం చేశాక పూర్తిగా వ్యవసాయ రంగంపైనే దృష్టి పెడదామన్నది నా ఆలోచన. మా తాతలంతా వ్యవసాయం చేసేవారు. వాళ్ల నుంచే నాకూ ఈ ఆసక్తి ఏర్పడింది. రెండేళ్లకోర్సులో ఎంతో నేర్చుకున్నా. దాన్ని మా రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి ఉపయోగిస్తా.

**అంకుర సంస్థ ఏర్పాటు చేస్తా ... పాడి సంహిత (2022-24)** వ్యవసాయ కుటుంబానికి చెందిన అమ్మాయిని. మాది శ్రీకాకుళం. ఎంసెట్ తరవాత వెటర్నరీ, అగ్రికల్చర్ కోర్సుల్లో చేరే అవకాశమొస్తే నేను మొగ్గు చూపింది వ్యవసాయం వైపే! ఈ రంగమంటే అంత మక్కువ. డిగ్రీ తరవాత ఏం చేయాలని ఆలోచిస్తున్నప్పుడు నార్మ్‌లోని పిజిడిఎం-ఎబిఎం కోర్సు గురించి తెలిసింది. తీవ్రమైన పోటీ. అయినా పట్టుదలగా సాధించా. సంస్థ శాస్త్రవేత్తల నుంచి ప్రశంసలూ అందుకున్నా. కోర్సులో రెండేళ్ల ప్రథమ స్థానంలో నిలవడం, బంగారు పతకాన్ని అందుకోవడం ఆనందాన్నిచ్చింది. అంకుర సంస్థను ఏర్పాటు చేసి, రైతులకు మేలు చేసే పరిశోధనలు, ఆవిష్కరణలు చేయాలి, వ్యవసాయ రంగంలో ఎంతో మందికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నది నా లక్ష్యం.




నా ప్రయాణంలో అమ్మానాన్నల ప్రోత్సాహమెంతో ఉంది.

**వాణిజ్యవేత్తగా ఎదగాలని.. సీరం సుప్రియ (2023-25)**
మాది విజయవాడ, నాన్న చిరుద్యోగి, అమ్మ గృహిణి. నేను ఉద్యానకోర్సులో డిగ్రీ అనంతరం వ్యవసాయ




వాణిజ్యవేత్తగా ఎదగాలి అనుకున్నా. దీనిలో ఓనమాలు నేర్చుకోవడానికి 'నార్మ్'లో చేరా. సీటు వచ్చినా ఫీజు సమస్యగా మారింది. నా ఆసక్తి గమనించిన అమ్మానాన్నలు విద్యారుణం తీసుకొని మరీ నన్ను చదివించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదని కష్టపడి చదివా. నా కల నెరవేర్చుకునేందుకు కృషి చేశా. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పారిశ్రామిక, వ్యాపార అంశాలను అధ్యయనం చేశా. పారిశ్రామిక వేత్తగా ఎదిగేందుకు దోహదపడే విషయాలను నేర్చుకున్నా. బంగారు పతకం గెలవడం చాలా ఆనందంగా ఉంది. ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాన్నీ సాధించా. ఉద్యోగానుభవం సాధించాక సొంతంగా పరిశ్రమ స్థాపించాలి అనుకుంటున్నా. వ్యవసాయరంగంలో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని నిరూపించాలన్నది నా ప్రయత్నం. □

# ప్రొటీన్ పౌడర్ తాగుతున్నారా?

**బరువు వేగంగా** తగ్గాలనుకునే వారు, ఫిట్‌నెస్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు ప్రొటీన్ పౌడర్లను తీసుకోవడం గమనిస్తుంటాం. అయితే వాడే ముందు మాత్రం కొన్ని గమనించుకోవాలి. 30 ఏళ్లు దాటాక మన ఎముకల్లో సాంద్రత తగ్గడం



మొదలవుతుంది. కీళ్లనొప్పులు, ఆస్టియోపోరోసిస్ వంటి వాటి బారిన పడొద్దంటే ప్రొటీన్ సరిగా తీసుకుంటున్నామా అన్నది గమనించుకోవాలి. మన శరీరం సరిగా పనిచేయడానికి 20 రకాల అమైనోయాసిడ్‌లు అవసరం. ఇవన్నీ కలిసి శరీరంలో ప్రొటీన్‌లుగా మారతాయి. వీటిలో కొన్ని ఆహారం ద్వారానే అందుతాయి. ఇవి సక్రమంగా అందుతున్నాయా అని రోజూ గమనించుకోవడం కష్టం కదా! అందుకే చాలామంది ఎంపిక ప్రొటీన్ పౌడర్లు అవుతున్నాయి.

**లాభాలెన్నో....** సోయాబీన్, బఠాణి, వరి, బంగాళదుంప, గుడ్లు, పాలు.. వంటివాటి నుంచి సాధారణంగా ఈ పౌడర్లను తయారు చేస్తుంటారు. ప్రొటీన్లు మెటబాలిజాన్ని మెరుగుపరిచి, అనవసర కొవ్వులను కరిగేలా చేస్తాయి. ఎముకలను దృఢంగా మారుస్తాయి. ప్రొటీన్ సంబంధిత పదార్థాలను తీసుకున్నాక చాలావరకూ ఆకలి వేయదు. అలా కెలోరీలు తగ్గుతాయి. గత కొన్నేళ్లుగా ఆస్టియో పోరోసిస్ బారిన పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. వయసుతోపాటు చర్మంలో కొల్లాజన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో నెమ్మదిగా వృద్ధాప్య ఛాయలు మొదలవుతాయి. అది వేగంగా జరగొద్దన్నా, కురుల ఎదుగుదల, గోళ్లు దృఢంగా ఉండాలన్నా తగినంత ప్రొటీన్ తప్పనిసరి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండానూ కాపాడతాయి.

**అయితే జాగ్రత్త ! ...**మార్కెట్‌లో బోలెడు రకాలూ అందు బాటులో ఉన్నాయి. అయితే వాడే ముందు నిపుణుల అభిప్రాయం తీసుకోవడం తప్పనిసరి. అయితే వీటిపైనే పూర్తిగా ఆధారపడటమూ మంచిది కాదు. పోషకా హారం తప్పని సరిగా తీసుకోవాలి. గుడ్లు, పప్పుధాన్యాలు, నట్స్, విత్తనాలు, పాలు వగైరాలకు ప్రాధాన్య మిస్తూనే దీన్ని అదనంగా తీసుకున్నప్పుడే ఆరోగ్య ప్రయోజనం చేకూరుతుందన్నది నిపుణుల మాట. మరి దాన్ని సిరగ్గానే అనుసరిస్తున్నారా అన్నది చెక్ చేసుకుంటారా మరి? □

# కళ్లు మూస్తే మర్చిపోం..

మనలో చాలామంది ఏదో ధ్యాసలో పడి కొన్ని విషయాలను మర్చిపోతుంటాం. తిరిగి ఎంత ప్రయత్నించినా గుర్తు రాదు. అయితే 15 నిమిసాలు కళ్లు మూసుకోండి. అదే గుర్తొస్తుంది. ఎల అంటారా.. లీగల్ అండక్రిమినాలజీ సైకాలజీ జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం కొన్ని నేరాలు జరిగినప్పుడు దానికి సంబంధించిన ప్రత్యేక్ష సాక్షులు ఏదైనా విషయం మర్చిపోతే దానిని గుర్తు చేసుకోవడానికి ఒక



సారి కళ్లు మూసు కుంటారట. అప్పుడు మరింత సమాచారాన్ని గుర్తు తెచ్చు కుంటారని పరిశోధనల్లో తేలింది. కాబట్టి, ఇకపై ఏదైనామర్చి పోయినప్పుడు ప్రశాంతంగా కళ్లు మూసుకొని ఆలోచించండిచాలు. ఠక్కున గుర్తొచ్చే స్తాయి. □

# మొక్కజొన్న పిండితో క్లీనింగ్

వంటకాల్లో రుచిని పెంచడానికి మొక్కజొన్న పిండి వినియోగిస్తాం. అయితే ఇది రుచికే కాదు, ఇంటినీ, వస్తువులనూ మెరిసేలా చేయడానికి కూడా ఉపయోగ పడుతుంది. అదెలాగంటే.. ఇది సహజసిద్ధమైన గ్లాస్ క్లీనర్‌గా పని చేస్తుంది. రెండు కప్పుల నీటికి టేబుల్‌స్పూన్ చొప్పున మొక్కజొన్నపిండి, వెనిగర్ కలపాలి. ఈ మిశ్రమాన్ని స్ప్రే సీసాలో నింపి గాజు కిటికీ, షెల్ఫ్ డోర్స్, టీపాయి, డైనింగ్ టేబుల్ వంటివాటిపై చల్లి మృదువైన వస్త్రంతో తుడిస్తే చాలు. మరకలు, దుమ్ము, గీతలు వంటివన్నీ మాయమై, తళతళలాడతాయి.

→ వాహనం నడిపేటప్పుడు దుస్తులకయ్యే గ్రీజ్, మరకలను ఈ పొడితో తేలికగా పోగొట్టొచ్చు. మరక ఉన్నచోట చెంచా మొక్కజొన్న పిండిని చల్లి 12 గంటలు పక్కన ఉంచాలి. ఆ తర్వాత పిండిని దులిపి వాషింగ్ మెషిన్‌లో



వేస్తే ఆ వస్త్రం నుంచి గ్రీజ్ తేలికగా దూరమై పోతుంది. వెండి నగలు, పాత్రల మెరుపు తగ్గినప్పుడు అరకప్పు పొడిని తీసుకుని సరిపడినంత నీటితో పేస్టులా చేయాలి. దీన్ని వస్తువులకు పట్టించి మృధువుగా రుద్దితే పూర్వపు మెరుపు తిరిగి వస్తుంది. . బూట్లు ఎక్కువసేపు ధరించినప్పుడు చెమట పట్టి దుర్వాసన వస్తాయి. బూట్లలో కొంచెం మొక్కజొన్న పిండిని చల్లి రాత్రంతా వదిలేయాలి. తెల్లారిన తర్వాత షూ దులిపి, పొడి వస్త్రంతో తుడవాలి. దుర్వాసనను ఈ పిండి పీల్చుకోవడంతో సమస్య దూరమవుతుంది. కార్పెట్‌పై పిల్లలు రకరకాల పదార్థాలను ఒంపుతుంటారు. దీంతో ఎంత శుభ్రపరిచినా ముక్కవాసన వదలదు. ముఖ్యంగా నూనె, పడితే ఆ జిడ్డు మరకలు త్వరగా పోవు. ఆ ప్రాంతంలో కాస్తంత మొక్కజొన్న పిండిని చల్లి అరగంటసేపు ఉంచి ఆ తర్వాత, దులిపి శుభ్రపరిస్తే చాలు మరకలూ, వాసనా దూరమవుతాయి. □

# విరిగిన పాలతో ..

వేసవిలో వేడికి పదే పదే పాలు విరిగిపోవడం చూస్తుంటాం. అలాగని విరిగిన ప్రతిసారీ వాటిని బయటపడేయలేం. కలాకండ్, పనీర్.. వంటివీ తరచూ చేసుకోలేం. అందుకే ఇవే కాకుండా.. ఈ విరిగిన పాలను వివిధ రకాలుగా ఉపయోగించు కోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో చూద్దాం ..



- బేకింగ్ మిశ్రమాన్ని కలిపే క్రమంలో పెరుగు, బటర్, క్రీమ్ వంటి ఉపయోగించడం సహజమే. అయితే వీటికి బదులుగా విరిగిన పాలనూ వినియోగించవచ్చంటున్నారు నిపుణులు. ముఖ్యంగా బ్రెడ్, ప్యాన్‌కేక్స్, కేక్స్.. వంటి బేకింగ్ మిశ్రమాల తయారీలో ఈ పాలను ఉపయోగిస్తే అవి మరింత రుచికరంగా, పర్‌ఫెక్ట్‌ వస్తాయంటున్నారు.
- కొంతమందికి కాలంతో సంబంధం లేకుండా చర్మం పొడిబారు తుంటుంది. పొలుసులుగా ఊడిపోతుంది. ఇలాంటప్పుడు విరిగిన పాల మిశ్రమాన్ని చర్మానికి అప్లై చేసుకొని కాసేపు మర్దన చేసుకోవాలి. పావుగంట తర్వాత నీటితో కడిగేసుకుంటే చక్కటి ఫలితం ఉంటుంది. ఈ చిట్కా చర్మానికి మెరుపునూ అందిస్తుంది.
- విరిగిన పాలలో క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఇది మొక్కలు ఏపుగా పెరిగేందుకు దోహదం చేస్తుంది. అందుకే ఈ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో, ముఖ్యంగా టొమాటో చెట్ల మొదళ్లలో వేస్తే ఆశించిన ఫలితం వస్తుంది.
- విరిగిన పాలతో పెరుగూ తయారుచేసుకోవచ్చట. ఈ పాలను మరిగించి గోరువెచ్చగా మారాక.. ఇందులో రెండు టీస్పూన్ల పెరుగు వేస్తే.. కొన్ని గంటలకు గడ్డ పెరుగు తయారవుతుందట! మీరూ ఓసారి ట్రై చేయండి !
- చికెన్, మటన్, చేపలు.. తదితర మాంసాహార వంటకాల తయారీలో పెరుగు, మజ్జిగను వాడుతుంటాం. అయితే వీటికి బదులుగా విరిగిన పాలతోనూ ఈ మాంసాన్ని మ్యారినేట్ చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. తద్వారా వంటకాల రుచి ఇనుమడిస్తుదంటున్నారు.
- కాయగూరలు, పండ్లతో తయారు చేసుకునే సలాడ్ డ్రస్సింగ్ కోసమూ ఈ విరిగిన పాలను ఉపయోగించవచ్చుట! తద్వారా వాటి రుచి పెరుగుతుంది.



- కోడిగుడ్డుతో ఆమ్లెట్, పొరట..వంటివి తయారుచేసుకునేటప్పుడు ముందుగా గుడ్లను బీట్ చేస్తుంటాం. ఈ క్రమంలో కొన్ని విరిగిన పాలను వేసి బీట్ చేస్తే.. అవి మరింత రుచిగా వస్తాయట.
- స్మూతీస్ తయారీలోనూ విరిగిన పాలను వాడడం వల్ల వాటి చిక్కదనం, రుచి.. రెండూ పెరుగుతాయి. □

# భయం - భక్తి

స్వేచ్ఛగా, స్వచ్ఛంగా ఆలోచించటానికిగానీ, కలిగిన ఆలోచనలను యథాతథంగా వెలిబుచ్చటానికి రెండు అడ్డువస్తాయి. అవి భయం, భక్తి, ప్రభుత్వాన్ని గూర్చో, రాజకీయ నాయకులను గూర్చో, పై అధికారులను గూర్చో, మఠాధిపతులను, పీఠాధిపతులను, ప్రవక్తలను గూర్చో మనం స్వేచ్ఛగా ఆలోచించ లేము, మన అభిప్రాయాలను వ్యక్తపరచలేము. నేను శంకరపీఠా ధిపతి భక్తుడినైతే ఆయనలోని లోపాలను చూడలేను. దానికి ఆయనపట్ల వున్న గ్రుడ్డి భక్తి కారణం. అంతేగానీ నాకు సరైన ఆలోచనా ఆయన పట్ల వున్న గ్రుడ్డి భక్తి కారణం. అంతేగానీ నాకు సరైన ఆలోచనా శక్తి లేదని అర్థం కాదు. ఇతర గురువుల్లోని, బాబాల్లోని లోపాలను బాగా పసిగట్టుగలను కానీ వ్యక్తపరచలేను. ఎందుకంటే వారి భక్తుల నుంచి నాకు హాని కల్గవచ్చనే భయం. నేనొక రాజకీయ పార్టీ సభ్యుడినైతే మా పార్టీనేతల్లో పార్టీ సిద్ధాంతాల్లో ఏ దోషమూ కనపడదు. (ఇతర పార్టీనేతల్లో, సిద్ధాంతాల్లో అన్నీ దోషాలు గానే కనపడతాయి) అది గ్రుడ్డిప్రేమ. ఒకవేళ మా పార్టీ ముఖ్య నాయకుడు ఏదైనా చేసినది నాకు తప్పుగా కనబడితే నేను చెప్పను. కారణం నన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తారని భయం. అంతెందుకు మన ఇంట్లోనే మనం వృద్ధులమైతే మన కొడుకులు, కోడళ్ళు చేస్తున్నవి తప్పు అని తెలిసినా చెప్పం. ఎందుకంటే వారు మనపై అలిగి చేయవలసిన సేవలు చేయరేమో, వేరే ఇంట్లో ఉంటామని అంటారేమోనని భయం. లేదంటే వారిపైనున్న గుడ్డిప్రేమ వారి దోషాలను చూడకుండా అడ్డుపడుతుంది. సమీప బంధువులెవరైనా ఆ దోషాన్ని ఎత్తి చూపితే కూడా వాడినే 'చిచ్చుపెట్టేవాని'గా భావిస్తాము కానీ మనకున్న అంధప్రేమను వీడము, భయాన్ని విదలించుకోము. మనసాక్షిని చంపుకొంటూ, ఆత్మద్రోహం చేసుకుంటూ బ్రతుకు బండిని ఈడ్చుకొంటూ పోతాం. ఆత్మవిశ్వాసం, దైవ విశ్వాసం లేనివారమై మిగిలిపోతాం. అలా ఎప్పటికో జరగరాదు.

- రాచమడుగు శ్రీనివాసులు

ఆధ్యాత్మికం

# ఆకట్టుకుందామిలా..

రోజులో 10 గంటలు కార్యాలయాల్లోనే గడిచిపోతున్న గజిబిజి జీవితాలు మనవి. మరి పనిచేసే చోట సంబంధాలు ఎంత అనుకూలంగా ఉంటే చుట్టూ అంత సానుకూలంగా ఉంటుంది అంటే కాదంటారా? మరి అలాంటి వాతావరణాన్ని ఎవరూ తెచ్చిపెట్టరు. మనకు మనమే సాధించుకోవాలి. ఎలా అంటే..

- ★ అనుకూల వాతావరణాన్ని రూపొందించడానికి, అందరినీ ఆకట్టుకోవడానికి పెద్దపెద్ద కసరత్తులు చేయాల్సిన పనేం లేదు. మంచి పలకరింపు, చిరునవ్వు, మనకంటే తక్కువస్థాయిలో ఉన్నవాళ్లకు పనిలో మెలకువలు చెబుతూ, పెద్దవాళ్ల ఇచ్చే సలహాలు పాటిస్తే చాలు. పనిసాఫీగా సాగిపోతుంది.
- ★ చిన్న వాళ్లైనా పెద్దవాళ్లైనా వారి ప్రత్యేక రోజుల్ని గుర్తుపెట్టుకుని శుభాకాంక్షలు చెప్పండి. వీలుంటే కేక్ కట్ చేయించి ఒక చిన్న పార్టీ వాతావరణాన్ని క్రియేట్ చేయండి. మళ్లీ వచ్చే సంవత్సరం దాకా మరచిపోరు సరికదా. మనపట్ల అభిమానమూ, గౌరవం పెరుగుతాయి.



- ★ తోటి ఉద్యోగులు పనిని త్వరగా, సమర్థవంతంగా పూర్తిచేసినప్పుడు మెచ్చుకోండి. అవసరమైతే వారిని ఎలా చేశావంటూ అడిగి తెలుసుకోండి. దీనివల్ల ఇరువురిమధ్యా స్నేహమూ బలపడుతుంది. రోజులో ఎక్కువ సమయం గడిపేచోట స్నేహపూరిత వాతావరణం, లేదా వైరంతో ఎడముఖం, పెడముఖంతో అనేది మనమీదే ఆధారపడి ఉంటుంది. మరి ఒక్కసారి ప్రయత్నించి చూడండి. □

## చెలి చిట్కా

- ✦ మైదా పిండి గోధుమ పిండికీ పురుగుపట్టకుండా ఉండాలంటే నాలుగు చెమ్చాల ఉప్పును శుభ్రమైన బట్టలో మూటకట్టి పిండి డబ్బాలో వేయండి.
- ✦ ఫ్లాస్క్ వాడనప్పుడు దానిలో పావు చెమ్చా పంచదార వేయండి దుర్వాసన రాదు □



# వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు జట్టును ప్రకటించిన ఆస్ట్రేలియా

**న్యూఢిల్లీ:** లార్డ్స్‌లో వచ్చే నెలలో జరగనున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ప్లేయర్లను ప్రకటించింది. ఈ టీమ్‌లో బ్యాటర్ సామ్ కోన్స్‌టాస్‌కు స్థానం కల్పించారు. స్పిన్నర్ మాట్ కుహనేమాన్, సౌత్ ఆస్ట్రేలియా స్పీడ్ బౌలర్ బ్రెండన్ డగెట్ కూడా ట్రావెల్ రిజర్వ్ ప్లేయర్ల జాబితాలో ఉన్నారు. మొత్తం 16 మంది సభ్యులు ఉన్న బృందాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా మంగళవారం ప్రకటించింది. లార్డ్స్‌లో జరగనున్న వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో సౌతాఫ్రికాతో ఆస్ట్రేలియా తలపడుతుంది. ఆ మ్యాచ్ ముగిసిన తర్వాత వెస్టిండీస్ టూర్‌కు ఆసీస్ వెళ్తుంది. అక్కడ జూన్, జూలై నెలల్లో మూడు టెస్టుల మ్యాచ్‌ల సిరీస్ ఉంటుంది. ఆస్ట్రేలియా జట్టుకు ప్యాట్ కమ్మిన్స్ కెప్టెన్‌గా మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నాడు. శ్రీలంకతో జరిగిన టూరులో కెప్టెన్సీ నుంచి దూరంగా ఉన్న అతను ఇప్పుడు మళ్లీ ఆ రోల్ పోషించనున్నాడు.

తోటి టెస్టు క్రికెటర్లు జోష్ హేజిల్‌వుడ్, కెమరూన్ గ్రీన్ కూడా మళ్లీ జట్టులో కలవనున్నారు. అయితే తుది జట్టులో స్థానం కోసం గ్రీన్, బూ వెబ్‌స్టర్ మధ్య పోటీ ఉండే అవకాశం ఉన్నది. ప్రస్తుతం హేజిల్‌వుడ్‌కు భుజం నొప్పి ఉన్నా అతను ఫైనల్ వరకు కోలుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా జూన్ 11వ తేదీన టెస్ట్ చాంపియన్షిప్ ఫైనల్ ప్రారంభంకానున్నది.



# ప్రో హాకీ లీగ్‌కు భారత్ మహిళల జట్టు ఖరారు

## కెప్టెన్‌గా సలీమా టెటె

**న్యూఢిల్లీ:** ప్రో హాకీ లీగ్ చివరి అంచె టోర్నమెంట్‌లో పాల్గొనే భారత్ మహిళల జట్టు ఖరారైంది. 24 మంది సభ్యులతో భారత్ జట్టునుప్రకటించారు. ఈటీమ్‌కు జార్ఖండ్‌కు చెందిన మిడ్ ఫీల్డర్ సలీమా టెటె సారథ్యం వహిస్తుంది. పంజాబ్‌కు చెందిన ఫార్వర్డ్ నవ్‌నీత్ కౌర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ప్రో హాకీ లీగ్ చివరి అంచె మ్యాచ్‌లు యూరోప్‌లోని జర్మనీ,బ్రిటన్,బెల్జియం దేశాల్లో జూన్ 14నుండి 29వరకూ జరుగుతాయి. ఈ టోర్నీలో భారత్ జట్టుమొత్తం 8మ్యాచ్‌లు ఆడుతుంది. భారత్‌జట్టు వరుసగా జూన్14,15 తేదీల్లో లండన్‌లో ఆస్ట్రేలియాతోను, 17,18వ తేదీల్లో లండన్‌లో అర్జెంటీనాతో, 21,22వ తేదీల్లో ఆంట్‌వర్ప్‌లో బెల్జియంతో, 28, 29 తేదీల్లో బెర్లిన్‌లో చైనా జట్టుతో పోటీపడనుంది. మొత్తం 9జట్లు పోటీపడుతున్న ప్రోహాకీ లీగ్‌లో భారత్ ఇప్పటి వరకూ 8మ్యాచ్‌లు పూర్తిచేసుకుంది. ఇందులో2మ్యాచ్‌ల్లో గెలిచి,మరో 2మ్యాచ్‌లను డ్రా చేసుకోగా, మిగిలిన 4మ్యాచ్‌ల్లో ఓటమి చెందింది. మొత్తం తొమ్మిది పాయింట్లతో భారత్ 6వ స్థానంలో ఉంది. టోర్నీ ముగిశాక చివరిదైన తొమ్మిదో స్థానంలో నిలిచిన జట్టు వచ్చే సీజన్‌లో ప్రో లీగ్ నుండి బయటకు వచ్చి నేషన్స్ కప్‌లో ఆడాల్సి ఉంటుంది. ప్రో లీగ్ విజేత జట్టు తదుపరి ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది. భారత్ మహిళల హాకీ జట్టులో సలీమా టెటె (కెప్టెన్), నవ్‌నీత్ కౌర్ (వైస్ కెప్టెన్), సవిత, బిచ్చుదేవి (గోల్ కీపర్లు), సుశీలా చాను, జ్యోతి సుమన్ దేవి, జ్యోతి సింగ్, ఇషిక చౌదరి, జ్యోతి ఛత్రి (డిఫెండర్లు), వైష్ణవి విఠల్ ఫాడ్కే, సుజాత కుజూర్, మనీశా చౌహాన్, నేహా, లాల్‌రెమ్‌సియామి, షర్మిలా దేవి, సునెలితా టొప్పో, మహిమా టెటె (మిడ్ ఫీల్డర్లు), దీపిక, దీపిక సొరెంగ్, బల్జీత్ కౌర్, రుతుజా, బ్యూటీ డుంగ్‌డుంగ్, సాక్షి రాణా (ఫార్వర్డ్‌లు).





# జూనియర్ నేషనల్స్‌లో.. మెరిసిన తెలంగాణ సెయిలర్స్

## 4 స్వర్ణాలు, రజతం, కాంస్యం

**న్యూఢిల్లీ:** జూనియర్ డబుల్ హ్యాండ్ నేషనల్స్‌లో తెలంగాణకు చెందిన నావికులు విజేతలుగా నిలిచారు. హైదరాబాద్ సెయిలర్స్ కొమరవెల్లి లాహిరి, తనుజా కామేశ్వర్, శ్రావణ్ కత్రావత్, బన్నీ బొంగూర్ రిజ్వాన్ మొహమ్మద్, రవి కుమార్ అద్భుతమైన ప్రదర్శనతో వారి ఔన్నత్యాన్ని మరోసారి గుర్తు చేశారు. దీంతో జాతీయ జూనియర్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలర్స్ నాలుగు స్వర్ణ పతకాలు సహా మొత్తం ఆరు పతకాలతో సత్తా చాటారు. ముంబైలోని మార్వేలో జరిగిన ఈ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన లాహిరి అండర్ 16 సబ్ జూనియర్ విభాగంలో పసిడి గెలిచింది. అలాగే తెలంగాణకు చెందిన తనూజ, శ్రవణ్ జూనియర్ డబుల్ హ్యాండర్ విభాగాల్లో విజయాలు సాధించారు. అండర్ 15 విభాగంలో బొంగూర్ బన్నీకి పసిడి, రిజ్వాన్ మహ్మద్ రజతం, రవికుమార్ కాంస్యం గెలిచారు. లాహిరి 9 రేసుల్లో అద్భుతమైన రెగట్టాను 4 విజయాలతో మరియు రెండు రెండవ స్థానాలతో 19 పెనాల్టీ పాయింట్లతో 13 పాయింట్ల తిరుగులేని ఆధిక్యంతో 2025 జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది. అలాగే తనుజా, శ్రావణ్ చివరి రోజున రెండు విజయాలతో జూనియర్ డబుల్ హ్యాండర్‌ను గెలుచుకున్నారు. ఇక ఒమన్ మరియు స్లోవేనియాలో జరిగే ఆసియన్స్ మరియు వరల్డ్స్ కు సిద్ధమవుతున్న టాప్ సీడ్‌గా నిలిచిన తమిళనాడుకు చెందిన శ్రేయ కృష్ణ దురదృష్టవశాత్తు రెండు రేసుల్లో అనర్హత ఎదుర్కొని 5వ స్థానానికి పడిపోయింది.


# టీమిండియాలో యంగ్‌స్టర్లు



## ఎలెవెన్‌లో పెద్ద మార్పులు

## భారత్ టెస్ట్ ఫార్మాట్‌లో కొత్త అధ్యయనం

**న్యూఢిల్లీ:** ఒకరు హిట్ మ్యాన్.. మరొకరు రన్‌మెషిన్.. అయితే ఉన్నట్టుండి రోజుల వ్యవధిలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ ఇద్దరూ లాంగ్ ఫార్మాట్‌కి వీడ్కోలు పలికారు. గతేడాది టీ20 ప్రపంచకప్ సాధించాక ముందుగా కోహ్లీ, ఆ తర్వాత రోహిత్ పొట్టి ఫార్మాట్‌కి ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించారు. టెస్ట్ క్రికెట్‌లోనూ వీళ్లిద్దరూ దాదాపు ఒకే సమయంలో వీడ్కోలు పలికారు. దీంతో టీమిండియాలో యూత్ కీలక పాత్ర వహించనున్నారు. వచ్చే నెల 20 నుంచి ఇంగ్లండ్‌లో ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ప్రారంభంకానుంది. ఇంగ్లండ్ సిరీస్‌లో సిరీస్‌లో ఈ ద్వయం లేని లోటు ఏ ఆటగాళ్లతో భర్తీ చేస్తారనే చర్చ మొదలైంది. వీరిద్దరూ గుడ్‌బై చెప్పిన తర్వాత, భారత్ జట్టు ప్లేయింగ్ ఎలవెన్‌లో పెద్ద మార్పులు చోటు చేసుకున్నాయి. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, రీలి రాహుల్ వంటి యువ ఆటగాళ్లు కీలక పాత్ర పోషించనున్నారు. బౌలింగ్‌లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్, జడేజా వంటి ఆటగాళ్లు భారత్‌కు విజయానికి దారి చూపనున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియాలో భారీ మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఇటీవలి ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌లో రెండు డబుల్ సెంచరీలు, మూడు అర్ధ శతకాలు సాధించిన జైస్వాల్ ఓపెనర్‌గా దాదాపుగా ఖాయం. అలాగే కెఎల్ రాహుల్ ఆస్ట్రేలియాలోని పర్థ్ టెస్ట్‌లో జైస్వాల్‌తో కలిసి 201 పరుగుల భాగస్వామ్యం అందించి జట్టుకు విజయ బాట పట్టించాడు. ఇంగ్లాండ్‌లో సెంచరీ చేసిన అనుభవం కూడా ఉంది. శుభ్‌మన్ గిల్ నంబర్ 3 స్థానం కోసం ఉత్తమ ఎంపికగా భావిస్తున్నారు. కెప్టెన్‌గా అవకాశం రావొచ్చని అంచనా. గబ్బా టెస్ట్‌లో చేసిన 91 పరుగులు ఇప్పటికీ గుర్తుంటాయి. ఇక ఇంగ్లాండ్‌లో ఎక్కువ అనుభవం ఉన్న అజింక్య రహానే లేదా, ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేసిన కరుణ్ నాయర్‌కి అవకాశం ఉండొచ్చు. వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఇంగ్లాండ్‌లో రెండు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు చేసిన అనుభవం ఉన్న పంత్, లోయర్ మిడిల్ ఆర్డర్‌లో కీలకంగా మారతాడు. బౌలింగ్ ఎంపికల విషయానికి వస్తే టాప్ ఆర్డర్ బ్యాట్స్‌మన్‌గా కూడా ఆడగల యువ ఆటగాడు నితీష్ కుమార్ మధ్య మాద్యం పేస్‌తో ఇంగ్లాండ్‌లో ప్రధాన ఆయుధంగా మారొచ్చు. ఇంగ్లాండ్‌లో సెంచరీ చేయడం, మంచి బ్యాటింగ్ నైపుణ్యం ఉండటం వల్ల రవీంద్ర జడేజా కీలక పాత్ర పోషించవచ్చు. బౌలింగ్‌లో తన సగటు మెరుగుపరచాల్సిన అవసరం ఉంది. వికెట్లు తీయగల శక్తి ఉన్న ప్రసిద్ధ్ క్రిష్ణా ఈసారి విదేశీ టెస్ట్ సిరీస్‌లో ఔట్‌స్టాండింగ్ ప్రదర్శన ఇవ్వవచ్చు. మహ్మద్ సిరాజ్ 2021లో ఇంగ్లాండ్‌లో 23 వికెట్లు తీయడంతో తన ప్రభావాన్ని ఇప్పటికే చూపించాడు. లైన్, లెంగ్త్ కంట్రోల్‌తో పనిచేసే ఓ హార్డ్ వర్కింగ్ బౌలర్. ఆరోగ్యంగా ఉంటే జస్‌ప్రీత్ బుమ్రా అనేది టీమ్‌కు బ్రహ్మాస్త్రం. స్వింగ్, సీమ్‌తో ఎవరినైనా కష్టపెడగల శక్తి ఉన్న ప్రధాన బౌలర్. ఇటీవల ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌కు వ్యతిరేకంగా మంచి లైన్, లెంగ్త్‌తో ప్రభావం చూపించిన ఆకాశ్ దీప్, మరో అవకాశం కోసం సిద్ధంగా ఉన్నాడు. ఈ జట్టుతో భారత్ టెస్ట్ ఫార్మాట్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతోంది.





ఆట

# ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో రెండో రౌండ్‌లోనే భారత్ ఔట్

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో భారత ప్రచారం ముగిసింది. చికాగోలో మంగళవారం జరిగిన ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ఆటగాళ్ళు రెండవ రౌండ్‌లో వారి వారి సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోయారు. మహిళల సింగిల్స్‌లో ఏకైక భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ 1-3 తేడాతో ఈజిప్టుకు చెందిన ఫైరౌజ్ అబోయెల్ఖైర్ చేతిలో ఓడిపోయింది. రెండవ గేమ్ చివరిలో అనాహత్ స్కోర్‌లను సమం చేయగలిగింది కానీ చివరికి రాత్రి 28 నిమిషాల పాటు జరిగిన రెండవ రౌండ్ మ్యాచ్‌లో 7-11, 11-8, 4-11, 31-1 తేడాతో మ్యాచ్‌ను కోల్పోయింది. ప్రపంచ ర్యాంక్‌లో 62వ స్థానంలో ఉన్న 17 ఏళ్ల అనాహత్ అంతకుముందు ప్రపంచ 28వ ర్యాంకర్, అమెరికన్ మెరీనా స్టెఫానోనిని తొలి రౌండ్‌లో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్‌లో అభయ్ సింగ్, వీర్ చోత్రాని మరియు రమిత్ టాండన్ కూడా తమ రెండో రౌండ్ మ్యాచ్‌లలో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి నిష్క్రమించారు. సింగ్ ప్రపంచ 13వ ర్యాంకర్, ఈజిప్ట్‌కు చెందిన యూసఫ్ ఇబ్రహీంకు సరితూగలేకపోయాడు, 0-3 (6-11, 6-11, 9-11) తేడాతో ఓడిపోయాడు, అయితే చోత్రాని ఈజిప్ట్‌కు చెందిన టాప్ సీడ్ అలీ ఫరాగ్ చేతిలో 1-3 (11-7, 7-11, 3-11, 10-12) తేడాతో ఓడిపోయాడు. కాగా ఇంగ్లాండ్‌కు చెందిన ఎనిమిదో సీడ్ మార్వాన్ ఎల్షోర్బాగీ చేతిలో 2-3 (9-11, 7-11, 11-5, 11-8, 8-11) తేడాతో ఓడిపోవడంతో టాండన్ గెలుపొందింది. రెండవ రౌండ్ ఫలితాలకు సంబంధించి పురుషుల విభాగంలో అలీ ఫరాగ్ (ఈజీ) బిటి వీర్ చోత్రాణి 7-11, 11-7, 11-3, 12-10, మార్వాన్ ఎల్‌షోర్‌బాగీ (ఇంగ్లండ్) బిటి రమిత్ టాండన్ 11-9, 11-7, 5-11, 8-11, 11-8, యూసఫ్ ఇబ్రహీం (ఈజీ) బిటి అభయ్ సింగ్ 11-6, 11-6, 11-9, మహిళల విభాగంలో ఫైరోజ్ అబోల్‌ఖైర్ (ఈజీ) బిటి అనాహత్ సింగ్ 11-7, 8-11, 11-4, 11-3తో ఓటమి చెందారు.

# వాణిజ్యం

# సెన్సెక్స్, నిఫ్టీలకు భారీ నష్టాలు

**ముంబై, మే 13:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో నిన్న దూసుకెళ్లిన మన సూచీలు.. నేడు భారీ నష్టాలు చవిచూశాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది. సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు మాత్రమే. రిటైల్, హెచ్‌ఎన్ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. అమెరికాచైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.



# ఆపిల్ యూజర్లకు కేంద్రం వార్నింగ్


**వాషింగ్టన్, మే 13:** ఆపిల్ ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్ సాఫ్ట్‌వేర్లలో అనేక లోపాల గురించి భారత ప్రభుత్వం వినియోగదారులకు హెచ్చరించింది. ఈ లోపాలను ఉపయోగించుకుని సున్నితమైన యూజర్ డేటాను సైబర్ నేరస్థులు యాక్సెస్ చేసే వీలుందని, దాంతో పాటు వారి డివైజ్‌లను పూర్తిగా నిరుపయోగంగా మార్చే అవకాశం ఉందని తెలిపింది. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి-ఇన్) ఈ మేరకు ఆపిల్ డివైజ్ యూజర్లకు హై-ఇంటెన్సిటీ హెచ్చరికలు జారీచేసింది. పాత, కొత్త మోడళ్లతో సహా వివిధ ఆపిల్ పరికరాలపై ఈ లోపాలు ప్రభావం చూపుతాయని సిఇఆర్‌టి-ఇన్ తెలిపింది. ఐఓఎస్ 18.3కు ముందు వెర్షన్లతో పనిచేసే ఐఫోన్లు, మోడల్‌ను బట్టి 17.7.3 లేదా 18.3 కంటే ముందు ఐప్యాడ్ ఓఎస్ వెర్షన్లతో పనిచేసే ఐప్యాడ్లపై ఈ ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఆపిల్ అంతర్గత మెసేజింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో కీలకమైన డార్విన్ నోటిఫికేషన్ సిస్టమ్‌లో ప్రధాన లోపాన్ని ఒకటి గుర్తించినట్లు తెలిపింది. దాని ప్రకారం ప్రత్యేక అనుమతులు లేకపోయినా ఏదైనా అప్లికేషన్ సిస్టమ్ స్థాయి నోటిఫికేషన్లను పంపేందుకు అది



అనుమతిస్తుంది. దీన్ని దుర్వినియోగం చేసే డివైజ్ క్రాష్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. ఈ లోపాల ప్రభావం తీవ్రంగా ఉంటుందని సిఇఆర్‌టి-ఇన్ హెచ్చరించింది. హ్యాకర్లు వ్యక్తిగత, ఆర్థిక సమాచారంతో సహా గోప్యమైన డేటాను దొంగిలంచే అవకాశం ఉంది. ఇంటర్నెల్ భద్రతా యంత్రాంగాలను ఇది కట్టడి చేయవచ్చు. ఈసమస్యను పరిష్కారంగా ఆపిల్ లోపాలను సరిదిద్దడానికి సెక్యూరిటీ అప్‌డేట్లను విడుదల చేసింది. యూజర్లందరూ తమ డివైజ్‌లను వెంటనే లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. లేటెస్ట్‌గా అందుబాటులో ఉన్న ఐఓఎస్, ఐప్యాడ్ ఓఎస్ వెర్షన్‌కు అప్‌డేట్ అవ్వాలని తెలిపింది.

# త్వరలో హైపర్‌లూప్ రైలు..

**ముంబై, మే 13:** భారతదేశంలో మొట్టమొదటి హైపర్‌లూప్ ప్రాజెక్ట్ ముంబై - పూణే మధ్య ప్రతిపాదించారు. ప్రస్తుతం ఈ దూరం 34 గంటల్లో చేరుకుంటుంది. అయితే హైపర్‌లూప్ ద్వారా ఈ ప్రయాణం కేవలం 25 నిమిషాల్లో పూర్తవు తుంది. నివేదిక ప్రకారం, 24 నుండి 28 మంది ప్రయాణికులు ఒక పాడ్‌లో కూర్చోవచ్చు. హార్ట్ హైపర్ లూప్ మొదటి విజయవంతమైన పరీక్ష 2019లో జరిగింది. హైపర్‌లూప్ అనేది ఒక హైస్పీడ్ రైలు. ఇది ఒక ట్యూబ్‌లోని వాక్యూమ్‌లో నడుస్తుంది. దీని గరిష్ట వేగం గంటకు వెయ్యి కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇందులో పాడ్‌లు వాక్యూమ్ ట్యూబ్ లోపల అయస్కాంత సాంకేతికతతో నడుస్తాయి. ఈ వ్యవస్థలో శక్తి వినియోగం చాలా తక్కువగా ఉంటుంది. అలాగే ఇది దాదాపు జీరో పొల్యూ షన్‌ను ఉత్పత్తి చేస్తుం ది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ మంగళవారం శ్రీలో ఒక వీడియోను షేర్ చేస్తూ, హైపర్ లూప్ ప్రయాణ మార్గాల్లో ఆధునిక మార్పులను ప్రోత్సహించే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని అన్నారు. ఐఐటీ మద్రాస్‌కు రెండు సార్లు ఒక్కొక్కరికి ఒక మిలియన్ డాలర్ల గ్రాంట్ ఇచ్చామని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి మూడవసారి ఒక మిలియన్ డాలర్ల గ్రాంట్ ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ



హైపర్‌లూప్ ప్రారంభంతో 300 కిలో మీటర్ల ప్రయాణాన్ని కేవలం 30 నిమిషాల్లోనే పూర్తి చేయవచ్చు అని అన్నారు. స్పానిష్ కంపెనీ గ్రెలాస్ హైపర్‌లూప్ వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. యూరోపియన్ నగరాలను గంటకు 1000 కి.మీ వేగంతో అనుసంధానించడం దీని లక్ష్యం. బెంగళూరుచెన్నై మధ్య హైపర్‌లూప్ రైలును నడపడానికి రైల్వేలు ఒక ప్రణాళికపై పని చేస్తున్నాయి. రైల్వే మంత్రిత్వ శాఖ, ఐఐటీ మద్రాస్ ఈ సాంకేతికతపై పరిశోధనలు చేస్తున్నాయి. ఈ దూరాన్ని కేవలం 30 నుండి 40 నిమిషాల్లోనే అధిగమించవచ్చు.

# పదేళ్ల తర్వాత గూగుల్ లోగో మార్పులు

**న్యూఢిల్లీ, మే 13:** గూగుల్ దాదాపు దశాబ్దకాలం తర్వాత తన ఐకానిక్ లోగోలో మార్పు చేస్తున్నట్లు ప్రకటించింది. గూగుల్ లోగో 'జీ'ను కొత్త డిజైన్‌తో పునరుద్ధరిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు కొత్త లోగో వెర్షన్‌ను ఆవిష్కరించింది. ఇది ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల్లో బ్లాక్‌లకు బదులుగా ఒకే రంగులో ఫ్లూయిడ్ గ్రేడియంట్ విధానాన్ని అనుసరించింది. 2015 నుంచి 'జీ' లోగోను కంపెనీ మార్పు చేయలేదు. కొన్నేళ్లుగా ఫ్లాట్‌గా బ్లాక్‌ల్లో రంగులకు బదులుగా జీ లోగో ఇప్పుడు నాలుగు రంగులను మిళితం చేసే గ్రేడియంట్‌ను కలిగి ఉంది. ఇది ఐకాన్‌కు మరింత ఆధునికత, డైనమిక్ రూపాన్ని ఇస్తుంది. అన్ని విభాగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవాలనే గూగుల్ ఉద్దేశానికి ఇది ఒక చిహ్నంగా పని చేస్తుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఏఐ జనరేటివ్ అసిస్టెంట్ గూగుల్ జెమిని బ్రాండింగ్‌కు అనుగుణంగా ఈ పరిణామం చోటు చేసుకున్నట్లు తెలిపారు. గూగుల్ సెర్చ్ యాప్ ద్వారా ముందుగా ఐఎస్, పిక్సెల్ యూజర్లకు కొత్త జీ లోగో అందుబాటులోకి రానుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. గూగుల్ యాప్ బీటా వెర్షన్ 16.18 ద్వారా కొన్ని ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లో కూడా దీన్ని ఉపయోగించనున్నట్లు చెప్పారు. గూగుల్ ఇంకా దీని విడుదల తేదీని తెలియచేయలేదు. అయితే రాబోయే కొన్ని వారాల్లో కొత్త లోగో మరిన్ని డివైజ్‌ల్లో అందుబాటులో ఉంటుందని తెలిసింది.



# అమెరికా వస్తువులపై భారత్ టారిఫ్‌లు!

**వాషింగ్టన్, మే 13:** అమెరికాకు చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నామన్న విషయాన్ని భారత్ ప్రపంచ వ్యాణిజ్యసంస్థకు వెల్లడించింది. ముఖ్యంగా భారత స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రత్యేకమైన అమెరికా వస్తువులకు ఇస్తున్న రాయితీలను నిలిపివేసి.. దిగుమతి సుంకాలను పెంచనున్నట్లు దీనిలో వెల్లడించింది. అమెరికా విధించిన టారిఫ్‌ల కారణంగా.. 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుంది. అగ్రరాజ్యం రక్షణాత్మక వైఖరిని అవలంభిస్తోందని భారత్ తప్పు పట్టిన విషయం తెలిసిందే. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలపై భారీఎత్తున టారిఫ్‌లు విధించారు. క్రూడ్ స్టీల్ తయారీలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ రంగంపై ట్రంప్ టారీఫ్‌ల ప్రభావం పడనుంది. ఈనేపథ్యంలో భారత్ ప్రపంచ వాణిజ్యసంస్థ వద్ద ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య ఘర్షణ పెరుగుతోందనడానికి సంకేతంగా నిలిచింది. సరికొత్త వాణిజ్య ఒప్పందానికి న్యూఢిల్లీ వాషింగ్టన్ అత్యంత సమీపంలోకి వచ్చినట్లు వార్తలొస్తున్న వేళ ఈ పరిణామాలు చోటు చేసుకోవడం గమనార్హం. అమెరికాకు వాణిజ్యలోటును తగ్గించేందుకు భారత్ చాలా రాయితీలను ఈ డీల్ ద్వారా ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది.



# స్విగ్గీ, పేటీఎం షేర్లు డౌన్..

**ముంబై, మే 13:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ షేర్లు మంగళవారం క్షీణించాయి. ఆరు నెలల లాకిన్ పీరియడ్ నేటితో ముగిసిన నేపథ్యంలో ఇవి ఒత్తిడికి గురయ్యాయి. దీంతో స్విగ్గీ షేర్లు ఇంట్రాడేలో ఏకంగా 7శాతం క్షీణించాయి. మార్కెట్ ప్రారంభంలోనే స్విగ్గీ షేర్లు 5 శాతం నష్టంతో రూ.305 వద్ద ప్రారంభమయ్యాయి. లిస్టింగ్ తర్వాత నమోదైన రూ.617 మార్క్ నుంచి స్విగ్గీ క్రమంగా పతనవుతోంది. ప్రస్తుతం పోస్ట్ లిస్టింగ్ గరిష్ఠ స్థాయి నుంచి సగానికి పైగా కుంగింది. ఉదయం 10:20 గంటల సమయంలో స్విగ్గీ షేర్లు 5.40 శాతం నష్టంతో రూ.303 వద్ద ట్రేడవుతున్నాయి. ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం మాతృ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ షేర్లు నేడు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో ఏకంగా 5 శాతానికి పైగా షేర్లు కుంగాయి. పేటీఎం బ్రాండ్‌పై సేవలందించే వన్97 కమ్యూని కేషన్స్‌లో 4 వాటాను రూ.2,066 కోట్లకు ఆర్థిక సేవల సంస్థ యాంట్ గ్రూప్ విక్రయించనుందని వార్తలు వచ్చిన నేపథ్యంలో షేర్లపై ఒత్తిడి పెరిగింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో బ్లాక్ డీల్ ద్వారా షేర్లను విక్రయించనుందని తెలుస్తోంది. దీని ఫ్లోర్ ప్రైజ్ రూ.809.75గా నిర్ణయించినట్లు సమాచారం.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.